# కథాంజలి

(మూడవ భాగం)



Offerings

III

ఆంగ్లమూలం :

గట్టు నారాయణ

తెలుగు అనువాదం :

గజానన్ థామన్

# కథాంజలి

(మూడవ భాగం)



Offerings

III

ఆంగ్లమూలం :

**గట్టు నారాయణ**

తెలుగు అనువాదం :

**గజానన్ థామన్**

# KATHANJALI III
(A Collection of twenty three stories)

ఆంగ్లమూలం : **OFFERINGS III**
**గట్టు నారాయణ**

తెలుగు అనువాదం : **గజానన్ తామన్**

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2006

వెల : అమూల్యం

© సర్వస్వామ్యం

ప్రతులు : 1000

ప్రతులకు : **శ్రీ సీతారామసేవాసదన్**

ముద్రణ :
**సత్యనారాయణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
4-6-143, తిలక్‌రోడ్, కరీంనగర్. (ఆం.ప్ర.)
సెల్ : 98663 95537.

ప్రకాశకులు :
**శ్రీ సీతారామసేవాసదన్**
మంథని - 505 184, కరీంనగర్ జిల్లా (ఆం.ప్ర.)
ఫోన్ : 08729-258439.

## పూర్వపీఠికలు


1. మంథని వాసుల దృష్టిలో
శ్రీ గట్టు నారాయణ గురూజీ – సువర్ణ లక్ష్మణ్ రావు.......... i
2. ధర్మపురి వాసుల దృష్టిలో 1
శ్రీ గట్టు నారాయణ గురూజీ – హనుమాన్ శర్మ
3. ధర్మపురి వాసుల దృష్టిలో 2
శ్రీ గట్టు నారాయణ గురూజీ – వేమూరి లక్ష్మీనరసింహశాస్త్రి .
4. ధర్మపురి వాసుల దృష్టిలో 3
శ్రీ గట్టు నారాయణ గురూజీ – కొరిడె రామారావు


## కథాక్రమం


1. ఏకం సత్ ........................................................... 1
2. కావడికుండలు ....................................................... 3
3. నేరం : శిక్ష........................................................ 5
4. జవాబులు ప్రశ్నలైన వేళ ............................................ 9
5. ద్రష్ట ............................................................... 11
6. దాంపత్యం : ౩౬ – ౬౩................................................ 12
7. మచ్చ ................................................................ 14
8. నలుపు – తెలుపు ..................................................... 19
9. మంథనం.............................................................. 24
10. యోగ్యవ్యక్తి : యోగ్యకృతి ........................................... 29
11. నియతి .............................................................. 35
12. పురస్కారం శిక్ష ..................................................... 35
13. గవేషణ : ఉత్తమవ్యక్తి కోసం ......................................... 45
14. లబ్ధి ................................................................ 56
15. పథనిర్మాత : పథగామి ................................................ 64
16. ప్రేమ ఒక మహస్సు ................................................... 69
17. వేకువ .............................................................. 75
18. సేతువు .............................................................. 77
19. సముద్రం ............................................................ 91
20. ఆచార్యులు : అంతేవాసి చతుష్టయం................................ 93
21. లో వెలుగు .......................................................... 95
22. స్మేరం .............................................................. 99
23. సంబోధి : బుద్ధభగవానుడు.......................................... 114

# మంథని వాసుల దృష్టిలో...
## శ్రీ గట్టు నారాయణ గురూజీ

**సువర్ణ లక్ష్మణ్‌రావు**
అధ్యక్షులు, శ్రీ సీతారామ సేవాసదన్

శ్రీ సీతారామ సేవాసదన్ సంస్థాపకులు శ్రీ గట్టు నారాయణ గురూజీ అన్న యాథాతథ్యం సర్వజనవిదితమే. సమాజానికి పలు సేవలందిస్తున్న సువిఖ్యాత సంస్థకు సంబంధించిన వారమవడం మా పూర్వజన్మసుకృతవిశేషమే. ఆయన పుణ్యశ్లోకుడు, ఆయన తత్త్వజ్ఞానాన్ని ఆయన మాటలలోనే నిర్వచించాల్సి వుంటుంది.

Let us move from 'I' to 'we'
As Humans one family are we.

శ్రీ సీతారామ సేవాసదన్ ఒక సంస్థ కాదు. ఒక బృహత్పరివారం. ఇలా ఏర్పడడానికి కారణం గురూజీ ప్రేరణయే - అథర్వసంహితలోని మంత్రాన్ని ఈ సందర్భంలో సంస్మరించుకోవడం అప్రస్తుతం కాదనుకుంటాను.

జనం బిభ్రతీ వివాచనం నానాధర్మాణం
పృథ్వీయథౌకసమ్
సహసం ధారా ద్రావిణస్య మే దుహాం
ధ్రువేవ ధేనురనస్ఫురనీ.

మనకు ఆవాసమైన సప్తాద్వీపావసుంధరయే ఒక విరాట్పరివారం. నానాధర్మా వలంబులను, నానాభాషాభాషులను ఈ పృథ్వి ధరిస్తున్నది. సహస్రద్రవిణధారలను దోహనం చేస్తున్న మాకు ఈ పృథ్వి అచలగా నిలుచుగాత! 'సంగమనీ వసూనామ్' అంటే సమస్త సంపదలకు కారయిత్రినని వాగ్దేవి వాక్కుగా ఋగ్వేదం ఉదోషిస్తున్నది. పృథ్వి ధేనుతుల్యమే. అయితే పృథ్వీదోహనక్రియ వ్యష్టియైన వ్యక్తి సమిష్టి వైపు ప్రస్థానించినపుడే సాధ్యమని గురూజీ ఆంగ్ల ద్విపదలో చెప్పుతున్నారు.

శ్రీ సీతారామ సేవాసదన్ ఒక పరివారమని ఈ వ్యాసారంభంలో విన్నవించుకొన్నాను. ఆ సంస్థకు కర్తయూ కారయితయూ అయిన నారాయణ గురూజీ మాకు స్వకీయుడు. మేరుపర్వతప్రఖ్యుడు. అలాంటి ఉన్నతవ్యక్తియైన ఆయన వ్యక్తిత్వానికి నిలువెత్తు దర్పణంగా ఒక శబ్దచిత్రాన్ని రూపొందించటం మాకే కాక మరెవ్వరికైనను సాధ్యమయ్యే పరిధిలోనిది

కాదు. భగవంతుడు అట్టి శక్తిని మాకు ప్రసాదించి యున్నా, గురూజీ బహుముఖీన వ్యక్తిత్వానికి అక్షరరూప సంపూర్ణనీరాజనాన్ని సమర్పించటంలో ఔచిత్యమర్యాదలు అవరోధమయ్యే వేమో! అణువులో బ్రహ్మాండాన్ని సందర్శించగల పఠితలకు గురూజీ వ్యక్తిత్వ సమ్యగవలోకనానికి ఈ రేఖాచిత్రం దోహదకారి అవుతుందనే మా విశ్వాసం.

శ్రీ నారాయణ గురూజీ దేశవిదేశాలలో అక్షయమైన కీర్తిని పారిశ్రామికవేత్తగా ఆర్జించుకొన్న సుకృతి.

దేశంలోని అనేకానేక పరిశ్రమలకు, నిగమసమూహాలకు హితవరి. వ్యక్తులుగాని సంస్థలు గాని విపత్తులో చిక్కుకొన్న వేళ పిలిస్తే పలికే నిర్ణోది. విశ్వసందర్శనం కావించుకొని తన అనుభవ, జ్ఞానక్షేత్రాల్ని విస్తృత పరచుకొన్న ధన్యజీవి. ఆయన సందర్శించుకొనని మహనీయులు లేరు. ఆయనతో చర్చకు దిగని ధీశాలులు లేరు. ఆయన చదవని గ్రంథం లేదు. ఆయన గేహమే ఓ గ్రంథాలయం.

ఆయన వ్రాసిన గ్రంథాలు, వ్యాసాలు, నానావేదికల నుండి కావించిన ఉపన్యాసాలు ఈ వ్యాసం వ్రాసేటప్పటికి నాలుగు వందల ఏబది ఎనిమిది. నారాయణ గురూజీకి అత్యంత సన్నిహితుడైన అంతేవాసి శ్రీ హస్ముఖ్ ఉపాధ్యాయగారు వీటిని సంకలించి వేయి పుటల బృహద్గ్రంథంగా 25-12-2005 నాడు (అంటే ఏసుక్రీసు జన్మదినం) ఒక అమూల్య ఉపాయనంగా మాన్యులతో సహా సామాన్యులకు అందించారు. 'గురుబోధ' గా సంజ్ఞితమైన ఈ గ్రంథం బృహన్నారాయణీయంగా ఈ తరానికి, అనాగతతరానికి ప్రేరణాస్రోతస్సుగా నిలుస్తుంది. ఈ గ్రంథాన్ని శ్రీ సీతారామ సేవాసదన్ గ్రంథాలయంలో వాచనార్థం ఉంచినాము.

అయితే ఈ గ్రంథాన్ని అద్యంతం చదవడం ధిషణావైభవోపేతులకు సైతం సాధ్యమయ్యే పని కాదు కానుక ఆయన విరాడవ్యక్తిత్వాన్ని రేఖామాత్రంగా చిత్రించే అలిపిరి ప్రయత్నంగా ఈ వ్యాసాన్ని చూడాల్సినదిగా పఠితలకు మనవి.

స్వదేశంలో, విదేశాలలో ఆయన స్వీయప్రతిభా వ్యుత్పత్తుల వల్ల అమేయకీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకొనడం మంథనివాసులమైన మనకు గర్వకారణం. ఆయనను సన్మానించిన సంస్థలు లెక్కకు మించినవి. ఆయనకు సమర్పింపబడిన సన్మానపత్రాలు వేనవేలు. వ్యాసవిస్తరభీతి కారణంగా, అట్టి అసంఖ్యాక సన్మానపత్రాలలోని కొన్నింటిని మాత్రమే ఎంచుకొని, వాటిలో ఉపయుక్త మనిపించిన వాటిని అంతర్లీనం చేసి, ప్రస్తుత వ్యాసాన్ని పరిపుష్టం కావించే ప్రయత్నానికి పూనుకొంటాను. సన్మానపత్రాలతో పాటు, ఆయన పుస్తకాలకు, ఆముఖంగా చేర్చబడిన వాటిని Source material గా

తీసుకొంటాను. ఆయన వ్యక్తిత్వం అసామాన్యమైనదని ఇదివరకే విన్నవించుకొన్నాను. అట్టి నిరుపమాన వ్యక్తిత్వం గల ఆయన అలికిడి విన్నంతనే కవుల లేఖినులు జల జలమని పొంగిపొర్లుతాయని ప్రత్యేకంగా చెప్పే అవసరం లేదు.

ఆయన అసల్పకీర్తిని గీతాలలో, పద్యాలలో, శ్లోకాలలో అభివర్ణించిన కవుల కవితల్ని పూర్తిగా కాకున్నా, కొన్ని చరణాలనైనా అవసరమనిపించిన చోట, చోటు చేసుకొనేలా చేయడం అనివార్యమైన కర్తవ్యంగా భావిస్తున్నాను. ఇవి కాక, మరెన్ని వనరుల్ని సమీకరించుకొన్నా, నారాయణ గురూజీ వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించే శబ్దచిత్రనిర్మాణం ప్లేటో వచించిన 'Unrealized ideal' గానే మిగిలిపోతుంది. చిరకాలేప్సితం సాకారం కానప్పుడు విషాదమే మిగుల్చుతుంది.

సీతారామ సేవాసదన్ మంథని నారాయణ గురూజీ గారు రచించిన తెలుగు గ్రంథాల్ని, ఆంగ్లంలో రచించిన వాటి తెలుగు అనువాదాల్ని ప్రచురించే సౌభాగ్యానికి నోచుకుంది. ప్రచురించిన ప్రతి గ్రంథంలో వారు నిర్వహించిన లేక నిర్వహిస్తున్న పదవులను గురించి పృష్టావరణంపై ఉల్లేఖించింది. అధిష్ఠించిన పదవుల్ని గురించి ఇక్కడ ముచ్చటించుకోవడం పిష్టపేషణమే అవుతుంది. అయినప్పటికీ, నేటి సభ్య సమాజంలో ఔపచారికత అపరిహార్యమైనందు వల్ల, ఆయన సంప్రతి అలంకరిస్తున్న పదవుల్ని సంక్షిప్తంగా సూచించటం అవసరమనే భావిస్తాను.

ముంబాయి స్థిత 'ఎక్సెల్ కంపనీ లిమిటెడ్' కు ఆయన చెయిర్మన్ ఎమిరటస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దేశంలోని అనేక పారిశ్రామిక సంస్థలకు నిర్దేష్టగా, హితవరిగా వ్యవహరిస్తున్నారు.

నారాయణ గురూజీతో సుదీర్ఘకాలిక సంబంధం కలిగిన మేనేజ్మెంట్ అసోసియేషన్ అహమదాబాదు వారు వారికి ఆగష్టు 2001లో సమర్పించిన సన్మానపత్రంలో వ్యవస్థాపకీయరంగానికి ఆయన అందించిన బౌద్ధిక యోగదానాల్ని ఎంతగానో ప్రశంసించారు. ఆయన దర్శనం లోని నవ్యతను, కర్మయోగులు కాదలచిన వారికి ఆయన రచనలు ఈయగల ప్రేరణను ప్రత్యేకంగా ఉల్లేఖించారు.

ఆయన షష్టిపూర్తి సమారోహాన్ని పురస్కరించుకొని పారిశ్రామిక జగత్తు నుండి అందిన సందేశాలు పుంఖానుపుంఖాలు. ఒక దానిలోని అంశాన్ని ఇక్కడ ఉటంకించడం ఎంతైనా అవసరం.

'ఇరువదవ శతాబ్దపు పూర్వభాగంలో యావత్ప్రపంచం భగవన్నిర్మితమైన మిత్యం గల వ్యవస్థగా మేధావులచే చూడబడినది. గత ఐదు దశాబ్దాల ప్రపంచీకరణ ప్రభావంవల్ల

ఆమూలాగ్రపరివర్తనకు లోనుగాని మానవసంస్థ లేదు. స్థానిక, జాగతిక స్థాయిలో స్పర్థ అనేది సమస్త ఉద్యమ క్షేత్రాలను వ్యాపించింది. ఈ స్పర్ధను అంతరరాష్ట్రీయస్థాయిలో ఎదురొడ్డి నాణ్యతగల ఉత్పత్తులను నిర్మాణం చేయగల క్షమతను, ఉపకరణాలను వ్యవస్థాపన సొంతం చేసుకోవడం నేటి అవసరం. వ్యవస్థాపకీయ సంస్థలు సాంస్కృతికమూల్యాలను విస్మరించరాదు.'

విజ్ఞానం గాను శాస్త్రం గాను పరిగణింపబడుతున్న వ్యవస్థాపన (Management) కు అమూల్యమైన యోగదానాన్ని అందించిన కొలది మేధావులలో గురూజీ ఒకరు. అఖిలభారతీయవితరకసమావేశం లోన్వాలలో 20-02-2004 నాడు సుసంపన్నమైంది. ఏతత్సమావేశం ఆయనకు సమర్పించిన సన్మాన పత్రంలో ఆయన్ని పరిశ్రమ, వాణిజ్య రంగాలకు నైతికమూల్యాలను ప్రదానం చేసిన మాన్యునిగా నివాళులర్పించింది.

బరోడా మేనేజమెంటువారు తమ పంచమరాష్ట్రీయవ్యవస్థాపకీయ నారాయణ గురూజీకి సమర్పించిన సన్మాన పత్రంలో వ్యవస్థాపనాదిశను మరియు దశను మార్చివేసిన మహనీయునిగా నుతించారు. 'ఎక్సెల్ పరివార్' ఆయన షష్టిపూర్తిని పురస్కరించుకొని ఆయన బహుముఖీన వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ సన్మాన పత్రాన్ని సమర్పించింది.

దేశంలో ఆయనను సన్మానించిన సంస్థల బేరీజు వేసినా, అవి సమర్పించిన పత్రాల్ని అంశతః ప్రస్తావించినా ఒక ఉద్గ్రంథమౌతుంది. మహారాజా సయ్యాజీ రావ్ యూనివర్సిటీ బరోడాకు చెందిన డా॥ మయాంక్ ధోలకియా గురూజీ పుస్తకం 'Excellence in Education' కు వ్రాసిన పీఠికలో ఆయనను జ్ఞాన భక్తి కర్మ సమన్వయానికి జీవంత ప్రతీక గా అభివర్ణించారు. వ్యవస్థాపనతోపాటు విద్యావిధానం గురూజీకి ప్రియమైన విషయమని చెప్పడానికి ఉపర్యుక్త గ్రంథమే నిదర్శనం.

గురూజీ గొప్పతనం మాటలకే అంటే ప్రవచనాలకు, వ్యాఖ్యలకు, భాష్యాలకు పరిమితం కాదు. అతని చేతలలో ఆయన కర్మనిబద్ధత సూర్యతేజమంత స్వచ్ఛంగా అభివ్యక్తమౌతుంది.

అభ్యర్థన నందుకొన్న కొలది రోజుల్లోనే కడపలోని బ్రౌను గ్రంథాలయానికి సహాయ సహకారాలనందించి నారాయణగారు ఋషితుల్యుడైన డా॥ జానమద్ది హన్మచ్ఛాస్త్రిగారి ప్రశంసలనందుకొన్నారు.

జీర్ణదేవాలయాలు, మసీదుల ఉద్ధరణకు, విద్యాలయభవనాల నిర్మితికి, బాలోద్యానాల స్థాపనకు ఆయన అందించిన యోగదానం సర్వజనవిదితం. వేదాధ్యయన పరులకు వేదాలు బహుకరించారు. సాహితీ పరులకు పెద్ద దిక్కుగా నిలిచారు. తెలుగు సాహిత్య

క్షేత్రంలో లబ్ధప్రతిష్ఠులైన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య నారాయణరెడ్డి గారు, అధిక్షేపాత్మక కవిగా గణతికెక్కిన తెలుగు విశ్వవిద్యాలయ భూతపూర్వకులపతి పేర్వారం జగన్నాథం గారు, "ఆనంద భిక్షువు", ఆది అజరామర నందించిన డా॥ వి.వి.యల్. నరసింహారావు గారు, "శివానందలహరికి" కావ్యాల తెలుగు వాఖ్యను సమకూర్చిన వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు, ఉస్మానియా యూనివర్సిటీ సేవానివృత్తశాఖాధ్యక్షులు డా॥ యస్వీ. రామారావు గారు, ధర్మపురికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి డా? సంగెనభట్ల నర్సయ్య గారు గురూజీకి సుపరిచితులే. ఆయన బృహత్ పరివారసదస్యులే. సన్మానపత్రాలను, ఆముఖాలను గూర్చి ముచ్చటించుకొన్నాక, కవుల స్పందన లేమిటో పరికిద్దాం. సి.పి. బ్రౌను మెమోరియల్ ట్రస్ట్ కడప తరపున కట్టా నరసింహులు గారు సమర్పించిన అభినందన గేయంలోని దిగువ చతుష్పదిని చదవండి.

ఎన్ని భాషలు? ఎన్ని రచనలు?
ఎంత శాస్త్రము? ఎంత ధిషణము?
అంతకును తా నాలవాలము
గట్టు నారాయణ గురూజీ.

మంథని ఒకనాడు వేదపాఠనపఠనానికి నిలయం. దీపనిర్వాణగంధస్థితికి చేరుకొన్న స్థితిలో వేదపాఠశాలను స్థాపించిన కారణజన్ముడు కీ॥శే॥ కొల్లారపు సీతారామశర్మ గారు సంస్కృతంలో రచించిన "యశోభూషణః" కవితలో గురూజీని "శ్రీమదగట్టుకు లాబ్ధికల్పలతికుని"గా "శ్రీమాన్ యశోభూషణుని" గా "సీతారామ సువంశవర్ధనుని"గా "సౌజన్యప్రేమాశ్రయునిగా" "సర్వవేదాంతదక్షుని" గా అభివర్ణించాడు. శ్రీ జితేంద్ర జోహర్, ప్రఖ్యాత హిందీ కవి గురూజీపై రచించిన శబ్దచిత్రంలో ప్రదర్శించిన చాతురిని గమనించండి.

నామాను కూల్ ఆచరణ్ చారిట
రాకాపతిసమ్ జ్యోతిర్మయ్
యశోవిశాల్
నయనాభిరామ్

గురూజీ "Noble Leader" గ్రంథాన్ని "ఉదాత్తనేతగా" హిందీలోనికి అనువదించిన అజిత్ బచ్చావత్ "సమర్పణ్", అనే కవితలో గురూజీ యెడ తనకు గల భక్తిభావాన్ని బుధజనమోహనంగా ప్రకటించుకున్నాడు. ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు (శారదా పీఠం విశాఖ) నారాయణ గురూజీకి, "ఆర్ష విద్యావిభూషణ" బిరుదాన్ని ప్రదానం చేశారు.

భారతీయ సరస్వతి గళాన్ని విప్పినప్పుడు, ఆంగ్ల శారద మౌనంగా ఉండగలుగుతుందా! "యశ్ పేపర్ ఇండస్ట్రీజ్" అధినేత యైన శ్రీ యశ్ గురూజీ యశోగానాన్ని ఆంగ్లంలో ఈవిధంగా కావించాడు.

A whisper of encouragement, a kind smile
You always uplift us in your charming style

ఇతః పూర్వం నారాయణ గురూజీ పరిచయ భాగ్యానికి నోచని వారు ప్రథమ దర్శనంలోనే 'ఈయనే' అని గుర్తించటానికి ఇంతకు మించిన ఆనవాళ్లు ఏముంటాయి?

నారాయణ గురూజీ అరువదినాలుగేండ్ల జీవితంలో అవిస్మరణీయ మనదగిన ఘటనలు కొల్లలు. ఇక్కడ మూడింటిని గురించి మాత్రమే మాట్లాడుతాను. వాషింగ్టన్, చికాగోలో జరిగిన Vision 2000 conference కు వారు 1993లో వక్తగా ఆహ్వానితులు.

ప్రతిష్ఠాత్మక పురస్కారమైన "International Spirit at Work" ను ఆయన జ్యూరిచ్, స్విట్జర్లాండ్లో అందుకొన్నారు. CIRAN. V Conference (మాంట్రీల్ కెనడా)లో స్వీయాధ్యాత్మికానుభూతులను గురించి ప్రసంగించే సౌభాగ్యాన్ని చేజిక్కించుకొన్నారు.

ఆయన పరిమళవంతమూ, ప్రేమాస్పదమూ, అయిన జీవనయానంలో చిరస్థాయిగా నిలిచే ఘటనను ఉదాహరిస్తూ వ్యాసాన్ని ముగిస్తాను.

బరోడా మేనేజ్మెంట్ అసోసియేషన్ వారు ఫిబ్రవరి 2004లో స్థాపించిన సంస్థను 'గురు నారాయణ సెంటర్ ఫర్ లీడర్షిప్'గా సంజ్ఞతం చేశారు. వ్యక్తిగా సమిష్టికి అందించిన సేవలకు ఇంతకు మించి గుర్తింపు ఏమి ఉంటుంది?

ఆర్షవ్మాయాన్ని సూక్ష్మంగా అధ్యయనం చేసినవాడు, వ్యవస్థాపనకు నవ్యదిశను కూర్చినవాడు, కవిపండిత పోషకుడు, దీనజనోద్ధారణబద్ధకంకణుడు, అస్తిత్వం సందేహాస్పదంగా పరిణమించిన పరిశ్రమలకు పెద్ద దిక్కుగా నిలిచినవాడు, సర్వధర్మసమభావం కలవాడు, మహిళాభ్యుదయానికి అంకితభావముతో పాటుపడినవాడు, మాతృభూమి మంథెన యెడ అపారమైన ప్రేమానురాగాలు కలవాడు మన గట్టు నారాయణ గురూజీ.

ఏవంగుణ విశేషణ విశిష్టుడైన శ్రీ నారాయణ గురూజీకి చంద్రునకొక నూలు పోగుగా ఈ వ్యాసం సమర్పించుకొంటున్నాను.

# ధర్మపురి వాసుల దృష్టిలో... 1
## శ్రీ గట్టు నారాయణ గురూజీ

**హనుమాన్ శర్మ**
వ్యాఖ్యాత, తెలుగు ఓరియంటల్ కాలేజ్

మంత్రపురి వాస్తవ్యులు బ్రహ్మశ్రీ గట్టు రామన్న - శ్రీమతి సీతమ్మ గార్ల పుణ్యాల పంటగా జన్మించిన వారు శ్రీ గట్టు నారాయణ గురూజీ గారు.

**శ్లో॥ గట్టు వంశాబ్ది చంద్రో యం గురు నారాయణాహ్వయః ।**
**మంత్రపుర్యాం సముద్భూతః దేశదేశేషు విశ్రుతః ॥**

కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధ పట్టణమైన, ఒకనాడు మంత్రపురిగా వెలసిన నేటి మంథనిలో జన్మించిన శ్రీ గట్టు నారాయణ గురూజీ గారు దేశవిదేశాల్లో గొప్ప కీర్తిని సంపాదించుకొన్నారు.

**విద్య :**

వీరు "ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్"లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి "మేనేజిమెంట్ స్టడీస్"లో పోస్టుగ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. మరియు వీరు

**శ్లో॥ వేదవేద్గా తత్త్వజ్ఞః నూత్న విజ్ఞాన పారగః ।**
**గీతార్థతత్త్వవేదీ చ నేతృమార్గ ప్రబోధకః ॥**

వేదములను, వేదాన్తములను, ఉపనిషత్తులను, గీతాభాష్యములను, ధమ్మపదమును, భారతీయతత్త్వశాస్త్రములను పరిశీలనా దృక్పథంతో, పరిశోధనాత్మకంగా అధ్యయనం గావించారు.

శ్రీ ఆదిశంకరులు, ద్వైత మత ప్రవర్తకులు శ్రీమాన్ రామానుజాచార్యులు, విశిష్టాద్వైత మత ప్రవర్తకులు మధ్వాచార్యులు మరియు వల్లభాచార్యులు గార్లకు వీరు ఏకలవ్య శిష్యులు.

**శ్లో॥ హిందూధర్మవిచార పాటవమతి ర్విజ్ఞాన సారాంబుధిః**
**వాణిజ్యస్థరహస్యబోధనపటుర్వ్యాపారదక్షశ్శుచిః,**
**అధ్యేతాఖిల వేదశాస్త్ర విషయ వ్యాఖ్యాన సర్వస్వవై**
**గీతాయాః పరమార్థ తత్త్వ విశద వ్యాఖ్యాతృభారోద్వహః ॥**

**విజ్ఞానము :**

వీరు ఒక గొప్ప విద్యావేత్తలు, పరిశోధకులు, తత్త్వబోధకులు, వేదాన్తులు, స్థితప్రజ్ఞులు, సత్పథప్రవర్తకులు, విజ్ఞానులు, మహాత్ములు, కార్యనిర్వహణాదక్షులు. ఇంజనీరింగ్ విభాగంలో అనేక రూపాలలో 40 సం॥లకు పైగా సేవలందజేస్తున్న సేవాతత్పరులు, మహావిజ్ఞానఖనులు, బహుముఖ ప్రజ్ఞాశాలురు, బహుగ్రంథకర్తలు. సరికొత్త కోణాల్లో గీతాధ్యయనం సాగించి తమదైన శైలిలో తాము గ్రహించిన గీతాసారాన్ని తెలుగు, ఆంగ్ల భాషల్లో గ్రంథాల రూపంగా ఆవిష్కరింపచేసిన మహాపరిశోధకులీయన.

**సంస్థలు :**

Excel Industries Limited, Yash Papers Ltd, Punjab Chemical & Pharmaceuticals Ltd., Alpha Drugs India Ltd., Aryan Paper Mills వీరు వివిధ హోదాలలో Private Limited, Mahavir Groups of Enterprises మొదలైన సంస్థలలో – అంటే అధ్యక్షులుగా, నిర్దేశకునిగా హితవరిగా సంబంధం కల్గి యున్నారు.

వీరు మహారాష్ట్రలో Indian Institute of Plant Engineers అను సంస్థను స్థాపించారు. కొంకణదేశములో 'స్మార్తవికాస ట్రస్ట్' నెలకొల్పారు. మంత్రపురిలో తమ తల్లిదండ్రుల పేర "శ్రీ సీతారామ సేవాసదన్" అను సంస్థను స్థాపించి బీదవిద్యార్థుల విద్యాభివృద్ధికి, అనాథలైన వృద్ధులకు ఆవాస భోజన కల్పనకు, గ్రామంలో మొక్కలు నాటడం మంచినీటి సౌకర్యం కల్పించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు, సమాజాభివృద్ధికి, పేదలకు వైద్య సేవలందించుటకు, పాటుపడుచున్నారు. హన్మకొండలోని 'హరిసేవాసదన్', 'గాయత్రి సేవాసమితి' మొదలుగా గల సంస్థలకు సహాయ సహకారాల్ని అందించారు. ఒకే మాటలో చెప్పాలంటే వీరు కమ్యూనిటీ డెవలప్‌మెంట్, వేదవిద్యాభివృద్ధికి భారతీయ సంస్కృతీ పరిరక్షణకు, సామాజికాభివృద్ధికి పాటుపడుచున్నారు.

**రచనలు :**

బహుముఖప్రజ్ఞాశాలురు, వదాన్యులైన వీరు గీతార్థసారమును గ్రహించి పలు భాషలలో రచించిన అనేకగ్రంథాలు, భారతీయసంస్కృతిని, భారతీయతత్త్వమును, నాయకలక్షణములను, కార్యనిర్వహణాచాతురిని బోధించుచు దేశవిదేశ విద్యావేత్తల ప్రశంసలకు పాత్రములైనవి. ఇంతేకాక సనాతన హైందవధర్మంపై వ్రాసిన అనేక వ్యాసాలు, పలు సమావేశాలలో ఈయనచే సమర్పించబడ్డ పత్రాలు పలువురి మన్ననలకు పాత్రములైనవి.

**వృత్తి-ప్రవృత్తి :**

వీరి వృత్తి-ప్రవృత్తులు భిన్న ధ్రువాలు. వీరు ఇంజనీయర్గా మరియు నిర్వహణశాస్త్ర నిపుణుడుగా, పారిశ్రామికవేత్తగ, వాణిజ్యవేత్తగ, అనేక సంస్థల్లో పనిచేస్తుండటం వీరి వృత్తి. అట్లు తన విధిని నిర్వహిస్తూనే నేటి సమాజానికి, యువతకు గృహస్థులకు ఉపయోగకరమగు ఎన్నో ఇ - గ్రంథాలను రచించుట వీరి మరొక ప్రవృత్తి.

ఇంకను, 'చక్రవ్యూహమంత్ర, తారకమంత్ర ఆఫ్ ట్రాన్స్ఫర్మేషన్', 'టర్న్ ఆఫ్ స్ట్రాటజిస్ ఫర్ క్వాటమ్ సక్సెస్', మంథన్ బ్లూ ప్రింట్ ఆఫ్ కార్పోరేట్ వరల్డ్, Essence of Ethical Management అనునవి వీరి వ్యవస్థాపకీయ పరిజ్ఞానానికి దృష్టాంతాలు. వీరి e books, Tapes and CD Roms అహ్మదాబాద్ మేనేజిమెంట్ అసోసియేషన్ ద్వారా Internet లో వెలువరించబడినవి.

దేశ విదేశాల్లో, అనేక సమావేశాల్లో వీరు గావించిన ఉపన్యాసాల ద్వారా, వీరు రచించిన గ్రంథాల పఠనం ద్వారా ప్రభావితులైన ఎందరో ప్రముఖులు వీరి శిష్యకోటిలో చేరి వీరిని గురువుగా స్వీకరించిరి. జీవి ఐహికంగా సమర్థుడుగా, స్థితప్రజ్ఞుడుగా, వ్యవహరిస్తూనే ఆముష్మికంగా ముక్తిని సాధించే మార్గాన్ని వీరు బోధిస్తారు.

శ్రీ నారాయణ గురూజీ గారికి మిక్కిలి ప్రీతిపాత్రమైనది శ్రీమద్భగవద్గీతా గ్రంథం. ఈయన దీనిని అనేక మార్లు అనేక వ్యాఖ్యాలతో సహా పఠించి దాని సారాన్ని సంపూర్ణంగా ఆకళింపుచేసుకొని దానికి సరికొత్త మార్గంలో వ్యాఖ్యారూపంగా వెలువరించబడిన గ్రంథాలే వీరి రచనల్లో ప్రముఖమైనవి.

2004వ సంవత్సరంలో 'ఇంటర్నేషనల్ స్పిరిట్ అట్ వర్క్ అవార్డు' తీసుకోవటానికి Zurich, Switzerland వెళ్ళారు. ఈ సందర్భంగా వీరి Rays and Ways of Human Spirit అను పుస్తకం ప్రకటించబడింది.

గత సంవత్సరం బరోడాలో ఫిబ్రవరి నెలలో "గురునారాయణ సెంటర్ ఫర్ లీడర్షిప్" అను సంస్థ బరోడా మేనేజిమెంటు ద్వారా స్థాపించబడింది.

**బిరుదాలు :**

**శ్లో॥ వేదోద్ధారైక దీక్షోఽయం ఆర్ష విద్యా విభూషణః ।**
**సర్వవేదాన్త దక్షశ్చ గురూజీ చ పితామహః ॥**

**శ్లో॥ మహాత్మాచేతి సౌజన్య ప్రేమాశ్రయ అపీతి చ ।**
**బ్రహ్మో పరాయణ శ్చేతిః భూషితో బిరుదనామభిః ॥**

వీరికి 'గురూజీ' 'ఆర్షవిద్యావిభూషణ', 'సౌజన్యప్రేమాశ్రయ', 'సర్వవేదాన్త దక్ష', 'వేదోద్ధారైక దీక్ష', మొదలుగాగల బిరుదములు బరోడా మేనేజిమెంట్ అసోసియేషన్, సంస్థల ద్వారా ఒసంగబడినవి. సి.పి. బ్రోన్ మెమోరియల్ లైబ్రరీ (కడప), శారదాపీఠం (విశాఖపట్టణం) మొదలైన ఒసంగబడినవి.

వీరు 'రామకృష్ణమిషన్' 'అహ్మదాబాద్ మేనేజిమెంట్ అసోసియేషన్', 'ఎక్సెల్ గ్రూప్ ఆఫ్ కంపనీస్', 'చిన్మయ మిషన్', 'బరోడా మేనేజిమెంట్ అసోసియేషన్' మొదలైన సంస్థల ద్వారా దేశవిదేశాలలో అనేకత్ర పర్యటించి భారతీయతత్త్వాన్ని, ఆధ్యాత్మికశక్తిని, విధినిర్వహణలో వీని పాత్రను ఉపన్యసించి వారిచే కీర్తించబడ్డారు. వీరు 'చికాగో', 'బ్యాంకాక్', స్విట్జర్లాండ్ దేశాలు పర్యటించుటేకాక బరోడాలో 'గీతా జ్ఞానయజ్ఞము'లను నిర్వహించారు.

# ధర్మపురి వాసుల దృష్టిలో... 2
## శ్రీ గట్టు నారాయణ గురూజీ

**వేమూరి లక్ష్మీనరహరి శాస్త్రి**
సేవానివృత్త (ఉప విద్యాధికారి)

వింటిమి నేటి దాక నిను విభ్రమసంభృతబుద్ధి; నేటికిన్
కంటి; మెఱింగి కొంటి మయ, గట్టు వారాన్వయవార్ధిసోమ! ని
ష్కంటకతావకీననయసంధితసత్పురుషార్ధసాధనా
కుంఠితకర్మమార్గ; మివిగో, కొను, ధర్మపురాభినందనల్ ॥

సకలోర్వీశ్రుతమంత్రకూటపురిలో జన్మంబునుం గాంచి, స
ర్వకలాశాస్త్రవిదుండవై, వివిధధర్మజ్ఞానసందీప్తి చే
అడగడండ నకలంకాత్మవివేకముంబడసి, గుర్వాఖ్యన్ ధరన్ నీ పదాం
తికముం జేర్చితి, గట్టు వంశవిలసద్ధీవర్య! నారాయణా!

అమలజ్ఞానికి హైకవిద్య లొక లెక్కా? యింజనీరింగులున్,
శ్రమికోద్యోగనియంత్రణం, బఖిలయంత్రాగారసంధానమున్,
డ కమనీయాద్భుతవస్తునిర్మితియు లోకక్షేమలక్ష్యంబుతో
నిమిడెన్ నీ యెద; ధన్యజీవివి గురూజీ! గట్టు నారాయణా!

ఇంతగునట్టి వానికిది యిల్లు పొలంబు కుటుంబమందు; ర
ల్లంతగు వాని కిల్లును పొలంబు కుటుంబమిదన్న చెల్లునే ।
ఎంతటివాని నంతగ భజింపగ సాధ్యమె యేరికైన; న
త్యంత సుహృన్మదిన్ గను ప్రియంబుగ ధర్మపురాభివాద మ
శ్రాంతజగత్త్రియంకృతిపరంపర నీకు శతాయువయ్యెడున్ ॥

ధ్యేయ మెఱుంగలేక నతి దీనత మోహతమోనివిష్టుడౌ
నా యమరేంద్రసూతిని ప్రజాధిపు లీల మహత్పరిశ్రమా
ధ్యాయి లవెల్ల బోధమున నార్త్ దలంగెద వీవు గట్టు నా
రాయణ! భూసురప్రజవరప్రభవుండవు కానె యీ కలిన్ ?

నరనారాయణబంధతుందిలమహానందానుభూత్యుద్ధిత
స్థిర చిత్తుండవ్వు త్వత్ర్పబోధసుధతృప్తిం గ్రోలి మర్త్యాళి దు
ర్భరనానావిధభేదభాగవతస్పర్థల్ వీడి, సౌహార్దతన్
చిరసౌఖ్యంబుల గాంత్రు గాతను మహర్షీ! గట్టు నారాయణా!

చేసితి వాంగ్లభాష యదుసింహముఖేరితసాంఖ్య గీత, ము
ద్భాసిత లీల. తెల్గు కవితన్ వెలయించెను శ్యామసుందరు;
డీ సుకృతిన్ ప్రకాశ మొనరించితి ధర్మపురీశు మ్రోల; గీ
తా సుమసౌరభం బొసగుతన్ ప్రజకున్ సుఖశాంతి సంపదల్ ॥

శ్రీమద్ధర్మపురీనృకేసరికృపాస్నిగ్ధావలోకంబులన్
క్షేమస్థేయచిరాయురభ్యుదయసుశ్రీవైభవం బొప్ప, ని
స్సీమోత్సాహము తోడ సాధ్విసుజనాసిద్ధానుకూల్యంబునన్
నీ మాన్యాశయసిద్ధి నందు మయ జ్ఞానీ ! గట్టు నారాయణా !

విమలగౌతమీసరిదంకవిలసితులము
నిగమనిగమాంతషట్ఛాస్త్రనిర్భరులము;
ఆర్షవిజ్ఞానసంపాలనాశయులము;
నేటిదా మనబంధ ? మేనాటిదౌనా ?

ధర్మపురబ్రాహ్మణసమాజదత్తమైన
స్వాగతాభినందన పురస్కారమిద్ది
గట్టు నారాయణ గురు సామ్రాట్టునకును
పద్యనవరత్నరుచిదీప్తహృద్యమాల ॥

# ధర్మపురి వాసుల దృష్టిలో... 3
## శ్రీ గట్టు నారాయణ గురూజీ

**కొరిడె రామారావు**
సేవానివృత్త ప్రాచార్యులు

చ॥ అవిరళసేవలన్ ప్రజలకందగ జేసిన ధన్యజీవి, స
త్కవితల నల్లి సత్కృతులు గాంచుచు ధాత్రిని కీర్తనీయుడున్
స్వవిధుల సల్పుచున్ నిరతపావనధార్మికకర్మయోగు నే
సవినయ మిట్టి సద్గురుని సన్నుతి జేసెద "గట్టు" వంశజున్॥

తే॥గీ॥ ఆర్షవిద్యావిభూషణుడాత్మవిదుడు
ఆప్తబంధువు, జనగణహర్షదుండు
ఘనుడు "నారాయణా"ఖ్యుండు గౌతమితటి
"మంత్రపురి" గర్భశుక్తిసన్మౌక్తికంబు బబ

ఉ॥ గట్టువకాడు భారతవికాసకకార్యకలాపకల్పనన్
ముట్టడి గొల్ప యీతులిల మూలములెంచి విదారణంబునన్
దిట్ట యితండు, ధీమహుడు, దివ్యప్రభావవిరాజితుండునున్
పెట్టని కోట విప్రులకు విశ్వహితుండును, లోకమాన్యుడున్॥

సీ॥ ✶శ్రీ సీత రామార్ష సేవాసదనమన్
స్వచ్ఛందసంస్థసంస్థాపకుండు
ప్రకృతిభీభత్సముల్ పారద్రోలగ దల్చి
పర్యావరణరక్ష బరుచువాడు
ప్రతిభాప్రకాశులై ద్రావిణవంచితులైన
విద్యార్థికోటికి వేల్పుతరువు
వయసు మరియు పలువంతలపాలైన
ఆర్తజనత నెల్ల నార్తిహరుడు

✶శ్రీ సీతారామ సేవాసదన్

తే॥ జీర్ణదేవాలయోద్ధర్తృ శీలుడెపుడు
రమ్యగీతాల సద్గ్రంథ రచయితయును
గణుతి సేయ రానటు ధర్మకార్యనిరతి
బూని సల్పిన భువి పుణ్యపురుషు డితడు ॥

ఉ॥ మానవచేష్ట లీ కలిని మర్కటలీలల పోల్కి సాగగా
మానవరూపదానవుల మాయలు నెల్లడ తాండవింపగా
మానవజన్మసద్గతికి మంత్రినిభామరగ్రంథకర్తయై
మానవుడార్షసత్రియల మాధవు డౌను సూత్రాకారుడున్ ॥

శా॥ శ్రీనారాయణుడే జనించి జగతిన్ శ్రేయంబులన్ గూర్ప, తా
కానన్ వచ్చె ననేక గీతకృతి సత్కార్య ప్రపంచంబునన్
దానాంభోదుడు దివ్యధర్మపురికి దైవాంశుడేతెంచగా
మా నారాయణుడాత్మ బాంధవునకీ మందారదామావళుల్‌బబ

శా॥ లీలామానుషవిగ్రహుండు, విజయున్, క్లిష్టార్థ, నిర్వీణు, న
వ్వేళన్ సాంఖ్యమతాత్మయోగమున సంవిన్నిష్ఠ గావించిన
ట్లా లక్ష్యంబున మానవాళి కెద స్థైర్యంబున్ ప్రసాదింప తా
నాలోచించి రచింప, తత్కృతి యిదే యావిష్కృతం బీపురిన్ ॥

చం॥ స్థిరత సమర్థతల్ వెరసి చిత్తవిశుద్ధతసత్యశాంతులన్
కరతల మొంద జేయునను కావ్యమిదే *'స్టెబులున్ యెబుల్' భువిన్
పరమము నాత్మతత్త్వ మెదపాళిని భాసిల జేయ, శ్యామసుం
దరునిగ స్వస్వరూపతను దాల్ప నొనర్చెడిదౌ జనాళికిన్

మ॥ నర ! నారాయణ నామధారివయి తన్మాహాత్త్వ సందీప్తిచే
పరమానందద సాధుకావ్యరచనావ్యాసంగమగ్నాత్మవై
నరతత్త్వంబును దైవతత్త్వమునుగా స్పంధించి బోధించి నీ
నరజన్మంబును ధారవోసితివి శ్రీనారాయణా! తేనమః ॥

*The Stable and Able*

శా॥ ఎన్నో సంస్థల కిద్ద దానములు గీర్తింపన్ దరంబౌనె! యె
న్నెన్నో శాశ్వత సేవలన్ కృతుల నేనెంచంగ నేరన్ సుమీ!
విన్నె కన్నవి కొన్ని మాత్రమిటనే పేర్కొంటి త్వల్లీలలన్
నిన్నె వ్వారితో బోల్చదగునో నీవే గురూ! దెల్పుమా!

మ॥ సమతాభావసమృద్ధమానససరోజాధీశ! యోగేశ! స
ర్వమతాచార్యనిదేశసత్యపథసంద్రష్టా! స్థితప్రజ్ఞకా!
స్వమతస్థాపనశక్తియుక్తిప్రతిభాభ్రాజిష్ణు నారాయణా
ఖ్యమహాభాగ! మహాత్మ! నీకివే సభన్ కై మోడ్పు సంభావనల్?

ఉ॥ పూతవిచిత్రసచ్చరితపుణ్యఫలప్రదకర్మయోగికిన్
భౌతికదైవికాత్మపరభాసురతాత్త్వికజ్ఞానయోగికిన్
భూతభవద్భవిష్యదనుభూతిసమంచితరాజయోగికిన్
బ్రాతిగ తత్త్వవేత్త గురురాజునకీయవి మంగళారతుల్ ॥

మ॥ ఇల నీ జన్మ ప్రయోజనాప్తము మహర్షీ! గట్టు నారాయణా!
కలికాలాహివిషాశిదష్టజనసంక్రాంతార్తినిర్వాపణన్
పలుయజ్ఞంబు లొనర్చినావు "సుజనా" సాధ్యాత్మజోల్లాసివై
కలకాలంబిటు వర్ధిలన్ "నృహరి" త్వత్కాంక్షల్ తగన్ దీర్చుతన్?

చ॥ గురుకృతనాంగ్లసత్కృతిని కోమలగీతిని యార్షసంస్కృతిన్
పరహితకాంక్షమై తెలుగుభాషను భాష్యపు ఫక్కినెంచి, సుం
దరముగ నన్వదించె ధిషణన్ "స్థితప్రజ్ఞుని" యాత్మతత్త్వమున్
కరుణ దల్పిర "శ్రీనృహరి" గావుత నీకవి "శ్యామ సుందరున్" ॥

శా॥ ఈ"నారాయణ చిద్విలాసము"ను వర్ణింపన్ దలంకొంటి నే
నానాదేశవిదేశప్రాజ్ఞజనసన్మాన్యోర్రు చారిత్రమున్
నేనా దెల్యమి వచ్చిరాని నుడులన్ గీర్తించితిన్ సదాహృదిన్
శ్రీనారాయణ ! బ్రాహ్మ్యసత్కృతులివే చేగొంచు దీవింపుమా!

# 1. ఏకం సత్

విలువకడితే వేయి కోట్లు చేసే ఓ సువిఖ్యాతమైన కంపనీకి చెందిన నిర్దేశక బృందాన్ని (Board of Directors)ను సంబోధిస్తూ గురూజీ ఇలా అన్నాడు. "వాస్తవమనేది వీక్షకుని ఆలోచనా సరణిని, మానసికస్తరాన్ని బట్టి వుంటుంది. దీనికి కొన్ని దృష్టాంతాలిస్తాను వినండి:"

వ్యాసభగవానులు చారువాకుణ్ణి ఇలా ప్రశ్నించాడు.

"నీ వెక్కడి నుండి వచ్చినావు. నీవు చేరుకొనవలసిన చోటు ఎక్కడ? వీటిని గురించి గంభీరంగా ఆలోచించావా? జీవనానికి ప్రయోజన మనేది ఉందా?

చార్వాకుడిలా బదులు చెప్పాడు.

"నేను నా మాతుల గృహం నుండి ఈవలికి వచ్చాను. విపణికి వెళ్ళుతున్నాను. మత్స్యక్రయం ప్రస్తుతప్రయోజనం!!"

నారాయణకౌండిన్య సురేశ్ను అడిగారు.

"నీవెక్కడనుండి వచ్చిందీ, ఎక్కడకు వెళ్ళేది" అనే విషయంలో దీర్ఘ కాలం విచారించి, ఓ నిష్కర్షకు వచ్చావనే అనుకుంటాను. అలాగే జీవితానికి గల ప్రయోజన మేమిటో చెప్పగలవా?

సురేశ్ సవినయంగా ఇలా జవాబు చెప్పాడు.

"నా జన్మకు కారకులు నా తలిదండ్రులు. నేను ఏర్పర్చుకొన్న లక్ష్యాన్ని చేరుకొనటానికి మీ ఆశీర్వాదంతో ముందుకు సాగుతున్నాను. సమాజం నుండి పొందే దానికి వేయంతలు ఈయాలన్న సంకల్పంతో అహర్నిశలు పాటుపడుతున్నాను. ఇంతకన్న వేరే ప్రయోజనం జీవితానికి ఉంటుందని నేను భావించడం లేదు, గురూజీ!"

పూజ్యులైన గోవిందపాదులు శిష్యులైన శ్రీ శంకరభగవత్పాదులను ఇలా "నీ ఆగమనగమ్యాలను గూర్చి వైచారికమంథనము సల్పితివనే భావింతును. మానవజీవనముకు గల ప్రయోజన మేమిటో స్పష్టపరుపగలవా?"

అసమానధీయుక్తులైన శంకరభగవత్పాదులు ఆచార్యులడిగిన ప్రశ్నకు ఇలా బదులు చెప్పారు.

"పూర్ణత్వం నుండి ప్రాదుర్భవించిన నేను పూర్ణత్వం లోనే విలీనమౌతాను.

జీవనప్రస్థానంలో పూర్ణత్వానుభూతిని పొందటం మానవుల ఏకైకలక్ష్యమై యుండవలె.”

బుద్ధుడు మహాకశ్యపుని ఇలా ప్రశ్నించాడు.

“నీవు ఎక్కడి నుండి వచ్చినావు. ఎక్కడికి వెళ్ళుతున్నావు. నీ దృష్టిలో మానవజీవనానికి ప్రయోజనం ఉందా? దీనిని గురించి గంభీరాలోచన సల్పినావా?”

గౌతమునకు అంతేవాసియైన మహాకశ్యపుడు ఇలా సమాధానమిచ్చాడు.

“భంతే! శూన్యం నుండే నా ఆవిర్భావం. శూన్యం లోనే నా లయం. మానవజీవనం నిష్ప్రయోజనం.”

అష్టావక్రుడు జనకమహరాజును ఇలా ప్రశ్నించాడు.

“రాజా! నీ ఆగమనప్రస్థానాల గురించి గంభీరంగా ఆలోచన సల్పినావనే నా భావన. నీ దృష్టిలో మానవ జీవనానికి గల ప్రయోజన మెట్టిది?”

ప్రశ్రయమూర్తియైన జనకుడు ఆచార్యుడడిగిన ప్రశ్నకు ఇలా బదులు చెప్పాడు.

“నే నెక్కడి నుండియో వచ్చినది లేదు. ఎక్కడికో వెళ్ళునది లేదు. జీవనం ప్రయోజనరహితమన్నదే నా మతం గురుదేవా!”

కృష్ణుడు మందహాసం కావించాడే తప్ప ఆచార్యుడైన భీష్ముణ్ని ఏమీ అడుగలేదు. భీష్ముడు మందస్మితం చేశాడే తప్ప పెదవి విప్పలేదు.

గురూజీ తన భాషణను ముగించారు. సమావేశం కొన్ని క్షణాల పాటు మౌనధారణ చేసింది.

**వాస్తవికతను గురించి ప్రశ్న ఒక్కటే - సమాధానాలు లెక్కకు అందనివి.**

# 2. కావడి కుండలు

పితృవ్యసంతానమైన క్రూరకౌరవులచే రాజ్యబహిష్కృతుడై, పత్నీసోదర సమేతుడై ఘోరారణ్యాలలో నివాసమేర్పర్చుకొన్న యుధిష్ఠిరుడు రాజవంశీయులెవరు చవిచూడని ఇడుమలను అనుభవించినాడు. అణుమాత్రం చెక్కుచెదరని ధైర్య సాహసాలతో ప్రాప్తపరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఒకనాడు ఏ కారణం వల్లనో అనాకలనీయవేదన ఆయన మనస్సును ఆవహించింది.

కింకర్తవ్యతా విమూఢుడై, కటిక చీకటిలో దిక్కు గానక కొట్టు మిట్టాడుతున్న వేళ, పరమతపోవృద్ధుండయిన మార్కండేయముని పాండవులుంటున్న ఆశ్రమానికి వేంచేశారు. పాండవులు ప్రత్యుద్ధతులై యథోక్తవిధుల పూజించి సుఖాసీనుణ్ణి చేశారు.

ముని మ్రోల నతమస్తకుడై నిల్చున్న ధర్మజుని దుఃఖం కట్టలు త్రెంచుకొంది. పసిపిల్లవాడిలా భోరున విలపించి తన దుస్థితిని సవిస్తరంగా తెలుపుకొన్నాడు.

ధర్మజుని పరిదేవనమును కారుణ్యమూర్తియైన ముని ఆద్యంతం ఆకర్ణించి ఒకదాని తరువాత ఒక ప్రశ్న వేశాడు.

"నాయనా! నీవు ఆకలి దప్పులకు గురికావటం లేదుకదా?"

"భగవాన్! మూర్తీభవించిన క్షాత్ర మనదగిన సహోదరులున్నందున భక్ష్య భోజ్యములకు కొదవలేదు. తిని ఇతరులకు పెట్టగల స్థితిలో ఉన్నాను. కందమూల ఫలము లిచట విరివిగా దొరుకుచున్నవి."

"కంటకాకీర్ణమైన ఈ ప్రాంతమున చరించుటకు ఉపానహములు కలవా?"

"లేకేమి? ఉన్నవి."

"నీవు ఒంటరివి కాదుగదా! పత్నీసమేతుడవై కాననవాసము చేయుచుంటివి కదా!"

"అరణ్యవాసము భరింపరానిదైనను, పరమసాధ్వి ద్రౌపది నాకు తోడుగా నిలిచి కష్టములలో పాలుపంచుకొంటున్నది."

క్షణవిరామానంతరం ముని మరో ప్రశ్న వేశాడు.

"నీకు రిపుల వలన బాధయున్న విషయము నాకు తెలియును. వారి పడకుండ సువ్యవస్థితరక్షణవ్యవస్థ ఉన్నదా?"

"పరిమాణంలో అల్పమే యైనను, అనల్పవిక్రమాఢ్యమైన ద్రుపదవాహిని నన్ను కంటికి రెప్పవోలె కాపాడుచున్నది".

మార్కండేయముని హావభావములు మార్పుకు లోనైనవి. శాంతగభీర స్వరంతో ఇలా సెలవిచ్చారు.

"నాయనా! ధర్మరాజా! అయోధ్యానగరము నుండి నిష్కాసితుడైన రాముడు పన్నెండేళ్ళు గహనారణ్యవాసము చేసినాడు. అయోధ్యను వీడునపుడు అర్ధాంగిని యైన వైదేహిని, అనుజుడైన సౌమిత్రిని దప్ప వేరెవరిని తోడుగొనలేదు. భరతునకు పాదుకల నిచ్చి అన్నృక్షరం గాని విపిన ప్రదేశమున సంచరించినాడు. ముళ్ళు కళ్ళు మూసుకొని మార్గములందు పడియున్నవనియా నీ భావన! గ్రీష్మతపమును భరించినాడు. శిశిరశైత్యమును సహించినాడు. ఆకలి దప్పుల కోర్చినాడు. రావణుడు భార్యను అపహరించిన మీద దాంపత్యజీవనమాధుర్యవంచితు డైనాడు. క్షాత్రగంధము లేని వానరులను సైనికులుగా జేసికొన్నాడు. రామునికి పట్టిన దైన్యస్థితిలో నీవు లేవు. పసికూనవోలె ఎందులకని విలపించుచున్నావు?"

మార్కండేయముని సమయోచితవచనములు విన్న ధర్మజునకు సాంత్వన చేకూరినది. మనఃపటాలన్ని వ్యాపించిన కారుమేఘవితతి పటాపంచలైనది. వాస్తవికత అవభోదమై, ధర్మజుడు ఋషికి ప్రణమిల్లినాడు. అమేయకరుణానిధులైన మార్కండేయులు చివరి మాటగా ఇలా అన్నారు "స్వభావతః మానవుడు తనకు కల్గిన గోరంత విపత్తును కొండంత విపత్తుగా భావించుకొనును. కష్టాలు చవిచూడని మానవుడున్నాడా? ఇతరులతో పోల్చునెడ మనము పడిన ఇడుములు ఏపాటివి!"

యుధిష్ఠిరుడు కార్పణ్యవృత్తిని వీడి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి కూడగట్టుకొని అతిథిగా వచ్చిన మునికి సకలసపర్యలొనర్చి ధన్యజీవనుడైనాడు.

మనకు వచ్చిన కష్టాలు కొండంతలుగా
ఇతరులకు వచ్చినవి గోరంతలుగా భావింపరాదు.

# 3. నేరం : శిక్ష

యుధిష్ఠిరుడు పంచపాండవులలో జ్యేష్ఠుడు. న్యాయా న్యాయ బుద్ధితో పాటు, యుక్తాయుక్తవివేకం కలవాటవడంవల్ల ఆయన్ని 'ధర్మరాజు'ని ప్రజలు వేనోళ్ళ పొగడసాగారు. ఎంతటి సత్పురుషుణ్ణయినా పొగడ్త అహమన్యుణ్ణి చేస్తుంది. అలాంటి వేళ, ప్రభావితుడు కాకుండా ధర్మరాజు మాత్రం ఎలా ఉండగల్గుతాడు! 'విగ్రహవాన్ ధర్మః' తానే నన్న భ్రాంతిగ్రస్తుడైనాడు పాండవాగ్రజుడు. ఆయనలో కల్గిన ఈ మార్పును శ్రీకృష్ణుడు ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు.

సంపద్విధ్వంసంతో పాటు, అపారజననష్టంతో ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో సంగ్రామం ముగిసింది. కౌరవేయులు నామరూపాలు లేకుండా పోయారు. హస్తినాపురానికి పాండవులు అధిపతులైనారు.

యుధిష్ఠిరుడు రాజ్యమేలుతున్న వేళ ఎన్నడూ కనివిని ఎరుగని ఓ విషాద ఘటన సంభవించి సంచలనాన్ని సృష్టించింది. ఓ ఆలయంలోని బంగరు పళ్ళేరాన్ని తస్కరించే ప్రయత్నంలో ప్రధానార్చకుడు రక్షకభటులకు దొరికిపోయాడు. వారు అపరాధిని ఇనుప సంకెళ్ళతో బంధించి యుధిష్ఠిరుని ధర్మాసనం మ్రోల నిలిపారు. మహారాజా వారు కింకర్తవ్యతావిమూఢులైనారు. చౌర్యం స్మృత్యనుసారం శిక్షార్హమైన నేరమే యైనా చోరుడు ఆలయార్చకుడు కనుక దండ్యుడు కాడు. వాని ధన ప్రాణమాననష్టానికి పాలుపడే న్యాయాధికారి పాపభాజనుడవుతాడు. అలాంటి వేళ ఏది కార్యం అనే దీర్ఘాలోచనలో పడిపోయారు. 'మార్గం చూపుడని' యదుకుల భూషణుడైన శ్రీకృష్ణుని ఎంతగానో ప్రాధేయపడ్డాడు. అందుకు కృష్ణుడు ఇలా అన్నాడు.

"క్షత్రియకులజునకు అవబోధం గాని ధర్మసూక్ష్మమిది. నావంటి సామాన్యుడైన యాదవుడు సంశయగ్రంథిని విప్పగలడా?"

యుధిష్ఠిరుడు నిలువునా చలించిపోయాడు. అయినా తన పట్టును వీడలేదు. చేయునది లేక శ్రీకృష్ణుడు 'పాతాళాధిపతియైన బలిని అభ్యర్థించుటయే ఏకైక పర్యాయమని' ధర్మజునికి హితవు పలికాడు.

యుధిష్ఠిర శ్రీకృష్ణులు బహుప్రయాసలకోర్చి పాతాళలోకం చేరుకున్నారు. రాజసౌధాన్ని ప్రవేశించే ప్రయత్నంలో దౌవారికుడైన వామనునిచే నివారింపబడ్డారు. "ఏ పనిమీద ఇక్కడకు వచ్చారు. మీరెవరు?" గద్దించాడు వామనుడు. యుధిష్ఠిరునకు మిన్ను విరిగి మీద పడినంత పని అయింది. 'హస్తినాపురాధీశ్వరునిగా జగన్మాన్యతగల

నన్ను ఈ ద్వారరక్షకుడు ఎరుంగడా? 'హతివిధీ!' అంటూ లోలోపల వాపోయాడు. అన్యపర్యాయాభావం వల్ల పొట్టివాణ్ని అనునయించే ధోరణిని అవలంబించినవాడై ఇలా అన్నాడు "శ్రీమాన్! ఒక ముఖ్యమైన పని మీద చక్రవర్తుల సందర్శనార్థం వచ్చినారము. మా రాక శ్రీవారికి ఎరిగింపవలె." అందుకు వామనుడు వెటకారాన్ని మాటల్లో వెలయిస్తూ ఇలా అన్నాడు. "మీ బోంట్లకు సమయమీయడమే పనిగా పెట్టుకొన్నారా మా ప్రభువులవారు!"

జన్మలో చవిచూడని అవమానాన్ని హస్తినాపురాధీశునకు దిగమింగక తప్పినది కాదు. తననూ, తనతో ఉన్న మహనీయుణ్ణి పరిచయం చేసుకొనే నిమిత్తం ఇలా అన్నాడు. "అయ్యా! ద్వారపాలా! హస్తినాపురం రాజధానిగా ఉపఖండమనదగిన యావద్ భారతదేశానికి సార్వభౌముడను నేను. నన్ను యుధిష్ఠిరుడంటారు. నాతో పాటు వచ్చిన ఈయన శ్రీకృష్ణుడు. యదువంశాగ్రణి అయిన ఇతడు నాకు పరమాప్తుడు."

ఏమాత్రం చలించని వామనుడు 'అలాగా' అంటూ ఎగాదిగా చూసి ఇలా అన్నాడు. "హస్తినాపురమా? భారతదేశమా? వీటిని గురించి మేము వినలేదే! చక్రవర్తి గారి నర్మసచివులను అడిగి తెలుసుకొంటాను" ఇలా అని వామనుడు నిష్క్రమించి ఓ జాము గడిచాక ప్రత్యక్షమైనాడు. క్షణము యుగ మనిపించినా ఈ విరామాన్ని స్థితప్రజ్ఞుడైన ధర్మజుడు సైచినాడు. తిరిగివచ్చిన వామనుడు ఇలా అన్నాడు "ప్రభువుల వారు చదరంగ క్రీడానిమగ్నులై యున్నారు. మీరు వేచి యుండవలె!"

దీర్ఘప్రతీక్షానంతరం వామనుడు యుధిష్ఠిరశ్రీకృష్ణులకు ముఖ్యసచివుణ్ణి సందర్శించే మహదవకాశం కల్పించాడు. ఉన్నతోద్యోగుల తరహాలో ఆహ్వానం పలుకకుండానే ప్రశ్నల వర్షం కురిపించసాగాడు "మీ పేరేమిటన్నారు? మీ క్రమ సంఖ్య ఏమిటి? ? ?..."

యుధిష్ఠిరుడు అయోమయస్థితిలో కొన్ని క్షణాలుండి మెల్లిగా తేరుకొని ఇలా అడిగాడు. "క్రమసంఖ్య అంటున్నారు. నాకేమీ బోధపడటంలేదు. దయచేసి స్పష్టపరచండి".

యుధిష్ఠిరుడు ప్రదర్శించిన వినయానికి ఉప్పొంగిపోతూ, ఈశన్మమందహాసం కావిస్తూ, తలను పంకించాడు. కింకరుని ద్వారా ఓ బృహద్గ్రంథాన్ని తెప్పించుకొని, తెరచి ఆ ఈ పుటను పరిశీలించి ఆసనానికి అర్హమైన హుందాతనాన్ని ఒలకిస్తూ, ఇలా సెలవిచ్చాడు.

"చూడండి! మీకు పూర్వం విభిన్నయుగాల్లో మూడు వందల ఇరువది యొక్క యుధిష్ఠిరులు ప్రభువుల వారిని సందర్శించుకొన్నారు. అట్టి యెడ మీరు మూడు వందల

ఇరువది రెండవ వారన్న విషయము స్పష్టము. మీ క్రమసంఖ్య ఏమిటో ఇక చెప్పవలసిన పని లేదనుకొందును. ప్రభువుల వారు మీతో మీ మిత్రునితో సహా భేటీ అయ్యేందుకు తమ సుముఖతను తెల్పినారు.”

యుధిష్ఠిరుడు కనులు తెరచాడు. ‘తనలాటి అసంఖ్య యుధిష్ఠిరులు పృథ్విపై కాలూని, విధ్యుక్తధర్మాన్ని ఆచరించి కాలవశులైనారనీ, తన ప్రత్యేకత ఏమీ లేదనీ తెలుసుకొన్నాడు. యుధిష్ఠిరుడు కృష్ణద్వితీయుడై సభాగృహంలో ఆసీనులై యున్న ప్రభువుల మ్రోల వినయావనతవదనుడై నిలువబడినాడు.

సభాగృహవైభవం అనిదంపూర్వసుఖానుభూతిని ధర్మజునకు కల్గించినది. స్వీయవ్యథను ఏమాత్రము జాగుచేయక విన్నవించుకొనినాడు.

యుధిష్ఠిరుని నివేదనను ఆద్యంతం ఆకర్ణించిన బలి ఆగ్రహోదగ్రులై సేవార్థం ఉపస్థితుడైన మంత్రిని ఇలా ఆదేశించాడు “ఇతని నేరం హీనాతిహీనం. అక్షమ్యం. కఠినదండనార్హంగా పరిగణిస్తున్నాము. అస్తాత్పూర్వమే ఈతని దక్షిణహస్తాన్ని కరవాలంచే నికర్తనం కావించుటకు తగిన ఏర్పాట్లు చేయాల్సినదిగా కారాగారాధికారికి మా ఆదేశమును ప్రేషితమొనరించవలె!”

ఈ కఠోరాజ్ఞ చెవుల బడిన యుధిష్ఠిరుడు ప్రకంపనాపన్నుడైనాడు. అతి ప్రయత్నం మీద తనను సంభాళించుకొని దయాభిక్షను అభ్యర్థిస్తూ దీనస్వరంతో ఇలా అన్నాడు.

“మహాప్రభూ! నేనొనరించిన అపరాధ మేమిటి? ఇంతటి కఠోరశిక్షకు పాత్రునిగా దయానిధానులవైన తమచే ఏల నిర్ధారితుడనైతిని?”

అందుకు బలి ఏమాత్రం చలించలేదు. మరింత కాఠిన్యాన్ని మాటలలో ప్రదర్శిస్తూ ఇలా అన్నాడు “యుధిష్ఠిరా! మా న్యాయనిర్ణయము ప్రశ్నించగల ధైర్యము ఎవరు పురికొల్పగా నీకు కల్గినది? పరిపాలన పేరిట ఇదా నీవు చేస్తున్న నిర్వాకం. శథోద్యముడవై నిజప్రజానీకమును నిత్యం తాపత్రయానికి గురిచేస్తున్నావు. నీవు నీ రాజధర్మాన్ని చక్కగా నిర్వర్తించడం లేదనడానికి ఈ ఘటనయే తార్కాణము. అర్చకుడైనవాడే ఈ పాపమునకు ఒడిగట్టినాడనిన న్యాయవ్యవస్థ పూర్తిగా శిథిలమైనదన్న విషయము పూర్తిగా నిరూపితమైనది. ప్రజలు చేసే నేరాలకు రాజులే బాధ్యులన్న స్మృతి వాక్యమును పూర్తిగా విస్మరించినావు. ఏ కోణం నుంచి పరిశీలించినా, నీవు శిక్షార్హుడవే! మేము విధించిన దండన సౌమ్యమైనదిగా ఎరుంగుము.”

యుధిష్ఠిరుడు తన తప్పిదాన్ని గ్రహించాడు. అహమ్మన్యతలో కర్తవ్యాచరణ యెడ

ప్రమత్తుడైన నేరానికి క్షణంపాటు నతమస్తకుడైనాడు. ఏమీ పాలుపోని స్థితిలో కృష్ణుని వంక చూశాడు.

ఒక్క చిరునవ్వుతో కృష్ణుడు అక్కడ ఘనీభవించిన తమఃపటలాన్ని పటాపంచలు కావించి పరిసరాలను భాస్వంతం చేశాడు.

బలిచక్రవర్తి నిజాసనాన్ని వీడి, వేదిక డిగ్గి కృష్ణునకు పాదాభివందనం చేసి యుధిష్ఠిరునకు పరిష్వంగ గౌరవాన్ని ప్రసాదించి భరతవాక్యం పలికాడు.

"లోకకల్యాణార్థం కృష్ణుని పనుపున ఈ నాటకం ప్రదర్శింపబడినది. రాజరథారూఢులై దివ్యాతిథులు పాతాళలోక వైభవాన్ని తిలకించటానికి నాతోపాటు విహరించి నన్ను ధన్యున్ని కావింపవేడెదను."

ప్రజలు పెడదారి పట్టిన ప్రభువు తప్పు.

# 4. జవాబులు ప్రశ్నలైన వేళ

## (విత్తమంత్రి : పాత్రికేయులు)

నారార్జీదేశాయి గారు ఒకప్పుడు కేంద్ర విత్తమంత్రిమహోదయులుగా బహుశ్రుతులు. మహాత్ముని జన్మభూమియైన గుజరాత్ కు చెందినవారు. ముల్లును ముల్లుతో పెరికి వేయాలన్న సిద్ధాంతం కలవాడు కనుక అడిగిన ప్రశ్నలకు జవాబు ఈయకుండా ఎదురు ప్రశ్న వేయడం ఆయన ప్రత్యేకత. ఆయనతో పాత్రికేయుల ప్రతి సమావేశం ఎంతో రక్తి కట్టేదిగా ముగిసి దేశవ్యాప్తంగా పత్రికా పఠితలను అలరించేది.

లోకసభలో ఆర్థిక బిల్లు ప్రవేశపెట్టబడిన మరుసటి రోజే లబ్ధప్రతిష్ఠులైన పాత్రికేయులు 'మీట్ ద ప్రెస్'ను ఆయోజించి శ్రీవారిని ఆహ్వానించారు. ప్రెస్ కాన్ఫరెన్స్ ఆరంభంకానుంది.

దిలీప్ కోర్గాంకర్, ఎన్.వి. కోమత్ కేంద్ర విత్తమంత్రిమహోదయుల నుండి ప్రశ్నను దాటవేయకుండా జవాబును రాబట్టే విధంగా ప్రశ్నించాలని పరస్పరం కొన్ని క్షణాలకు పూర్వం చర్చించుకొని నిర్ణయించుకొన్నారు.

ఉత్కంఠతో ఎదిరిచూస్తున్న సమావేశం కొన్ని నిమిషాల్లో ఆరంభమైంది. మంత్రిగారు బిల్లును గురించి మాట్లాడారు. దిలీప్ కోర్గావ్కర్ మొదటి ప్రశ్న వేశారు.

ది. కో : సర్! మిమ్మల్ని ఓ ప్రశ్న అడిగేందుకు అనుమతిస్తారా?

మంత్రి : పాత్రికేయుల్ని ఎవరాపగలరు?

ది. కో : భారతీయ అర్థవ్యవస్థ ఎదుర్కొంటున్న అతిముఖ్యమైన సమస్య ఏమిటి?

మంత్రి : జనాభా పెరుగుదల కారణమని అంగీకరించని వారెవరు?

ది. కో : అది సరె! మీ దృష్టిలో ఈ సమస్యకు పరిష్కారమేమిటి?

మంత్రి : దేశంలోని మీ వంటి పాత్రికేయులు ఓ చోట సమావేశమై, చర్చించి, ఓ పరిష్కారమార్గాన్ని ఎందుకు సూచించరు?

ఎన్.వి. కో : సర్! క్షమించండి. అడిగిన ప్రశ్నకు జవాబు ఈయడానికి బదులు మమ్మల్ని ప్రశ్నించడం దేనికి?

మంత్రి : ఎందుకు కూడదు?

ప్రతి ప్రశ్నకు జవాబు ఉంటుంది.
అయితే ఆ జవాబు మరో ప్రశ్నకు దారితీస్తుంది.

# 5. ద్రష్ట

ఆచార్యుడు నీటితో సగం పూరింపబడిన గాజు పాత్రను పైకెత్తి, ఇంచుక మందహాసంతో ఛాత్రుల వైపు చూపునిల్పి, వారు సావధానులయ్యాక ఇలా ప్రశ్నించాడు.

“ఈ గాజు పాత్ర పూరితమా? లేక రక్తమా?”

శిష్యులలో నిరాశావాది యైన యువకుడు నిట్టూర్పులు నిగిడిస్తూ ‘అర్ధరిక్తం’ అని అస్పష్టంగా గొణిగాడు. ఇందుకు విపరీతంగా ఆశావాదియైన మరియొక్కడు బుగ్గలు పూరిస్తూ చెవిటివాడు వినేంత బిగ్గరగా ‘అర్ధపూరితం’ అంటూ స్పందించాడు.

ఈ రెంటిలో ఏ సమాధానం ఆచార్యునకు రుచించలేదు. వ్యథను వ్యంజించే స్వరంతో ఇలా అన్నాడు. “ఈ పాత్ర అర్ధరిక్తంగానో అర్ధపూరితంగానో మీచే చూడబడినది. జలపూరితంగాని భాగం వాయుపూరితమన్న యాథాతథ్యం మీ ఇరువురికి అగ్రాహ్యంగానే ఉండిపోయింది. జలపూరితభాగం ఆచరితకర్మకు, సమాజానికి ఒసంగబడిన యోగదానానికి ప్రతీక్ష్మ అలాగే వాయుపూరితభాగం మనచే గవేషింపబడని అవకాశాలకు ప్రతీక. అందుకే నిరంతర కర్మరతులమై పరిపూర్ణతాశిఖరాలను అధిరోహించాలని వాయుపూరితభాగం ఆహ్వానం పలుకుతున్నది.

శిష్యద్వయం ఆచార్యుని మేధాసంపత్తికి అబ్బురపడుతూ తూష్ణీంభావమును వహించింది.

ఆచార్యుడు మళ్ళీ అన్నాడు “ఏ పరిస్థితి తలెత్తినా అందులో అంతర్లీనంగా ఉన్న అవకాశాన్ని పసిగట్టండి. విజయలక్ష్మిని వరించండి!”

ఇలా చెప్పే ఆచార్యుడే జగదారాధ్యుడైన ద్రష్ట.

# 6. దాంపత్యం : 3౬ - ౬3

మంత్రపురిలో ముద్దు అమ్మాయి రాజన్న గారలనే వృద్ధ దంపతులుండేవారు. ఇంటి పేరు 'ముద్దు'కు తగినట్లు అంటే ముద్దులు మూటగట్టే దాంపత్యం వారిది కాదు. వారికి ముగ్గురు కుమారులు. అంతే సంఖ్యలో కుమార్తెలు. విషయం గౌణమైనా, ప్రధానమైనా ఎల్లవేళలు తర్కవితర్కాలలో గడిపేవారు. ఒకరితో మరొకరు వాదించటంలో ఒకరిని మరొకరు వేధించటంలో స్వల్ప విరామాలు సైతం ఉండేవి కావు.

సోదరత్రయంలో కనిష్ఠుడైన డా॥ విశ్వనాథ్ భాగ్యనగరంలో ఉంటూ వీలు కలిగినప్పుడు మాతాపితల సందర్శనార్థం స్వగ్రామానికి వచ్చేవాడు. ఓమారు తల్లిని ఇలా అడిగాడు.

"అమ్మా! ఎంతటి చిన్న విషయమైనా వాదించుకొనటంలో మీరు అలుపు సొలుపు ఎరుగరు. గెలుపు నీదా లేక *అన్న దా?

చిరునవ్వుతో అమ్మాయి కుమారుడు అడిగిన ప్రశ్నకు ఇలా బదులు చెప్పింది. "కొడుకా! విస్సయ్యా! కలహమే మాకు సత్కాలక్షేపం. ఒకరు గెలువడమూ మరొకరు ఓడటమూ అంటూ ఉండదు. ఒకోసారి నా ఆలోచన ఎంత సముచితంగా ఉంటుందో మీ అన్నది అంతే సముచితంగా ఉంటుంది. ఒకోసారి ఆయన ఆలోచన ఎంత తప్పుదారి పడుతుందో నాదీ అంతే తప్పుదారి పడుతుంది."

గీతాపఠనం ముగించుకొని పూజాగృహం నుండి వెలుపలికి వచ్చిన రాజన్న గారు ఇది విన్న మరుక్షణం 'తప్పు' అని ఇల్లాలి మాటను నిర్ద్వంద్వంగా ఖండించాడు.

ఉద్వేజితమనస్కయైన అమ్మాయి అంది: "తప్పు కాద్ము నూటికి నూరుపాళ్ళు ఒప్పే.

'ఎందుకు' అని రాజన్నగారు నిలదీస్తే 'ఎందుకనగా' అని అమ్మాయి గారి స్పష్టీకరణ. 'అలాకాదని' మగడంటే 'ఎందుకు కాదని' ఇల్లాలి ఎదురు ప్రశ్న. వాగ్యుద్ధం ఇలా పాకాన పడిన వేళ డా? విశ్వనాథ్ "దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి" అంటూ ఇంటి నుండి చప్పున జారుకున్నాడు.

మందాట వీధిలో ఉంటున్న పెద్దక్క సీతమ్మ గారింటికి నిమిషాలలో డా? విశ్వనాథ్ చేరుకున్నాడు. అక్కగారు బావగారు దేనిని గురించో చర్చించుకుంటున్నారు. విశ్వనాథ్ సీతమ్మ గారిని అడిగాడు "అక్కా! నీవూ బావ ఎప్పుడూ చర్చించుకుంటారు గదా! ఇందులో గెలిచేది ఎవరు?"

*మంత్రపురి వైదిక కుటుంబాలలో తండ్రిని 'అన్న'గా పిలిచే ఆచారం పూర్వముండేది. – అనువాదకుడు

సీతమ్మ ఓ చిరునవ్వు నవ్వేసి ఇలా అంది "ఇలా చర్చించుకొనండంలో ఎంతో హాయి ఉంది తమ్ముడూ! మాలో పొరపొచ్చాలనేవి లేవు. పోట్లాటంటే ఏమిటో మాకు తెలియదు. ఉబుసు పోకకు మాట్లాడుకునే అలవాటు మాకు లేదు. పరిష్కారాన్ని వెదికేందుకే చర్చిస్తాము. ఇందులో గెలుపు-ఓటమి ఏముంటుంది? మాలో జరిగే ఏ చర్చ అయినా 'గెలుపు' 'గెలుపు'గానే ముగుస్తుంది. మేము ఆలోచించే తీరు పొసగనప్పుడు, చర్చించి ఇరువురికీ సమ్మతమైన నిర్ణయాన్ని తీసుకొంటాం."

డా॥ విశ్వనాథ్ అక్కగారిని బావగారిని మనసారా అభినందించారు.

ఎదురువాడితో కలహించాలన్న నిశ్చయం మీదైతే
సమస్యలకు పరిష్కారం దొరకదు.
ఎదుటివాళ్ళే అర్థం చేసుకొనే సౌమనస్యం మీదైతే
పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది.

# 7. మచ్చ

## (కృష్ణదేవరాయలు : తెనాలి రామకృష్ణుడు)

"తప్పిద మొనర్చుట మానవ నైజము ప్రభూ!" ఆంధ్రకవితాపితామహుడైన పెద్దనార్యుడు ఇలా ప్రతిపాదించడం, కర్నాటరాజ్యాధీశులైన శ్రీకృష్ణదేవరాయల వారు అంగీకార సూచకంగా తలను పంకించుట ఏకకాలమున జరిగినవి.

అష్టదిగ్గజవిభూషితమైన విద్వత్సభ ప్రాతఃకాలీన ప్రశాంతవేళ ఆరంభమైనది. పెద్దన నుడివినదాన్ని సమర్థిస్తూ తెనాలిరామకృష్ణ కవి ఇలా అన్నాడు "మానవమాత్రుడైన ప్రతివాడు తన జీవితంలో ఒకప్పుడు తప్పు చేస్తాడు. దోషరహితుడూ, పరిపూర్ణుడైన వాడు విజయనగరసామ్రాజ్యంలోనే కాదు చతుః సాగరవేలావలయితయైన ఈ వసుంధరపై ఎక్కడా కానరాడు."

రామరాజభూషణుడు ధూర్జటి చూపుల తోనే మనోభావవినిమయం కావించుకొన్నారు. ఈ కవిద్వయానికి తెనాలి వారంటే పరమ ఏవగింపు. విశేషంగా రామరాజభూషణ కవి రామకృష్ణుని నికృష్టశ్రేణికి చెందిన ప్రతిస్పర్థిగా చూచేవాడు.

ఏ చర్చ జరిగినా, ఏ ఆశువునకు ఆహ్వానమైనా, ఏ పద్యపూరణస్పర్ధయైనా, విజయశ్రీ రామకృష్ణుని వరించేది. ఆయనకు ప్రభువుల ప్రశంసలందేవి. ధూర్జటి రామరాజభూషణ కవివర్యుల ముఖాలు మధ్యందినచండాతపానికి గురియైన పూవుల్లా కందేవి.

రామకృష్ణుడు 'జగాన పరిపూర్ణుడనదగువాడు లేడన్న వాక్యం' దీర్ఘ ప్రతీక్షానంతరం అందివచ్చిన మహదవకాశంగా వసుచరిత్రకారునకు భాసించినది. అతని కనుసైగతో ప్రేరితుడై, ధూర్జటి లేచి సభాభిముఖుడై బహునాళ్ళుగా ఎదలో వేగరిస్తున్న మనోభావజాలాన్ని శబ్దాంకనం చేయటానికి ఉపక్రమించాడు.

"రామకృష్ణ కవివర్యా! నీవన్నది వాస్తవతకు దూరంగా, అతివ్యాప్తి దోషం కలదిగా ఉంది. ఇంతటి గంభీరవిషయాన్ని ఆలోచనారహితంగా ప్రతిపాదించడం విజ్ఞులైన వారికి సమ్మతం కాదు. నీ దృష్టిలో దోషరహితు డనదగినవాడు లేడా?

ఈ విజయనగర సామ్రాజ్యాన – ఈ జగాన – లేడనే నీవు భావింతువా? ఇది నీ అంతిమ నిష్కర్షయా? అనావధానత వల్ల నోరుజారిన పక్షమున క్షమాప్రార్థివి కమ్ము."

కవి ధూర్జటి వాగ్ధాటికి ఏమాత్రం చలించని తెనాలి వారు స్వీయాసనాన్ని వీడి నిలబడి 'అవును' అనే మాటను అందరు వినేట్టుగా నొక్కి పలికాడు. పెద్దన గారు

పెద్దగా సమర్థించారు. వయోవృద్ధుడు పారిజాత సౌరభాన్ని తెలుగువారి కందించిన నంది తిమ్మన పెద్దన పక్షాన నిలిచాడు.

ధూర్జటి రామరాజభూషణల క్రోధం అజ్యగతాగ్నిశిఖాప్రఖ్యమై సభ వారిని భయభ్రాంతులను చేసింది. వసుచరిత్ర కర్త తెనాలి వారి వైపు తర్జనీ నిర్దేశం చేస్తూ ఇలా నిలదీశాడు.

"రామకృష్ణా! విజయనగరసామ్రాజ్యం మాట అలా ఉంచు. ఇక్కడ ఈ సభలో జలనాగసు డీతడ నదగువాడు ఒక్కడూ లేడా?"

"లేడు.... లేనే లేడు." చల్లగా అన్నాడు రామకృష్ణ కవి.

ఈ వాక్కలహపరివర్ధన పల్లవనాన్ని గమనిస్తున్న రాయలవారు అమందానంద కందళి తహృదయారవిందులైనారు.

వెదుకబోయిన తీగ కాలికి తగిలిన హర్షానుభూతి రామరాజ కవికి కల్గినది. తెనాలి వారి ఆటకట్టించటానికి అనువైన అవకాశం చేజిక్కినందుకు లోలోన మురిసిపోతూ శాంత గంభీరస్వరంతో ఇలా అన్నాడు "రామకృష్ణవర్యా! కళంకరహితుడు ముల్లోకములు వెదికినను దొరుకడని సెలవిచ్చి యుంటివి. కర్ణాటవసుంధరాజానియైన మన ప్రభువుల వారిలో ఏ దోషము నరసితివి?"

ఇది విన్న సభికులు శిలాప్రతిమ లల్లె నిశ్చేష్టులైనారు. ప్రభులవారి ముఖంలో గాంభీర్యం పొడసూపినది. చంద్రసఖమైన మోము సూర్యసఖమైనది.

ఏమాత్రం జంకు గొంకు లేకుండా స్వీయాసనం నుండి లేచి సభాసదుల మ్రోల ముకుళితహస్తుడై రామకృష్ణుడు ఇలా అన్నాడు. "దేవర వారి లోనూ దోషం ఉంది. అది అల్పమైనదికాదు. చూపు మందగించిన వారికి సైతం గోచరమయ్యేంత అనల్పమైనది.

ఇంతవరకు రామకృష్ణునికి అండగా నిలిచిన పెద్దన తిమ్మనలు నిలువునా నీరై పోయారు. రామకృష్ణుడు ప్రదర్శించిన అవివేకం వారిని నారకీయవేదనకు గురిచేసింది.

ధూర్జటి రామరాజభూషణులకు కల్గిన ఆనందం ఇంతా అంతా కాదు. వ్యావహారికదృష్టికలవారు కనుక భావగాంభీర్యాన్ని ఆశ్రయించారు.

స్తుతిమతియైన ధూర్జటి తనకు కల్గిన సంతాపాన్ని మాటలలో వెలిబుచ్చుతూ ఇలా అన్నాడు. "రామకృష్ణా! వివేకము నిన్ను వెలివేసినది. ఏమిటామాట? హవ్వ. ప్రభువుల వారు పరిపూర్ణులు... వారి యశోధవళిమను ఢిల్లీ ఏలికలు, బహమనీ సుల్తానులు

*అనాగాః అనాగస ఇతి ఏతే అపాపా ఇతి యది దేవేషు మధ్యే బ్రూయాః..........

సాయనాచార్యులు 7-4-60 ఋ.వే.

వేనోళ్ళ శ్లాఘించినారు. నీవు అజ్ఞానివే కాక అహమ్మన్యుడవు. దైవసమానులైన ప్రభువులకు దోషమాపాదింతువా?"

పరిస్థితి వికటించటంతో అప్పాజీ అప్రమత్తుడైనాడు. రాయల వారు ఎప్పటి గాంభీర్యమునే ప్రదర్శించినారు. ఏ ఆందోళన రామకృష్ణుని దరిదాపులకు వెళ్ళలేదు.

లేత ఎరుపులను చిందిస్తున్న మోముతో, లీలామాత్రమైన దరహాసంతో రాయలవారు ఇలా అన్నారు. "రామకృష్ణా! మాలో పెద్ద దోషము కలదంటివి. సెలవిచ్చినచో మమ్ములను మేము చక్కదిద్దుకొందుము."

రాయలవారి మాటను రామకృష్ణుని జీవనవైభవాంతికగా, రామరాజ భూషణుడు అన్వయించుకొన్నాడు. రామకృష్ణుని అమితంగా అభిమానించే పెద్దలు ఏమీ చేయలేని పరిస్థితిలో తలలు వాల్చారు.

రామకృష్ణుడు ఇలా అన్నాడు :

"ఇందువంశావతంసా! కృష్ణరాయక్షితీశా! దేవరవారు దైవాంశసంభూతులు. ఇది జగమెరిగిన సత్యము. కాదనుటకు నేనెంతవాడను ప్రభూ! అయినా మీలో దోషమున్నదనుటకు ఏమాత్రం సంకోచించను. తిమిరమున్న చోటనే కదా వెలుగునకు విలువ! కష్టాల్ని చవిచూసినవాడే క్షణికసుఖానికైనా స్వాగతం పలుకుతాడు. యశః శిఖరాన్ని అధిరోహించే ముందు ఎన్ని అపజయాలను చవిచూడవలె! శశలాంఛనుడు కనుకనే చంద్రుడు జీవజగన్మహోరుడైనాడు. చిబుకముపై చిరుమచ్చ కలవారైనందుకే కదా మాతృసమాన తిరుమలదేవి మహారాణి గారు నిరుపమానలావణ్యరాశిగా దేశవిదేశాల్లో శ్లాఘింపబడినారు. విష్ణువర్ధన చాళుక్యమహాప్రభువుల ఘనతకు కుబ్జత్వమేమి క్షతి కలిగించినది?"

"రామునంతటి వానిలో దోషములున్నవి. చెట్టుమాటున దాగి వాలిని చంపిన దోషం ఆయనను అంటియే యున్నది. అగ్నిపరీక్షలో సతీత్వాన్ని నిరూపించుకొన్న ఇల్లాలిని వదురుబోతు ఏదో అనినాడని అడవుల పాలు చేసిన జ అపకీర్తికి పరిమార్జన మున్నదా? అయినా రాముడు లోకాభిరాముడు గానే జగానికి పరిచితుడు."

"నవనీతచౌర్యము, చీరహరణము, భీష్మద్రోణకర్ణుల వధలో భాగస్వామ్యము తప్పిదములే అయినను కృష్ణుని ముజ్జగాలు పురుషోత్తముడనియే కీర్తించుచున్నవి."

"సిద్ధార్థుడై ధర్మచక్రపరివర్తన కావించిన గౌతముడు చేసినదేమిటి? తారుణ్యదశలో రాహులుని, యశోధరను వదిలి దేశదిమ్మరి యైనాడు."

"ధర్మాశోకుడు కాకపూర్వం అశోకుడు చండశోకుడే కదా! కళింగ భూమిని రక్తరంజితను కావించిన ఘటనను ఇతిహాసము విస్మరించినదా?"

"ప్రభూ! దోషమున్నచోటనే గుణగరిమ గుర్తింపబడుతుంది. ఏలినవారిలో ఏ దోషం లేదు. అదియే నా దృష్టిలో గొప్ప దోషం. మచ్చలేమియు మచ్చయే. నా నమ్రనివేదనను దేవరవారు అవధరింతురు గాక!"

పారావార మెరుగని ఆనందాతిశయితతో రాయల వారు రామకృష్ణుని స్వీయపరిష్వంగబద్ధుణ్ణి గావించి, పరమాదరంతో మెడలోని రత్నాలమాలను బహుకరించినాడు. తెనాలి వారిని అభిమానించే పెద్దల సంతోషానికి పట్టపగ్గాలు లేవు. రాయల వారు సాశయంగా రామరాజధూర్జటిద్వయం వైపు చూశారు. వాళ్ళు దించిన తల ఎత్తలేదు. కరతాళ ధ్వనులు మిన్ను ముట్టినవి.

యవనిక మాటున ఉండి ఇది తిలకిస్తున్న పట్టమహిషి తిరుమలదేవి అధరాలపై దరహాసరేఖ విరిసినది.

మనిషిలోని దోషాలెంచుతూ కూర్చోకు.
దోషాలున్న తావుల్లో సుగుణాలుంటాయి.

# 8. నలుపు తెలుపు

## (అక్బర్ - బీర్బల్ కథ)

ఒకనాటి సంజవేళ, ఫతేపూర్ సీక్రి పరిసరాల్లోని ఉపవనంలో అక్బరు పాదుషావారు తమ నికటవర్తులైన బహద్దుర్ రహీమహమద్, దళపతి జనాబ్ అమీర్ ఖాన్, రాజారతన్ సింగ్, బిక్రమ్సన్, రాజా బీర్బల్తో సమావేశమయ్యారు. రాజ్యవ్యవహారాలు చర్చించడం అయిపోయాక, రాజోద్యోగులకు సహజమైన హాసపరిహాసాలకు దిగారు.

రహీమ్ అహమద్, అమీర్ ఖాన్, రతన్సింగ్ త్రయానికి బీర్బల్ బిక్రమ్సుల పేరు వింటేనే వెయ్యి జ్వరాలు వచ్చేవి. అపారధీశక్తి, సృజనాత్మకత, నావీన్యత వైపు మొగ్గ కలవాడవటం వల్ల అక్బరుపాదుషావారికి ఆరవ ప్రాణమైనాడు బీర్బల్. ఇది మిత్రత్రయానికి మింగుడుపడలేదు. ఎగిరే గుర్రాల ఉదంతం తరువాత బీర్బలు యెడ గల ఏహ్యాభావం గరిష్ఠస్థాయి నందుకొన్నది.

బీర్బల్ ప్రభువుల వారికి సమీపవర్తి కావడానికి మరోకారణం ఉంది. అది బీర్బల్ ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వం. ఆయన నిరాడంబరజీవనశైలికి అలవాటుపడినవాడు భోగవిలాసాలకు దూరంగా ఉండి, నిత్యావసర పరిపూర్తితోనే సంతృప్తిపడేవాడు. నిరంతరాధ్యయనశీలి అవడంతోపాటు సర్వధర్మసారాన్ని పూర్ణంగా ఆకళింపుచేసుకొన్న ధన్యజీవి. ధార్మికచర్చ పాదుషా వారి కవసరమనిపించిన వేళ బీర్బల్కు ఆహ్వానమందేది. కారుణ్యదృష్టికలవాడై ఎన్నో సంక్షేమ కార్యాలు చేపట్టి సకాలంలో పూర్తిచేసి రాజమాన్యుడవటంతో పాటు లోకమాన్యు డైనాడు. నిరాధారులను సాధారులను చేశాడు. అధివ్యాధిగ్రస్తులను ఆదుకొన్నాడు. వికలాంగులకు నేత్రహీనులకు జీవనోపాధి కల్పించాడు. దేవాలయ మసీదుల నిర్మితికీ, ఉద్ధరణకూ చేతనైనంత మేరకు ఆర్థిక సహాయం అందించాడు.

వ్యక్తుల స్వభావాన్ని పసిగట్టడంలో బీర్బల్ బహుచతురుడు. ముఖోటాలను (Mask) ముఖాలనుకొనే భ్రాంతిలో పడలేదు. అందుకే "అ.ప్ర.వ్య. గా పాదుషా వారి గుర్తింపు పొందాడు అమీరుఖానాదులు ఈర్ష్యాళువులు కావడానికి ఇదే ప్రబల కారణం. బీర్బల్ వంటి ఉదాత్తచరితుడే బిక్రమ్సేన్. బిక్రమ్సేన్ సైతం పాదుషా వారి సమీపవర్తియే!

పాదుషా వారికి మనోవినోదాన్ని చేకూర్చుతూ (కథారంభంలో సూచితమైన) చర్చ పాకానపడింది. రహీమహమద్ అన్నాడు: "నేను గౌరవించేది ఆర్జవాన్ని. సూటిగా మాట్లాడేవాళ్ళను ఇష్టపడతాను. డొంక తిరుగుడు మాటలంటే నాకు పరమ అసహ్యం.

*అనాగాః అనాగస ఇతి ఏతే అపాపా ఇతి యది దేవేషు మధ్యే బ్రూయాః..........

రహీమహమద్కు అన్ని ఋతువుల్లో వంత పాడే అమీరాఖాన్ అన్నాడు : "ఏ ప్రశ్నకైనా అవును లేక లేదు/కాదు అని సమాధానం చెప్పాలి. ఏదీ చెప్పక నీళ్ళు నమలడం దేనికి?"

ఇంతవరకు ఏమీ మాట్లాడని బిక్రమ్సేన్ చర్చలోకి దిగుతూ ఇలా అన్నాడు "రహీమహమద్ సాహెబ్. క్షమించాలి. ఆమోదించడానికి నిషేధించడానికి వీలుపడని సందర్భాలున్నాయి అయితే తెలుపు కాకుంటే నలుపా? బూడిద రంగు లేదనేనా మీరనేది?"

రహీమహమద్కు ప్రియవయస్యుడైన రాజారతన్సింగ్ బిక్రమ్సేన్ అన్నదాన్ని ఖండిస్తూ అన్నాడు: "ధైర్యంగా 'ఊఁ' అనాలి లేదా 'ఉహూఁ' అనాలి. కంచెమీద కూర్చొనడం పిరికిపంద లక్షణం." ఆకి ఉం

పాదుషా వారు శ్రద్ధంగా వింటున్నారు. ఇలాంటి ప్రసంగాల వల్లే వ్యక్తి ప్రతిభాపాటవాలు సానదీరుతాయని ఆయన దృఢ విశ్వాసం. హజూరువారు బీర్బల్ బిక్రమ్లపై విశేషదృష్టి నిలిపారు.

పాదుషా వారి పరోక్ష ప్రోత్సాహంతో ఉత్ప్రేరితుడై బిక్రమ్సేన్ అన్నాడు "రహీమహమద్ జీ! ఏ ప్రశ్నకైనా మన మిత్రుడన్నట్లు నీళ్ళు నమలకుండా జవాబు చెబుతారా?"

"ఎందుకు చెప్పను?" అన్నాడు రహీమహమద్. "ఎందుకు చెప్పలేదు?" వంతపాడాడు అమీర్ ఖాన్. మిత్రద్వయం భూమికను సమర్థిస్తూ రాజారతన్ సింగ్ తల ఊపాడు.

బీర్బల్ మిత్రత్రయం వైపు సాశయంగా చూసి రహీమహమద్ ను ఇలా ప్రశ్నించాడు. "బహద్దుర్జీ! మిమ్మల్ని ఓ ప్రశ్న అడగాలని వుంది. పనాహ సమక్షంలో 'ఔను' లేక 'లేదు' అని ప్రత్యుత్తర మీయగలరా?"

"బేషక్" అన్నాడు రహీమ్.

జనాబ్ హీమహమద్ నుండి వచ్చే జవాబుకు మాన్యులు ఉత్కంఠతో ఎదిరిచూస్తున్నారు. బీర్బల్ రహీమ్ వైపు చూపు నిలిపి ఇలా అడిగాడు "బేగంపై చేయి చేసికోవడం మానుకున్నారా?"

ఈ ప్రశ్నకు కాలిక్రింది నేల కదినట్లయి, ఏదో అనబోయి మాటలు పెగలక దిక్కులు చూస్తూ రహీమ్ సాహెబు బిక్కమొహం వేశాడు. పాదుషా వారి పెదవిపై దరహాసరేఖ పొడసూపింది. రహీమ్ వివర్ణవదనుడైనాడు. అమీర్ ఖాన్ రతన్సింగ్ల అధరాలు పొడిపొడివోయినవి. బిక్రమ్సేన్ ముసిముసినవ్వులకు రహీమహమద్కు ఎళ్ళవేళలు కొమ్ముకాసే మిత్రద్వయం ఎదలోని కసి బుసలుకొట్టినది.

రహీమ్ వైపును నిల్పిన చూపును బీర్బల్ మరోవైపుకు మళ్ళించలేదు.

రహీమహమద్ దీర్ఘాలోచనలో మునిగాడు. 'అవున'ంటినా పూర్వం చేస్తున్న దాన్ని ఇప్పుడు మానివేశానన్న అర్థం వస్తుంది. 'లేదం'టినా పూర్వం చేస్తున్న దాన్ని కొనసాగిస్తున్నాన్న అర్థం వస్తుంది. కత్తిపై ఏవైపు మీదుగ నడిచినా అనర్థమే.

ఇలా ఆలోచిస్తూ ఏమీ పాలుపోక తలను వాల్చాడు. ఇంతటితో ఆయన్ని వదిలేయక మరోచల్లని మాటను చేర్చాడు. "సుల్తాన్ సాహెబ్! జవాబు తాపీగా ఇచ్చుకోవచ్చు. మీవల్ల కాని పక్షంలో భాభీ సహాయాన్ని అర్థిస్తాము" రహీమహమద్ దీనితో ఖంగుతిన్నాడు.

బేగమ్ అఖ్తరు సాహిబా పూలుకోస్తే కందిపోయే చేతులు కలదికాదు. రోషకాషాయిత నేత్రయై కుడికాలి అందియను రవళింపజేసిన మరుక్షణం, సుల్తాన్ సాహెబ్ కూర్మంలా అంగసంహరణం కావించవలసినదే! దాంపత్యజీవనంలో ఆయన సర్దుబాటు ధోరణినే ఎల్లవేళలూ అవలంబించాడు. మిత్రులకు తన నిర్వేదాన్ని చూపులతో ప్రకటించాడు. మిత్రులు తమ అసహాయతను చూపులతోనే తెలుపుకొన్నారు. చేసేది లేక చివరకు జహాఁపనాహ వైపు దీనంగా చూశాడు.

రహీమ్ మౌన పరివేదనకు చలించి పాదుషా వారు చర్చలో మహిళల ప్రసక్తి తేవద్దని బీర్బల్ను సౌమ్యంగా మందలించారు.

పాదుషా వారి ముఖంపై వెలుగు రేఖలు ఎప్పటిలా దోబూచులాడుతున్నాయి. ఓ ఆలోచన ఆయన కల్పనాకవాటాన్ని తట్టింది. వెంటనే సావధానుడై స్వీయాసనం నుండి ఇంచుక ముందుకు జరిగి బీర్బల్ వైపు అదోలా చూస్తూ ఇలా అన్నారు. "బీర్బల్! నిన్ను రహీమహమద్ స్థానంలో ఊహించుకుని మేము అదే ప్రశ్న వేస్తున్నాము. నీ సమాధానమేమిటి?"

పాదుషా వారి పలుకులు రహీమ్ సాహెబుకు ఊరట కలిగించినవి. విషయాంతరం కావించినందుకు, హుజూరు వారికి లోలోపల కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

బీర్బల్ పాదుషా వారి ప్రశ్నకు ఏమాత్రం చలించలేదు. జవాబు ఇచ్చుటకు సర్వసన్నద్ధుడై యున్నందువలన హుందాగా నతమస్తకుడై అన్నాడు: "హుజూర్! "ఊఁ ఉహుఁ" "ఏమిటది? మాకు అర్థం కాకుండా ఉన్నది" సందేహం వెలిబుచ్చారు పాదుషావారు. బీర్బల్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో జవాబు చెప్పాడు.

"నేనన్నదానికి మొదటి అర్థం 'అవును' అవుతుంది జహాఁపనాహ! ఎందుకంటే ఆవిడను దండిచాలన్న ఆలోచనను సైతం ఏనాడూ రానీయలేదు. నేనన్న దానికి మరో

అర్థం 'లేదు' కూడా అవుతుంది. కారణం ఆమెను దండించే ప్రశ్న పూర్వం ఉద్భవించలేదు. ఇప్పుడు నా ముందు లేదు. భవిష్యత్తులోనూ ఉండబోదు. ప్రశ్న అడగడానికి హేతువే లేనప్పుడు జవాబు ఈయాల్సిన అవసరమే ఉండదు."

"సెబాస్ బీర్బల్!" అన్నారు అక్బర్.

బిక్రమ్ మిత్రుని సమయస్ఫూర్తికి ఎంతో ఉప్పొంగిపోయాడు.

పాదుషా వారు మిత్రత్రయం వంక తేరిపార చూశారు.

రహీమ్ : "రాజా బీర్బల్ తెలివికలవాడు."

అమీరాను రతన్సింగ్లు రహీమన్నమాటనే అన్నారు.

పాదుషా : "కాదు. బీర్బల్ గొప్ప మేధావి." 'జీ హుజూర్' అన్నారు ముగ్గురు.

ఇంతటితో ప్రకరణం ముగియలేదు. బీర్బల్ అన్నాడు : 'ఉహుం ఊం' పాదుషావారికి ఆశ్చర్యం వేసి అన్నాడు: "మళ్ళీ ఏమిటి బీర్బల్!"

సభికులు నిర్ఘాంతపోయి తేరుకొనకముందే జవాబియ్యటానికి ఉపక్రమించాడు.

"దీనికి 'లేద'నే అర్థం వుంది. ఎందుకంటే నేనిప్పుడు ఆవిడను దండించడం లేదు. 'అవును' అనే మరో అర్థం ఉంది. కారణం, గతంలో దండించిన ఒక్క ఉదంతం లేదు. ప్రశ్న నిర్హేతుకమైనప్పుడు 'అవును' 'లేదు' అనే రెంటికీ అతీతమైన సమాధాన మీయవలసి యుంటుంది జిహాంపనాహ!

బీర్బల్ అభిమానులు సంతోషం పట్టలేక చప్పట్లు చరిచారు. విరోధులు మోరలు వాల్చారు.

అక్బర్ పాదుషా బీర్బల్ తెలివి తేటల్ని కొనియాడుతూ ఇలా సెలవిచ్చారు.

"రాజాసాహెబ్. పదాల నిర్మాణంలోనే కాదు, పరిష్కారాలను సూచించడం మీయంతవారు హిందూస్థానంలో లేరు. పిడివాదుల కళ్ళు తెరిపించారు."

బీర్బల్ వంటి మేధావిని హితవరిగా అనుగ్రహించినందుకు పాదుషా వారు అల్లాహకు లోలోపల కృతజ్ఞతలు తెలుపుకొన్నారు.

'అవును' అనడానికి లేదు / కాదు అనడానికి అతీతమైన స్థితి ఉంది.
అయితే నలుపు, కాకపోతే తెలుపుగా దేనినైనా చూడటం విజ్ఞత అనిపించుకోనదు.
నలుపు తెలుపుల మధ్య గల వర్ణం ఉపేక్షణీయంకాదు.

# 9. మంథనం

## (మిళింద నాగసేనుల కథ)

మిళింద మహారాజు ప్రజానురంజకుడు. సకలశాస్త్ర విదుడు. అతనికి ఈడైన ప్రతివాది ఈతడను వాడు లేడు. బౌద్ధికంగా శారీరికంగా అజేయుడు. అతని యశోధవళిమకు క్షతికలిగించగల మరొక తేజఃపుంజము భారతీయ క్షితిజంపై ఉదయించలేదు.

ఆయన వేయు మౌలిక ప్రశ్నలు లెక్కకు మించినవి. తార్కికశక్తి అసిధారలా సునిశితమైనది. అలాంటప్పుడు, ప్రతివాది నిరుత్తరుడు కాకుండా ఎలా ఉంటాడు?

ఆయన ప్రశ్నించే తీరు ఆనాటి ఆచార్యులైన పురానకస్సపుణ్ణి, మక్కాలిగోసాలుణ్ణి, నిగంతనాథపుత్తుణ్ణి, సంజయుణ్ణి, బేలతి పుత్తుణ్ణి, అజిత కంబళుణ్ణి, కాన్వాయనుణ్ణి – ఇలా ఎందరినో దిగ్భ్రాంతులను కావించినది. తర్కంలో తనను మించినవాడు లేడన్న భావన ఆయనలో నానాటికి ధృడం కాసాగింది.

వాదోపవాదాల్లో ఏండ్లు పూండ్లు గడచినా, బౌద్ధ భిక్షువుగా బహుశ్రుతుడైన నాగసేనుణ్ణి కలిసే వరకు ఆయన తర్కకండూతి ఉపశమించలేదు. నాగసేనుడు పూర్ణజ్ఞాన్మి వైచారికస్పష్టత కలవాడు. ధిషణతో పాటు ఏండ్ల అనుభవం ఆయనకుంది. ఒక మాటలో చెప్పాలంటే ఆచార్యపదవాచ్యతకు అన్నివిధాల అర్హుడైనవాడు.

అల్పానల్పవిరామాల మధ్య వారి సంవాదం ఈ విధంగా సుసంపన్నమైంది. మిళింద

మహారాజు : "నాగసేనాచార్య! అభివాదయామి."

నాగసేనుడు : "ఆయుష్మాన్ భవ!"

మిళింద మహారాజు : "మీతో చర్చించదలచాను"

నాగసేనుడు : "పండితునిగా లేక పామరునిగా చర్చించదలిస్తే నా అభ్యంతర మేమీ ఉండదు. మహారాజుగా చర్చకు ఆహ్వానించిన పక్షంలో నేను వహించునది తూష్ణీంభావమే."

మిళింద మహారాజు : "పండితుడు గాని పామరుడు గాని ఎలా చర్చిస్తారో సెలవియ్యాలి!"

నాగసేనుడు : "శేముషీ సింధువులైన వారు వాదిస్తారే గాని జల్పాన్ని, వితండాన్ని

ఆశ్రయించరు. వారి ఆలోచనల్ని, భావాలను ప్రత్యర్థి ముందు ఉంచే వేళ ఏలాటి ఆవేశానికి వశులు కారు. అన్ని కోణాల నుంచి ఆలోచించిన మీద ఏదైనా ప్రతిపాదిస్తారు. ప్రత్యర్థి వాదం అంగీకారయోగ్యమైన పక్షమున ఆమోదిస్తారు. కాని పక్షాన ఎదుటివాణ్ణి నొప్పించని రీతిలో తమ అనంగీకారాన్ని వ్యక్తంచేస్తారు. సత్యాన్వేషణయే వారి ధ్యేయం కనుక ప్రత్యర్థి గౌరవానికి భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించరు. చర్చకు గల ప్రయోజనాన్ని విస్మరించరు.”

“ఇక సామాన్యులా? మేధావులు చెప్పేది శ్రద్ధగా ఆలకిస్తారు. సందర్భబాహ్యమైన ప్రశ్నలు వేయరు. తమ అజ్ఞానాన్ని వదలించుకోవాలన్న తపన తప్ప, ఆధిక్యతను చాటుకొనే ఏ ప్రయత్నం చేయరు.”

మిళింద మహారాజు : “మరి రాజులు వాదించే విధానమేదో సెలవియ్యాలి.”

నాగసేనుడు : “రాజులు వాదించే విధానమా? వారు చెప్పించే పరమ ప్రమాణంగా ప్రత్యర్థి అంగీకరించని పక్షంలో శిక్షాపాత్రుడౌతాడు. నెలవు పోతుంద్హి కొలువు పోతుంది. తలను కోల్పోయినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు.”

మిళింద మహారాజు : “అలా అయిన పక్షంలో, రాజుగా కాక ఒక పండితునిగా మీతో చర్చిస్తాను. మాన్యులు నన్ను సోదరునిగా ఎంచి వాదించినా అది నాకు సమ్మతమే! అంతేవాసిగా నెంచి చర్చకు ఉద్యుక్తులైన పక్షంలో నన్ను మించిన భాగ్యవంతుడు ఉండడు. సేవకునిగా ప్రతివాదినైన నన్ను చూచిన పక్షంలో ‘ధన్యోస్మి’. ఇక చర్చను ఆరంభింతము.”

నాగసేనుడు : “తథే తి మహారాజా!”

మిళింద మహారాజు : “ఆచార్యా! మిమ్మల్ని ఒకటి అడగాలని వుంది.”

నాగసేనుడు : “నిస్సందేహంగా అడగండి.”

మిళింద మహారాజు : “ఎప్పుడో మిమ్మల్ని ప్రశ్నించాను.” నాగసేనుడు : “అప్పుడే మీకు సమాధానమిచ్చాను.”

మిళింద మహారాజు : “ఏమి సమాధానమిచ్చారు, ఆచార్య ?”

నాగసేనుడు : “ఏమని ప్రశ్నించితిరి, మహారాజా?”

మిళింద మహారాజు : “భేష్, ఆచార్యా!”

నాగసేనుడు : “సెబాస్, మహారాజా!”

మిళింద మహారాజు : "భిక్షువుగా ఎన్ని వత్సరాల జేష్ఠత మీకుంది?"

నాగసేనుడు : "ఏడు సంవత్సరాలు."

మిళింద మహారాజు : "నాకు ఏడు సంవత్సరాల జ్యేష్ఠత ఉందని సెలవిచ్చారు. ఏడంటే మీరా? లేక ఇక్కడ ఒక సంఖ్య అభిప్రేతమా?"

నాగసేనుడు : "మహారాజా! మీ ప్రతిఫలనం నీటిలో పడుతుంది. 'రాజు' అనబడేది మీరా లేక మీ ప్రతిఫలనమా?"

మిళింద మహారాజు : "నాగసేనాచార్యా! కార్యమైన నీడకు నేను కారణము."

నాగసేనుడు : 'ఏడు' అనేది అస్తిత్వంలో ఉంది నావల్లనే! 'నీడ' మీదయినట్లు 'ఏడు' నాది అవుతుంది. ఒకేలాగా అన్వయించుకోవాలి."

మిళింద మహారాజు : "పరమాద్భుతం! యోగ్యమైన సమాధానం చెప్పారు!"

నాగసేనుడు : "మీరు యోగ్యమైన ప్రశ్న అడిగారు."

మిళింద మహారాజు : "మానవుని మృత్యుపరాంత స్థితి ఏమై యుంటుంది?"

నాగసేనుడు : "జీవించిన అవధిలో మనిషి ఆచరణను పట్టి ఉంటుంది. పుణ్యానికి స్వర్గప్రాప్తి. పాపునకు నిర్ణయం అనివార్యం."

మిళింద మహారాజు : "మీరు వెళ్ళనుంది స్వర్గానికా? నరకానికా?"

నాగసేనుడు : "ఇప్పుడే ఎలా చెప్పగలుగుతాను. నేను మరణించేనాటికి పుణ్యమే అధికమైతే స్వర్గానికి వెడతాను. పాపమే అధికమైన పక్షంలో నరకానికి."

మిళింద మహారాజు : "బాగా చెప్పారు ఆచార్యా!"

నాగసేనుడు : "బాగా అడిగారు మహారాజా!"

మిళింద మహారాజు : "మీరు గొప్పవారా ఆచార్యా!"

నాగసేనుడు : "గొప్పవాడవడం కంటే మంచివాడవడం గొప్ప విషయం మహారాజా!"

మిళింద మహారాజు : "అయితే, మీరు మంచివారన్నమాట."

నాగసేనుడు : "మహారాజా! మంచివాడనయ్యే ప్రయత్నంలో ఉన్నాను."

మిళింద మహారాజు : "గొప్పగా ప్రతిస్పందించారు, ఆచార్యా!"

నాగసేనుడు : "గొప్పగా పృచ్ఛించారు, మహారాజా!"

మిళింద మహారాజు : "ఆచార్యా! ఆత్మ ప్రత్యగాత్మలు రెండునూ అవినాశిగా వర్ణణాపరధిలో లేనివిగా, వాక్కునకు అందనివానిగా చెప్పబడుతున్నాయి. మీరేమంటారు?"

నాగసేనుడు : "మహారాజా! మాటల్లో చెప్పడం సాధ్యం కానివేళ తూష్టీంభావమే యుక్తము. వర్ణణాతీతమైన దానిని వర్ణించుటెట్టు? మనోబుద్ధులకు, పంచేంద్రియాలకు గ్రాహ్యం కానిదాన్ని గురించి మాట్లాడడం ప్రయోజన రహితం."

మిళింద మహారాజు : "అద్భుతం!"

నాగసేనుడు : "..... ... ......?"

మిళింద మహారాజు : "ఆచార్యా! మీకు అంతిమ శరణ్యుడెవరు?"

నాగసేనుడు : "తథాగతుడైన బుద్ధ భగవానుడు."

మిళింద మహారాజు : "ఆయనను మీరు చూశారా?"

నాగసేనుడు : "లేదు."

మిళింద మహారాజు : "మీ గురువునకు గురువైన వ్యక్తి?"

నాగసేనుడు : "లేదు."

మిళింద మహారాజు : "ఎవరూ చూడనప్పుడు బుద్ధుడనబడేవాడు లేడనడానికి విప్రతిపత్తి ఉండకూడదు"

నాగసేనుడు : "మహారాజా! మీ సామ్రాజ్యానికి సంస్థాపకుడు ఎవరు?"

మిళింద మహారాజు : "అలింద మహాప్రభువులు."

నాగసేనుడు : "నీ వాతనిని చూసినావా?"

మిళింద మహారాజు : "లేదు."

నాగసేనుడు : "మీ జనకులకు ఆయన దర్శభాగ్యమబ్బినదా?"

మిళింద మహారాజు : "అబ్బలేదనే అనవలసి యుంటుంది."

నాగసేనుడు: "అలాంటివేళ అళిందుడనేవాడు లేడనే నిర్ధారించవలసి వస్తుంది."

మిళింద మహారాజు : "అలా అనడానికి వీలులేదు. ఆయన అధిరోహించిన

సింహాసనమున్నది. ఆయన ఆయుధగారాలు, వేయించిన శిలాలేఖనములు ఆయన అస్తిత్వ నిరూపణకు తిరుగులేని సాక్ష్యాలు.”

నాగసేనుడు : “బుద్ధుడు సంస్థాపించిన ధర్మం విశ్వవ్యాప్తమై ఈనాటికి నిలిచి ఉన్నది. విపశ్చన ఉంది. మధ్యమపథం ఆచరణలో ఉంది. ఆయన ప్రవచనములు ఛందోబద్ధమైన గాథలుగా అజరామరమైనవి. బుద్ధభగవానుడే చరమసత్యము. మహాప్రభూ!”

మిళింద మహారాజు : “ఆచార్యా! అనుగ్రహించండి.”

ప్రశ్నోత్తరపరంపర ముగియలేదు. అంతరార్థాలు గవేషింపబడుతునే ఉన్నవి. మధ్యమపథం, అష్టాంగమార్గం ఆచంద్రార్కం ప్రేరణాస్రోతస్సులై మానవాళిని సత్పథాన నడుపిస్తాయి. ‘బుద్ధుడు, సంఘము, ధమ్మ’ మనేవి శరణ్యంగా నిలుస్తాయి. పూర్ణత్వమనేది శూన్యమనేది ఈ సంవాదం వల్ల నిరూపితమైంది. మిళిందు లడిగిన ప్రశ్నలు గొప్పవే. నాగసేనాచార్యుడిచ్చిన సమాధానాలు కూడా గొప్పవే.

ప్రశ్నలడగండి. జవాబులు పొందండి.
ముందుకు వెళ్ళడానికి మరో మార్గం లేదు.

# 10. యోగ్యవ్యక్తి : యోగ్యకృతి

**(అరుణ కరుణ వరుణల కథ)**

హైద్రాబాద్కు చెందిన అపూర్వ సోదరీత్రయం అరుణ, కరుణ, వరుణలు. ఈ ముగ్గురు సమాన ప్రజ్ఞా పాటవాలు కలవారు. ముంబాయిలో వుండే అజీత్ బాబాయి హైదరాబాద్కు వచ్చినప్పుడల్లా వరుణ ఇంటిలో సమావేశమవుతుండేవారు. అందరూ చదువుకొన్న అమ్మాయిలే కనుక గంభీర విషయాలపై చర్చలు జరిగేవి. వారి చర్చల్లో మాతామహుడైన ముద్దు రామకృష్ణయ్య గారి ప్రసక్తి తరచుగా వచ్చేది. రామకృష్ణయ్య గారు ఆదర్శప్రాయులైన ఆచార్యులు. విద్యాక్షేత్రంలో ఎన్నో కొత్త విధానాలకు శ్రీకారం చుట్టారు. అసిధారావ్రతస్థునిలా, నియమబద్ధ జీవితం గడిపారు.

అజీత్ బాబాయి అన్నాడు: "ఆయన్ని యోగ్యుడైన వ్యక్తిగా ఉదాహరించవచ్చు. యోగ్యుడొనరించిన యోగ్యకృతి లోకులకు దృష్టాంతంగా నిలుస్తుంది."

తెలివిబుద్ధిగల చివరి అమ్మాయి వరుణ బాబాయి ప్రతిపాదనతో ఏకీభవించక ఇలా అంది. "ఎవరాచరించినా యోగ్యకృతి యోగ్యకృతియే అవుతుంది. అవునా?"

వరుణను రెండవ అమ్మాయి కరుణ సమర్థిస్తూ ఇలా అంది: "కృతి యోగ్యతాం యోగ్యతా నిర్ధారణలో కర్తను పరిగణనలోకి తీసుకొనవలసిన అవసరం లేదు."

ఈ ఇరువురన్నది ఆమోదయోగ్యం కానందుకు బాబాయి వెంటనే స్పందిస్తూ ఇలా అన్నాడు "అలా కాదు! మీరంటున్నది వస్తుగత దృష్టితో. ఇక్కడ కర్తలక్షితుడవడం లేదు. కేవలం కృతియే లక్షిత మవుతున్నది. ఆత్మాశ్రయ రెండూ ప్రధానమే. దృష్టితో చూచినప్పుడు ఈ రెంటిలో ఏదీ గౌణం కాదు. యోగ్యుని ద్వారా ఆచరితమైన యోగ్యకృతియే లోకానికి అనుకరణీయమవుతుంది.

కాసేపు ఆగి బాబాయి మళ్ళీ అన్నాడు "అయోగ్యుడు ఏదో ఒక యోగ్య కృతికి కర్తయే అనుకుందాం. అలాటి వేళ అలాటి కృతి లోకుల దృష్టిలో శంకాస్పదమవుతుంది. అయోగ్యకృతిగా చూడబడే ప్రమాదం లేకపోలేదు."

ఇంతసేపు మౌనంగా వున్న పెద్దమ్మాయి అరుణ ఇలా అంది "బాబాయి! మిమ్మల్ని ఓ ప్రశ్న అడుగదలచాను. యోగ్యుడని అందరు అనుకొనే అతను అయోగ్యకృతిని ఆచరించాడని అనుకొందాం. అది ప్రజలచే ఎలా చూడబడుతుంది? మీరన్నదాన్నిపట్టి అది యోగ్యకృతిగానే చూడబడాలి."

---

✶*Subjective* = ఆత్మాశ్రయ
*Objective* = వస్తుగత } బూదరాజు రాధాకృష్ణః

వెంటనే స్పందిస్తూ కరుణ అంది : "యోగ్యుడు యోగ్యకర్మను, అయోగ్యుడు అయోగ్యకర్మను ఆచరించినప్పుడు ఏ ప్రశ్న తలెత్తదు. వచ్చే చిక్కల్లా యోగ్యుడు అయోగ్యకర్మను, అయోగ్యుడు యోగ్యకర్మను ఆచరించినప్పుడు ఇవి సమస్యాత్మక క్షేత్రాలని అంగీకరించక తప్పదు."

అజీత్ బాబాయి మందహాసం చేస్తూ ఇలా అన్నాడు. "యోగ్యుడు అయోగ్యకృతికి పూనుకుంటే అది 'ప్రమాదవశాత్తని' తలుస్తారు. ఒకసారికి క్షమిస్తే క్షమిస్తారు కూడా! అదే పునరావృత్తం అయితే యోగ్యుడు యోగ్యునిగా మిగులడు. అయోగ్యునిగా చూడబడుతాడు."

ఇది అందరూ అంగీకరించాక ఒకావిడ ఇలా అంది "అసలు విషయానికి వద్దాం. యోగ్యుడు యోగ్యకృతిని, అయోగ్యుడు అయోగ్యకృతిని ఆచరించే విషయానికి పరిమితమౌదాం."

అజీత్ బాబాయి అన్నాడు "భేష్! మీకొక కథ చెబుతాను వినండి." అపర విష్ణుశర్మయైన బాబాయి కథ చెప్పటానికి ఉపక్రమించాడు.

మహాత్మాగాంధీ గురించి ఎవరికి తెలియదు? ఆయన జగన్మాన్యుడు.

సత్ఫలితాన్ని పొందడానికి, సత్సాధనాలనే అవలంబించాలనేదే ఆయన సిద్ధాంతం. సత్యాహింసలే ఏ అన్యాయాన్నైనా ఎదురుకొనడానికి ఆయన చేబూనిన శస్త్రాలు. ఎదురుకొనడమంటేనే సత్యాగ్రహం. ప్రజలుగాని ప్రభుతగాని అహితానికి పూనుకొన్నప్పుడు ఉపవాసదీక్షతతో నిరసనను తెలిపేవాడు. నకారాత్మక వృత్తి ఎప్పుడు తలెత్తినా, అన శనవ్రతం చేసేవాడు. పరిస్థితులు వికటించి మనిషి మనుగడకే ముప్పు వాటిల్లిన పరిస్థితిలో ఆమరణోపవాస దీక్ష పూనేవాడు.

ఆయనకు సన్నిహితుడూ, స్వాతంత్ర్య సంగ్రామసేనానీ అయిన సర్దార్ వల్లభాయిపటేలు వ్యావహారికదృక్పథం కలవాడు. బాపూజీ చీటికి మాటికి ఉపవాసదీక్షకు దిగడం ఆయనకు నచ్చేదికాదు.

ఓసారి దేశంలో ఓమూల అల్పసంఖ్యాకులపై అధికసంఖ్యాకులు దాడికి దిగారు. ప్రాణనష్టంతో పాటు పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. ఇది సహించలేని మహాత్ముడు దేశవాసులకు తన నిరసన ఉపవాసదీక్ష ద్వారా తెలియజేయాలను కొంటున్నవేళ, ఆయన దగ్గరకు సర్దారు పటేలు రావడం తటస్థించింది.

*ఈ కథలో రచయిత *Right Person, Righ thing* అనే పదాలు వాడారు, *Righ, Wrong* పదాలు *moral Judgement* ను కాక *Utile Judgement* ను సూచిస్తాయి.*

ఇది తెలిసికొన్న పటేలు శాంతంగా ఇలా అన్నాడు "బాపూ! ఎందుకని ఈ ఉపవాస దీక్ష? మిమ్మల్ని మీరు ఇబ్బంది పెట్టుకుంటూ, మమ్మల్ని తీవ్ర మానసిక వేదనకు గురిచేయటం భావ్యమా? ఉపవాసంతో ఉన్మాదాన్ని అంతమొందించగలమా? ఉక్కుపాదంతో ఉన్మాదం అణుగుతుంది." బాపూ తన ఆలోచనను మానుకొనటానికి 'ససేమిరా' అన్నాడు. అసురీవృత్తిని శారీరిక శక్తితో కాదు్ష్మ నైతిక శక్తితో తుదిముట్టించాలన్నది ఆయన సిద్ధాంతం.

"భాయీ! ఉపవాసాన్ని మించిన విరుగుడు లేదు. పోట్లాటలు మాన్పటానికి మరో మార్గం నాకు కనిపించదు. నేను ఉపవాసానికి దిగి మిమ్మల్ని బాధపెట్టినవాణ్ణి అవుతున్నాను కదా! ఈసారి ఉపవాసదీక్షకు నీవే పూనుకో. నేను అన్నపానీయాలు మానవలసిన అవసరముండదు."

సర్దార్ నిర్ద్వంద్వంగా బాపూజీ ప్రతిపాదనను తోసిపుచ్చుతూ ఇలా స్పందించాడు "ఆ పనిని నేనెన్నడూ చెయ్యను."

"ఎందుకూ?" అడిగాడు బాపు.

అందుకు సర్దార్ అన్నాడు "నేను ఉపవాసానికి మీ సలహా ప్రకారం దిగితే, మానుమనేవారు వేళ్ళమీద లెక్కపెట్టదగినవారైతే చచ్చేవరకు కొనసాగించమనేవారు లక్షల్లో ఉంటారు. ఎందుకంటారా? నేను బతికి ఉంటే వాళ్ళ ఆటలు సాగవు. ఆమరణదీక్షకు నేను దిగే పక్షంలో సమస్యను ఓ కొలిక్కి రాకుండా అడ్డంకులు కల్పించి నా అంత్యాన్ని కళ్ళారా చూస్తారు."

కాసేపాగి సర్దార్ అన్నాడు: "బాపూ! ఉపవాస దీక్ష పూనడానికి మీరే అన్నివిధాలా అర్హులు! 'ఇదిగో అన్నపానీయాలు మానేస్తున్నా' అని మీరనడమే తరువాయి జనులలో కలకలం మొదలవుతుంది. సమస్యకు సమాధానాల గాలింతలు మొదలవుతాయి. దేశం నలుమూలల నుంచి వేల సంఖ్యలో తంతులూ ఉత్తరాలూ వచ్చిపడుతాయి. వార్తాపత్రికలు పెద్దపెద్ద సంపాదకీయాలతో అందరినీ హడలగొడుతాయి. మీమాటే చివరకు నెగ్గుతుంది. ఇక మీరు వ్రతం మొదలెట్టండి. నా అభ్యంతరం ఉండదు."

బాపు బోసినవ్వుతో సర్దారుకు తన ధన్యవాదాలు తెలుపుకొన్నాడు.

కథ ముగించి బాబాయి అన్నాడు. "సరైన పనిని సరైన వ్యక్తియే చేయాలి. సరైన పనిని అయినా అందుకు సరిపోని వ్యక్తి చేసినప్పుడు ఫలితం ఉండదు. ఇది గ్రహించారా?" అందరూ సంతోషంతో తలలూపారు.

కరుణ అంది : "యోగ్యుడు కాని వ్యక్తి యోగ్యుడవడానికి ఏం చేయాలి? అలా కావడానికి అవకాశముందా?"

బాబాయి 'ఉంది' అంటూ ఈ విధంగా ప్రతిపాదించాడు.

"1. అయోగ్యుడైన వ్యక్తి అయోగ్యమైన కృతిని ఆచరించడం.

2. అయోగ్యుడైన వ్యక్తి యోగ్యకృతిని ఆచరించడం.

3. యోగ్యుడైన వ్యక్తి అయోగ్యకృతిని ఆచరించడం.

4. యోగ్యుడు యోగ్య కర్మ నాచరించడం."

"అయోగ్యుడైనవాడు అయోగ్యకృతియందే ఆసక్తుడై వుంటాడు. అతడు తనను సరిదిద్దుకొని యోగ్యకృతికి పూనుకోవాలి. ప్రజలకు ఆశ్చర్యం వేస్తుంది. పొరపాటున యోగ్యకృతికి దిగాడని ఎద్దేవా చేస్తారు. అయోగ్యుడు ఒకదాని తరువాత ఒకటి ఇలా మంచి మంచి పనులు చేస్తూపోతుంటే ప్రజలు తమ అభిప్రాయాన్ని మార్చుకొని ఆ వ్యక్తిని సరైన వ్యక్తిగానే పరిగణిస్తారు."

"సరైన వ్యక్తిగా గుర్తింపు పొందాక కూడా, అతడు అయోగ్యకర్మను కొన్నిసార్లు ఆచరించవచ్చు. అయినా ప్రజలు అభిప్రాయాన్ని మార్చుకొనరు. వ్యక్తి యోగ్యుడ్కే అనావధానత వల్ల పొరపాట్లు చేశాడని సహిస్తారు. అలా తప్పులు చేస్తూనే సత్కర్మాభిరక్తుడై మరికొన్ని మంచి పనులు చేసి యోగ్యకర్మనాచరించే యోగ్యునిగా గుర్తింపు పొందుతాడు. ఇదే అపసవ్యాచరణ నుండి సవ్యాచరణ వైపు కదలడానికి అవసరమైన ప్రక్రియ."

"బాగా చెప్పారు" అంది పెద్దమ్మాయి అరుణ.

బాబాయి అన్నాడు "యోగ్యమైన వ్యక్తి ఎవరో యోగ్యకర్మ ఏమిటో బోధపడిందా? ఇలా నాల్గు కోవలకు చెందే వ్యక్తుల ఉదాహరణలను మీరియ్యాలి."

మొదట కరుణ అంది: "అయోగ్యుడైన వ్యక్తి అయోగ్యకర్మను ఆచరించినాడనడానికి ఉదాహరణ: రావణుని సీతాపహరణం."

వరుణ : "వదురుబోతు మాటకు విలువ ఇచ్చి రాముడు ఏ పాపమెరుగని ఇల్లాలిని అడవుల పాలు చేయడాన్ని యోగ్యుడైనవాడు అయోగ్యకర్మను ఆచరించాడన్న దానికి దృష్టాంతంగా తీసుకోవచ్చు."

అరుణ : "సీతాపహరణం కూడదని రావణునికి మారీచుడు హితవు చెప్పాడు. ఇది అయోగ్యుడు యోగ్యకర్మను ఆచరించడం అవుతుంది."

ఈ మూడు సమాధానాలకు బాబాయి ఎంతో సంతోషించి మరో ప్రశ్న వేశాడు.

"యోగ్యుడు ఆచరించిన యోగ్యకర్మకు దృష్టాంతం?"

వరుణ వెంటనే స్పందించింది. "జటావల్కలధారి, తాపసి యైన రాముడు ఖరదూషణుల వధకు పూనుకొనడం సరికాదని సీత అనునయించడం."

బాబాయి ముగ్గురి తెలివితేటల్ని కొనియాడుతూ మరో ప్రశ్న వేశాడు. "మనకు మిగిలిన పర్యాయమేమిటి?"

పెద్దమ్మాయి అరుణ అంది : "యోగ్యకృతికి అధికారి యోగ్యవ్యక్తియే. అతని వల్ల పొరపాట్లు సంభవించినా వాటిని సరిదిద్దుకొంటూ యోగ్యవ్యక్తిగానే ఉండిపోవడం."

కరుణ అంది : "అయోగ్యకృతికి పాలుపడే అయోగ్య వ్యక్తులం కాకూడదు. అలాగే అయోగ్యులమైనప్పుడు యోగ్యకర్మాచరణకు పూనుకోకూడదు."

బాబాయి అడిగాడు: "కీలకాంశం ఏమిటి?"

"యోగ్యుడు కావడమే!" జవాబిచ్చింది వరుణ.

"ఎలా?" అడిగాడు బాబాయి. తగు దర

"యోగ్యకృతిని ఆచరించడానికి ప్రయత్నించడం."

అలసిన మేనులకు మనస్సులకు ఊరట కల్గించే నిమిత్తం వరుణ లోపలికి వెళ్ళి లడ్డులూ, "శష్కులాలు గల పళ్ళెరంతో ప్రత్యక్షమైంది. అందరి దృష్టి చర్చ నుండి తిండివైపు మరలింది.

ఇంతలో ఇంటి ముందు ఓ కారు ఆగింది. ముగ్గురమ్మాయిలకు సోదరుడైన డా? రమేశ్ వీరు సమావేశమైన గదిలోకి అడుగెడుతూనే పళ్ళెరం నుండి చేతికందినన్ని తినుబండారాల్ని తీసుకొన్నాడు.

"వీడు యోగ్యమైన సమయంలో, యోగ్యమైన స్థలంలో యోగ్యమైన పనికి పూనుకొన్న యోగ్యుడు" అంది పెద్దమ్మాయి. నవ్వుల మతాబాలు పేలినవి.

**యోగ్యకర్మాచరణకు యోగ్యుడవు కావాలి.**

---

*చకినాలు

# 11. నియతి

గుజరాత్ రాజ్యంలో 'వాపి' అనే పట్టణముంది. 'ఆర్యన్ పేపర్స్ లిమిటెడ్' అనే పరిశ్రమ (Industry) ఉంది. రాజన్ షా, సునీల్ షా అనే వారు ఆ పరిశ్రమకు వ్యవస్థాపకీయ నిర్దేశకులు. శ్రీహరినాథ్ గారు వ్యవస్థాపకీయ మండలిలో ఒక సభ్యుడు. వ్యవస్థాపన మీద ఎన్నో గ్రంథాలు వ్రాసారు. ఎన్నో కంపనీలకు ఆయన అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. షా ద్వయానికి ఆయన గురుతుల్యుడూ, పితృతుల్యుడూ కూడా. శ్రీహరినాథ్ గారికి 'షా' పరివారమంటే ఎంతో అభిమానం.

'షా' పరివారం పారిశ్రామిక పట్టణమైన వాపిలో నివసించటానికి, బదులు దానికి చేరువలోనున్న 'క్షేత్రగృహాన్ని' (Farm House) ఆవాసం కావించుకొన్నారు.

క్షేత్రం చిన్నదేమీ కాదు. కొన్ని ఎకరాలకు విస్తరించివుంది. తరులతా గుల్మాలతో అది చూపరులకు నేత్రపర్వం కావించేదిగా ఉంది. కేవలం ఆమ్ర వృక్షాలేనా? కాదు. దాడిమ జామ మొదలగు వృక్షాలు కలది. వీటి మధ్య నున్న భవంతికి 'కృష్ణాశ్రమం' అని పేరెట్టారు. ఆర్యన్ పేపర్స్ లిమిటెడ్ సంస్థాపకులు కిషన్లాల్ షా స్మృత్యర్థం అలా చేశారు. ఆయన పరబ్రహ్మంలో విలీనుడై కొన్ని సంవత్సరాలయినవి. క్షేత్రగృహం కేవలం నివాసయోగ్యమైనదే కాదస్మి అనిర్వచనీయమైన ఆనందానుభూతిని కలిగించే మున్యాశ్రమం.

ఏదో ఒక మండలి సమావేశానికి వచ్చిన శ్రీహరినాథ్ 'షా' పరివారమిచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, సాయంకాలమంతా అక్కడ వారితో గడిపారు.

రాజన్ షా గురూజీతో విచారవినిమయం చేయదలచినవాడై ఇలా అన్నాడు. "గురూజీ! పోయిన సంవత్సరం కంటే ఈ సంవత్సరం 'కంపనీ' పరిస్థితి మెరుగ్గా వుంది."

సునీల్ షా రాజన్ షా వెలిబుచ్చిన అభిప్రాయాన్ని సమర్థిస్తూ ఇలా అన్నాడు.

"గత సంవత్సరం పరిస్థితి అంతా ఆశాజనకంగా లేకుండె. ఊహించిన లాభాల బాటలో కంపనీ నడవలేదు".

జరుగుతున్న చర్చలో భాగస్వామిని ఔతూ ఉషాబేన్ ఇలా అంది. "మనం ఆచరించే కృషికి ఫలితం ఒకేలా వుండదు. ఒకో సమయంలో ఒకోలా వుంటుంది. ఒకోసారి కలిసివస్తుంది. ఒకోసారి రాదు. యశశ్రీ వరించాలంటే మనుష్యుడేం చేయాలి గురూజీ!?"

గురూజీ ఏమీ అనకముందే, పరివార సదస్యురైన ఉషాబెన్ అన్నదానిపై మరొక సదస్య అయిన జయశ్రీ బేన్ ఇలా భాష్యం చేసింది. "జయాపజయాలు దైవాయత్తాలు. కృషి సల్పడం మనవంతు. ఫలితం దైవనిర్ణీతమే."

జయశ్రీ ఉషాబేన్‌ల అభిప్రాయాలతో విభేదిస్తూ సునీల షా అన్నాడు "కృషికి ఫలితం దైవాధీనమైతే, పూర్వనిర్ణీతమైతే మానవుడు యశస్సు కోసం ఎందుకు సంఘర్షించాలి? అంతా దేవునికి ఒదిలితే పోలా? ఏది జరగాలో అది జరిగి తీరుతుంది."

రాజన్ షా అన్నాడు. "ఉద్యమించకుండా ఊరికే కూర్చుంటే ఫలితం చేతికి అందుతుందా? దైవం తోడ్పాటు ఉండాలి సరే! మనుష్య ప్రయత్నం అక్కరలేదా?"

పరివార సదస్యులు చర్చించటాన్ని ఆపేసి గురూజీ కేసి చూశారు. ఎప్పటిలా చిరునవ్వు చిందిస్తూనే గురూజీ అన్నారు.

"మీరు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఓ విధంగా సరియైనవే! ముఖ్యప్రశ్న మనుష్యప్రయత్నానికి, నియతికి సంబంధించింది. పురుషకారం వల్ల ఫలితం సిద్ధిస్తుందా? దైవానుగ్రహం వల్లనా? కర్తగా మానవునకు స్వేచ్ఛ ఉందా? లేక దైవీ ప్రేరణవల్ల ఉద్యమశీలుడౌతాడా? యశస్సనేది కృషి ఫలితమా లేక దైవానుగ్రహమా?"

ఇలా అంటూ వారి వైపు చూశాడు. విషయ సంబంధిత అంశాలను ప్రశ్నరూపంలో ప్రతిపాదించినందుకు కుటుంబ సభ్యులు ఎంతగానో సంబరపడ్డారు.

శ్రీహరినాథ్ తన వ్యాఖ్యను కొనసాగిస్తూ "జయాపజయాలను నిర్ణయించేది 'నియతి'. దీని నుండి దైవాన్ని పరిగణనలోనికి తీసికొని మానవుణ్ణి నిష్క్రాసితుణ్ణి చేసే అవసరం లేదు. నిత్యవ్యవహార భాషలోనిది కాదు. *నిగూఢ భాష లోనిది. 'ఫలితం' అనే 'త్రిత్రయాన్ని ఇది సూచిస్తుంది."

'నియతి' అనే పదం 'కారణం' 'ప్రక్రియ'

ఇంగ్లీషులో 'God' అనే పదముంది చూశారూ! G.O.D. అనే వర్ణత్రిత్రయంగా ఈ పదాన్ని విదీయవచ్చు. ఇక్కడ 'G' అంటే 'Goal' లేక లక్ష్యం. 'D' అంటే 'Density' లేక విధి. లక్ష్య నిర్ధారణ మానవుని చేతిలో ఉంది. విధి అనేది 'ఫలితంగా' మనం సల్పిన కృషికి ప్రాప్తించేది. ఈ 'G' 'D' ల మధ్య ఉన్న 'O' మాటేమిటి? 'O' అనేదాన్ని Obstruction అంటే అవరోధంగా లేక Opportunity అంటే అవకాశంగా అన్వయించుకోవాలి. ప్రయత్నానికి ఫలితానికి మధ్య 'O' ఉంది. ఈ 'O' మధ్యవర్తిత్వం నిర్వహించే శక్తి.

లక్ష్యం ⟶ అవరోధం / అవకాశం ⟶ నిర్ణాయకశక్తిః విధి

అందివచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించనివాడు, అవరోధాలను అధిగమించనివాడు పొందే ఫలితం నిర్ధారిత లక్ష్యానికి అనుగుణంగా ఉండదు. అవరోధాల్ని చాకచక్యంతో అధిగమించి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని చక్కగా వినియోగించుకొన్నాక సిద్ధించే ఫలితం ఊహించినదానికన్న ఎక్కువగానే వుంటుంది. అవరోధాల్ని అవకాశాలుగా మలుచుకుంటే సంప్రాప్తించే ఫలితం మాటలకు అందనిది.

సునీల్ షా ఉత్సాహంతో స్పందించాడు "గురూజీ! బాగా చెప్పారు. చివరకు నియతి లేక 'దైవం' అనేది మానవ ప్రయోజనాలకు క్షతి కలిగించే శక్తి కాదన్న మాట! అవరోధాల్ని తెలివిగా అధిగమించడం, అవకాశాల్ని వినియోగించుకోవడం పైనే ఫలితం ఆధారపడి ఉన్నదన్నమాట."

ఎసీ రాజన్ సునీల్ షా మాటతో ఏకీభవించలేకపోయాడు. "దైవం భూమిక ఏమిటి?" అంటూ సునీల్ను నిలదీశాడు.

శ్రీహరినాథ్ ఇద్దరిని సముదాయిస్తూ ఇలా అన్నాడు. "భగవంతుడు శక్తిసంపన్నమైన శరీరంతో పాటు మనోబుద్ధుల్ని మనకు ప్రసాదించాడు. అవరోధాల్ని అధిగమించడానికి మరేమి కావాలి!" అందరూ అంగీకరించారు.

శ్రీహరినాథ్ మరింత ఉత్సాహంతో అన్నాడు "దైవం మనను ఎల్లవేళలూ అనుగ్రహిస్తుంది అందుకు మనం అర్హులం కావాలి."

ఉషాబేన్ జయశ్రీబేన్ ఒకేమారు ప్రశ్నించారు "గురూజీ! దైవానుగ్రహం ఎలా సాధ్యం?"

గురూజీ అన్నాడు: "సేవామార్గమే దైవానుగ్రహానికి యోగ్యులవటానికి రాజమార్గం. సదా ప్రయత్నించండి. మీ వంతు యోగదానాన్ని సమాజానికి అందించండి. శ్రేష్ఠతాశిఖరాలను అధిరోహించే దిశలో ప్రయాణించండి. పరివారానికి, సమాజానికి, దేశానికి, చివరకు ప్రపంచానికి మేలు కలిగించిన వారవుతారు. అంకితభావంతో మీరొనరించే 'శ్రమ' సాధనాస్వరూపాన్ని సంతరించుకొంటుంది. దైవప్రేరిత మైంది సాధన. ఈ సాధన వల్ల దైవత్వాన్ని మీలో దర్శించుకొంటారు."

అందరూ లేచి నిలబడి శ్రీహరినాథ్ను ఆశీర్వదించవలసినదని అభ్యర్థించారు.

*Cryptic

"సమాజానికి సేవలందీయండి. గుర్తింపు పొందండి. జీవనాన్ని ఆనందమయం చేసుకొండి." అంటూ గురూజీ వారిని మనసారా దీవించాడు.

లక్ష్యం, అవకాశం, విధి.
అనే త్రితయాన్ని సూచించే పదం 'నియతి'.
ఆనందాన్ని అభివ్యక్తికే పరిమితం కానీయకుండా
అనుభూతిగా చేసుకొండి.

# 12. పురస్కారం : శిక్ష

గోపాల వర్మ మహారాజావారు సౌరాష్ట్ర సంస్థానాధీశులు. ఆయన గారి ప్రధానామాత్యులు మోహనశర్మ. బహురాజనీతికుశలుడు. బహురాజనీతికుశలుడు. ప్రజాభిమానాన్ని చూరగొన్న సౌజన్యమూర్తి. అరిపేద అయినా ఆగర్భ శ్రీమంతుడైనా ఆయన దృష్టిలో సమానుడే. ఆయన కర్తవ్యపరాయణత్వం ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించి పెట్టింది. ఇదంతా ఓకంట కనిపెడుతున్న మహారాజావారు లోలోన కృంగిపోసాగాడు. 'ప్రధానామాత్యుల వారి లోకప్రియత రాజ్యంలోని సర్వస్తరాలకు విస్తరించింది. ఇదేమంత మంచి పరిణామం కాదు. వాస్తవానికి ప్రజల దృష్టిలో గొప్పవానిగా నేను నిలువవలె. ఈ పరిస్థితిని సరిదిద్దడమే తత్క్షణ కర్తవ్యం. '

నిదురకు వెలియై అనేకరాత్రులు ఆలోచించిన మీదట బంగారం వంటి ఆలోచన మహారాజావారి మనః కవాటాన్ని తట్టింది. అత్యవసర సమావేశానికి హాజరుకావలసినదిగా అమాత్యులవారికి ప్రత్యేకదూత ద్వారా కబురు పంపారు. ప్రభువుల ఆజ్ఞను శిరోధార్యంగా భావించే మోహనశర్మ తత్క్షణమే బయలుదేరి రాజప్రాసాదాన్ని చేరుకొని ప్రభువుల ముందు ముకుళితహస్తుడై నిలుచున్నాడు.

రాజుగారు అన్నారు. "అమాత్యవర్యా! నానాటికి మీపై పనిభారం ఎక్కువవుతున్నది. మీరు పడుతున్న మానసిక ఆందోళనను అర్థం చేసుకొన్నాను. ప్రశాసకీయ పునర్ వ్యవస్థీకరణ అవసరమైనందున ఈ నిర్ణయానికి మేము వచ్చాము. మీ మా మధ్య పనివిభజన ఎంతైనా అవసరం."

"అలాగే మహారాజా!" సవినయంగా తన సమ్మతిని మోహనశర్మ తెలిపాడు.

రాజావారు తన మనోగతాన్ని చివరకు ఇలా బయటపెట్టాడు. "నేటి నుండి అర్హులైన వారికి పురస్కార ప్రదానం చేయడం మావంతు. రాజ్యకంటకులను సమూలం నిర్మూలించి సంస్థానాన్ని సుఖశాంతులకు పట్టుగొమ్మ కావించటం మీ వంతు బాధ్యతగా గుర్తించి పనికి పూనుకొనండి."

మహారాజావారు సూచించిన పని పంపకంలో తలెత్తే దుష్పరిణామములను మోహనశర్మ చక్కగా పసిగట్టాడు. మహారాజవారు మనస్సు మార్చుకొనేలా చేయాలన్న తలంపుతో ఇలా అన్నాడు. "ప్రభూ! మీరు సూచించిన కార్యవిభజన భేషుగ్గా ఉంది. అయినా అందులో సాధకబాధకాలు....."

మోహనశర్మ నివేదనను అర్ధాంతరంగానే ప్రభువులు ఖండించి తన నిర్ణయం తుది నిర్ణయమని ప్రకటిస్తూ ఇలా సెలవిచ్చారు "శర్మగారు! అస్తమానం మీరు సమస్యల గురించే మాటాడుతారు. పరిష్కారాన్ని ఏనాడు మీరు సూచించలేదు పరిష్కారాలు గురించి ఆలోచించడాన్ని అలవర్చుకొండి. మా తుది నిర్ణయంగా ప్రకటించిన తరువాత మీ నుండి ఏమీ వినదలుచుకోలేదు. ఇక మీరు వెళ్ళవచ్చు.'

చర్చించటం వల్ల, తర్కించుట వల్ల ఏమీ నిష్పన్నం కాదన్న కటుసత్యాన్ని గ్రహించినవాడై మోహనశర్మ ప్రభువుల నుండి సెలవు పుచ్చుకొన్నారు.

రాజావారు పురస్కార ప్రదానపర్వాన్ని భేరీభాంకారాలతో ప్రారంభించారు. ప్రజల ఆనందానికి అవధులు లేవు. అయితే ఈ ఆనందం ఎక్కువ కాలం నిలువలేదు. ప్రతిభాసంపన్నులతో పాటు, ఊరుపేరులేని ఆషాఢభూతులు ప్రభువుల వారిచే సన్మానితులు కావడం ప్రజలకు రుచించలేదు. రాజ్యంలో మంద్రస్థాయిలో నిరసనలు మొదలైనవి. ప్రభువుల వారు స్వీయలోకప్రియతను పెంచుకొనేందుకు దేశకాలపాత్రతల్ని విస్మరించడం ప్రజలను రోషాయత్తచిత్తులను చేసింది. మహారాజా వారి ప్రతిష్ఠ మంటలో కలవడానికి ఎంతోకాలం పట్టలేదు.

మరి మోహనవర్మ శిక్షాస్మృతికి మానవ పార్శ్వాన్ని జతపరచాడు. నేరం చిన్నదైతే మందలింపుతో వదిలిపెట్టేవాడు. అక్షమ్యమైన అపరాధాల్ని ఒనరించి సువ్యవస్థకు భంగం కలిగించే దేశసమాజద్రోహులకు ఆజన్మకారాగార శిక్ష లేక మరణదండన విధించేందుకు వెనకాడేవాడు కాదు.

మహామంత్రి అవలంబించిన ఈ విధానం వల్ల సంస్థానంలో భద్రతాభావం వృద్ధింగతమైంది. ప్రజావళికి ఆయన ప్రాతః స్మరణీయుడయ్యాడు.

ఓ సంవత్సరం గడిచిపోయింది. రాజా వారు కనులు తెరిచారు. మహామంత్రి అందుకొంటున్న మన్ననలను, తాను దాదాపు ప్రజలచే విస్మృతుడైన కటు సత్యాన్ని గ్రహించారు. గౌరవం పురస్కారాలతో కాక శిక్షతో లభిస్తుందన్న తర్కవిసంగతమైన నిర్ణయానికి వచ్చారు. ప్రజలలో రాజభక్తితో పాటు రాజభీతి పెరుగాలంటే శిక్షాస్మృతిని కఠినాతి కఠినంగా అమలుపరచడమే మార్గమని నిర్ధారించారు.

ఒకనాటి సాయంకాలం, ప్రభులవారు అమాత్యులను స్వీయసన్నిధికి రావించుకొని ఇలా అన్నారు.

"మోహనశర్మ గారు! ఇరువురం కార్యవిభజన కావించుకొని సంవత్సర కాలం

ముగిసింది. మన భూమికలను మార్చుకోవడం సద్యః కర్తవ్యం. నేటి నుండి సంస్థానానికి సేవలందించిన వారిని సత్కరించడం మీ బాధ్యత. నేరస్తులను కఠినంగా శిక్షించి రాజ్యంలో సువ్యవస్థకు క్షతి కలగకుండా చేసే ఉత్తరదాయిత్వాన్ని మేము స్వీకరిస్తాం."

"విధి నిర్వహణలో హఠాద్ విపర్యయం వల్ల ప్రమాదముంది ప్రభూ" సవినయంగా నివేదించుకొన్నాడు మోహనశర్మ. 'ఏ నిర్ణయం తీసికొనే ముందైనా చర్చించటం అవసరమని' నెత్తిన నోరెట్టి ప్రభువులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. పైగా రాజావారు శర్మ విన్నపాన్ని అపార్థం చేసుకొన్నారు. ఆయన నిజాయితీ విషయంలో సంశయితమనస్కుడైనాడు.

ప్రస్తుత వ్యవస్థ శర్మకు హితావహమైనందున ఈ రీతిగా మాట్లాడుతున్నాడని లోలోన మండిపడ్డాడు. పూర్వాభినివేశాన్ని ప్రదర్శిస్తూ రాజావారు తన నిర్ణయాన్ని తుది నిర్ణయంగా ప్రకటించారు. "అలాగే ప్రభూ!" అన్నాడు ఏమీ పాలుపోని మోహనశర్మ.

రాజావారు మరునాటి నుండే ప్రజల్ని ఎడాపెడా దండించడం మొదలుపెట్టాడు. నలుసంత నేరమైతే కొండంత శిక్షపడసాగింది. నేరం చిన్నదైనా చీకటి కొట్టు తప్పనిసరి అయ్యింది. అమాత్యులవారు పురస్కార ప్రదానంలో యోగ్యతకు సముచిత స్థానం కల్పించారు.

గతాధ్యాయం పునరావృత్తమైంది. మహామంత్రి యశోవిభూతుడైనాడు. రాజా వారు నానాటికి ప్రజలకు దూరమవుతున్నారు.

నిప్పురవ్వలుగా మొదలయిన ప్రజానిరసన దావానలస్థాయికి చేరుకుంది. రాజు గద్దె దిగాలన్న సభంగమఘోషలతో సంస్థానం దద్దరిల్లింది. ఊరేగింపు లేని రోజులేదు. మోహనశర్మను రాజ్యాభిషిక్తుణ్ణి చేయాలన్న నినాదాలు సంస్థానమంతటా వినిపించసాగాయి. రాజు గారి అంగరక్షకులు సైతం ఊరేగింపుల్లో పాల్గొన్నారంటే పరిస్థితి ఎంత విషమించిందో ఎవరైనా ఇట్టే ఊహించుకోవచ్చు.

రాజా వారు వొఠ్ఠి అమాయకులని మోహనశర్మకు తెలుసు. పైగా ఆయన ప్రభుభక్తిపరాయణుడు. ప్రజ్వలించిన విప్లవజ్వాలలు సంస్థానమంతా వ్యాపించక ముందే తక్షణమే ఉపశమింపజేయడం ప్రధానామాత్యునిగా తన ఆద్య కర్తవ్యమని ఎంచినవాడై రంగప్రవేశం చేశాడు.

రాజు గారు పట్టుదల గల మనిషి అన్న సంగతి శర్మకు తెలుసు. తానై చెప్పితే చెవిని పెట్టడు. పైగా తన యెడ ఈర్ష్యాళువు. రాణి గారు తలెత్తిన పరిస్థితిలో అంతా

సుఖాంతమయ్యేలా చేయగల సామర్థ్యం కలిగిన వారని అమాత్యులకు గట్టినమ్మకం. రాణి బుద్ధిమతి గారి దర్శనం కావించుకొని సంస్థానం ఎదురుకొంటున్న పరిస్థితిని పూసగుచ్చినట్లు వివరించాడు.

రాణి బుద్ధిమతి సింహాసనానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించింది. అమాత్యుల వారికి కృతజ్ఞతలు తెలుపుకొంది. ఆనాటి రాత్రి ప్రభువులతో సమావేశమై ఇలా అన్నది "మీరు నిర్మలహృదయులు. కల్లాకపటం ఎరుగని వారు. అనాలోచితంగా ఏవో పనులు చేసి పీకలమీదికి తెచ్చుకొంటారు. సంస్థానంలో తలెత్తిన పరిస్థితిని గమనించండి. ఇవాళ మనం చూస్తున్న చిదురుముదురు తిరుగుబాట్లే విప్లవంగా పరిణమిస్తాయి. మీ ప్రధానామాత్యులు రాజకీయచతురత కలవారు. ఆయనతో మాట్లాడండి. విషమించిన పరిస్థితిని మామూలుకు తేగల తెగువ ఆయనకుంది." మహారాజా వారు శర్మతో చర్చించడానికి అంగీకృతిని తెలిపారు.

మరునాటి ఉదయం మహారాజా వారు అమాత్యుల వారితో సమావేశమైనారు. ప్రజల్లో పెచ్రేగుతున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని ప్రభువుల తర్కవిసంగతమైన ఆచరణను శర్మ రాజా వారి దృష్టికి తెచ్చారు. సమయోచిత చర్యలను చేపట్టకపోతే సంభావ్య భీషణపరిణామాన్ని గురించి ఏలికను అప్రమత్తున్ని కావించాడు.

రాజా వారు మంత్రి గారు చెప్పిన దానిని ఓపికతో అవధరించి ఇలా అన్నాడు. "అమాత్య మహోదయా! మీరు మా హితైషులు, హితవరులు. సంస్థానానికి మార్గనిర్దేశం చేయగల సమర్థులు. మీ విలువను గుర్తించినాము. సంస్థానంలో యథాపూర్వస్థితిని తేవటానికి చేపట్టవలసిన చర్యలను సూచించండి." అన్నాడు.

ప్రధానామాత్యులు భక్తిభావంతో ప్రభువుల వారికి నమస్కరించి ఇలా

"దేవర వారు శతవసంతాలు జీవించాలి! కఠినాతికఠినశిక్ష విధించే ఏలిక ప్రజాకంటకుడిగా చూడబడతాడు. చేసిన నేరం పెద్దదే అయినా ఉపేక్షించే లేక అల్పశిక్షతో వదిలిపెట్టే ప్రభువు ప్రజల గౌరవవిశ్వాసాల్ని కోలుపోతాడు. ఏమాత్రం యోగ్యతలేని వాళ్ళను నానావిధ పురస్కార విభూషితుల్ని చేసే రాజు అపహాస్యం పాలవుతాడు. దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా పురస్కారాన్ని ఈయని రాజు చరిత్రహీనుడౌతాడు. పురస్కారం కాని శిక్ష కాని యోగ్యతను బట్టి ఉండాలి. ఇది తెలిసి నడుచుకొనే రాజు ప్రజల మన్ననలకు పాత్రుడౌతాడు. యాదౌచిత్యాన్ని అనుసరించి పురస్కార శిక్షా ప్రదానం చేసే రాజు ప్రజల భౌతిక ఆధ్యాత్మిక జీవనాన్ని సంపద్వంతం చేసినవాడౌతాడు.

ఇంద్రియసంయమనాన్ని కోలుపోయి న్యాయ్యంకాని శిక్షలను వేసే రాజు జన్మజన్మాల బూజుగా గర్హింపబడతాడు ప్రభువు ధర్మవర్తనలయినపుడే ప్రజలు ధర్మవర్తనులవుతారు. సువ్యవస్థలోనే మేధావులైనా కర్మకరులైనా అంకితభావంతో పరిశ్రమించి సంస్థానం ఉన్నతికి తమవంతు యోగదానాన్ని అందిస్తారు..... "

శిక్షాస్మృతిపై ఒనరించిన వ్యాఖ్యానానికి ముగ్ధులై రాజు ఏదో అనబోతుంటే వారించి అమాత్యులు మళ్ళీ ఉపక్రమించారు.

"మహారాజా! పురస్కారం వ్యక్తి రాజ్యానికి అందించిన యోగదానాన్ని బట్టి వుండాలి. అపరాధతీవ్రతను బట్టి శిక్ష ఉండాలి. కార్యవిభజనకున్న ఉత్తరదాయిత్వ విభజన మేలని ఏలిన వారికి విన్నవించుకొంటున్నాను. సుప్రతిష్ఠితులైన వారిని సన్మానించడమో లేక దండించడమో మీవంతు. సామాన్యుల సంగతి నేను చూసుకొంటాను...." ఈ మాటలు విన్న రాజు పరమానందభరితుడై ఇలా అన్నాడు.

"మహామాత్యా! తాము శేముషీవైభవంలో దేవగురుసమానుడనని మరోమారు నిర్ద్వంద్వంగా నిరూపించుకొన్నారు...."

రాజువారు ఇలా సెలవిస్తున్నవేళ రాణి బుద్ధిమతిదేవి ఆస్థానప్రవేశం చేసింది. రాజు గారు ఆమెకు స్వాగతం పలికారు. అమాత్యులు నతాననులై ఆమెను అభినందించారు. సభికులు కరతాళధ్వనులు కావించారు.

కథ సుఖాంతమైంది.

"పాలకులైనవారు ప్రజలను న్యాయమార్గంలో పరిపాలించాలి."

# 13. గవేషణ : ఉత్తమ వ్యక్తికోసం

కౌరవపాండవులు కౌమారావస్థ నుండి యువావస్థలోకి అడిగిడుతూ 'గురుగ్రామం'లో ద్రోణాచార్యులు ఆచార్యత్వంలో క్షాత్రోచిత విద్యాభ్యాసాన్ని దాదాపు పూర్తిచేసుకొన్నారు. శ్రీకృష్ణ బలరాములు మేనబావలైన కౌరవ పాండవులను కలిసి, అభినందించటానికి గురుగ్రామం చేరుకొన్నారు. వీరి ఆగమనం ద్రోణాచార్యులను కృపాచార్యులను సంతుష్టాంతరంగులను కావించింది.

బలరాముడు గదాయుద్ధవిద్యలో ఆరితేరినవాడు. దుర్యోధనుడంటే ఆయనకు వల్లమాలిన అభిమానం. ధృతరాష్ట్రునకు జ్యేష్ఠునిగా పుట్టిన దుర్యోధనుడు అనతికాలంలో యౌవరాజ్యపట్టాభిషిక్తుడవుతాడని అతని దృఢవిశ్వాసం. కౌరవ శతానికి పంచపాండవులంటే అసలే గిట్టేది కాదు. పాండురాజు వల్ల రాజ్యవిస్తృతి అయిన విషయాన్ని పూర్తిగా విస్మరించారు. తమకు అనుకూలం కాని వాస్తవాలను ఉపేక్షించడమే అసలైన సిసలైన రాజనీతి. పాండుమహారాజు యువావస్థలోనే ఇహలోకయాత్ర చాలించాడు. కుంతీమహారాణి నిరాధార అయ్యింది. అలాగే ఆమె కుమారులైన యుధిష్ఠిర భీమార్జునులు, మాద్రీదేవి సుతులైన నకుల సహదేవులు పెద్దదిక్కు లేనివారైనారు. వారు హస్తినాపురంలో తల్లితో సహా నివాసమేర్పర్చుకొన్నారు.

కౌరవపాండవుల మధ్య ప్రతిద్వంద్వభావం దినదినవృద్ధింగతమై తారాస్థాయికి చేరుకుంది.

దుర్యోధనుణ్ణి విశేషంగా అభిమానించే బలరాముడు వీలు చిక్కినప్పుడల్లా ప్రత్యేకవర్గాలను (Special Classes) ను నిర్వహించి, గదాయుద్ధకళలోని మెళుకువలను దుర్యోధనునికి తెలియబరిచినాడు. అతనిని సాటిలేని గదాయోధునిగా చేయడానికి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొన్నాడు. భీముడు గదాయుద్ధంలో దుర్యోధనునకు సరితూగగలవాడే. దుర్యోధనపక్షపాతి యైన బలరాముడు భీముణ్ణి ప్రత్యేక ప్రశిక్షణకు దూరంగా ఉంచాడు. ఇది కృష్ణుడు ఎరుగని రహస్యమేమీ కాదు.

ఒకనాటి సాయంత్రం ద్రోణాచార్యులు, కృపాచార్యులు, భీష్మపితామహులు, బలరాముడు, కృష్ణుడు గురుగ్రామసమీపపరిసరాల్లోని ఉపవనంలో సమావేశమై అనేక విషయాలు చర్చించుకొన్నారు. చివరలో రాజకుమారుల విద్యాభ్యాసం చర్చనీయాంశమైంది.

ద్రోణాచార్యుని వైపు ఓరగా చూస్తూ కృష్ణుడు ఇలా ప్రశ్నించాడు. "రాజకుమారులలో

సర్వశ్రేష్ఠుడు లేక ప్రథమగణ్యుడెవరు?" "సర్వశ్రేష్ఠత్వాన్ని నిర్ధారించటం శక్యంకాదు. రాజకుమారులందరూ సుశిక్షితులే. అయితే ఒకడు ఒక క్షేత్రంలో ప్రావీణ్యం సంపాదిస్తే మరొకరు వేరే క్షేత్రంలో ప్రావీణ్యాన్ని సంపాదించాడు." జవాబిచ్చాడు ద్రోణాచార్యుడు.

భీష్మ పితామహుడు అన్నాడు : "అభిరుచి వైఖరుల దృష్ట్యా ఈ ప్రశిక్షితుల్లో మొదటివానిగా ఎవరిని చెప్పుకోవచ్చునో సెలవీయండి ఆచార్యా!?"

'వైఖరి' మాటకొస్తే యుధిష్ఠిరుణ్ణి చెప్పుకోవాలి! 'అభిరుచి' పరంగా చూస్తే అర్జునుణ్ని మించినవాడు లేడు" అన్నాడు కృపాచార్యుడు.

కృపాచార్యుల అభిప్రాయంతో భీష్మద్రోణులు ఏకీభవించారు.

బలరామునకు వీరన్నది నచ్చలేదు. క్రోధావిష్టుడై ఇలా అన్నాడు. "సమస్త కురువృద్ధులూ, వారి ఆచార్యులూ పాండవుల వీరాభిమానులు, వందమంది కౌరవుల్లో ఏ ఒక్కడూ ప్రథమ గణనీయుడనిపించలేదా? పాండవులైన ఐదుగురిలో ఇరువురిని అనర్ఘరత్నాలుగా నిర్ధారించారే! ఇది మీ సమదృష్టికి పరిచాయకమా?"

"ఆచార్య ద్రోణుల అభిమత మేమిటో?" భీష్ముడు శాంతస్వరంతో అన్నాడు. ద్రోణాచార్యుడు ప్రత్యుత్తర మీయటానికి ఉపక్రమించాడు.

"వైఖరి దృష్ట్యా యుధిష్ఠిరుడే ఎన్నదగిన వాడనే నా అభిమతం. అతని దృష్టి సకారాత్మకమైనది. అభిరుచిని దృష్టిలో పెట్టుకొన్నప్పుడు అర్జునుణ్ణి శ్రేష్ఠునిగా చెప్పుకొనాలి."

"ఏ రకమైన నైపుణ్యాన్నైనా సాధించేందుకు అహోరాత్రాలు కృషిసల్పే ప్రవృత్తి ఆయనది. సంతతాభ్యాసం, ఓర్మి, పూర్ణత్వం సాధించాలనే దృఢనిశ్చయం అతని సందర్భంలో పేర్కొనదగిన సద్గుణాలు. "

భీష్మ కృపాచార్యులు అంగీకార సూచకంగా శిరఃకంపనం కావించారు. కృష్ణుడు మందస్మితం కావించాడు. బలరాముడు సహనాన్ని కోలుపోయి ఇలా అన్నాడు. "మీరన్నది నాకు సమ్మతం కాదు ఆచార్యా! సకారాత్మక వైఖరి ప్రియ దుర్యోధనునిలో ఉన్నంతగా, వేరెవరిలో లేదు. దాతృత్వంలో అతనిని మించిన వారు ఉన్నారా? అభిరుచిని శ్రేష్ఠత్వ నిర్ధారణకు నికషంగా ఎంచిన పక్షంలో దుర్యోధనుని నామమే పరిగణనీయ మౌతుంది. ఆతని గదా పాండితిని పరికించండి! మీరు అభిమానించే భీముణ్ణి అనాయాసంగా గెలిచి, అతని గర్వాన్ని తుత్తునియలు చేయగలడు."

భీష్మపితామహుడు అన్నాడు "కృష్ణా! నీ అభిమత మేమిటి?"

కృష్ణుడు అన్నాడు : "ద్రోణాచార్యులన్నది యుక్తి సంగతమనిపిస్తుంది. అలా అని, మా అగ్రజుని అభిమతాన్ని పరిగణనలోనికి తీసుకొనకుండా ఉండలేము. వారిరువురి శక్తి సామర్థ్యాలను పరీక్షకు పెడుదాం."

"సరే!" అన్నాడు బలరాముడు. కృష్ణుని కొనియాడుతూ ఉపస్థితులందరూ ఆ ప్రతిపాదనను బలపరిచారు. పాండవులు ఎదురుకొనాల్సిన పరీక్షాస్వరూపాన్ని నిర్ధారించవలసినదిగా కృష్ణుని అభ్యర్థించారు. కృష్ణుని సూచనానుసారం కౌరవ పాండవులు రావింపబడినారు. కౌరవులు దుర్యోధనుని నేతృత్వంలో, పాండవులు యుధిష్ఠిరుని నేతృత్వంలో రెండు శ్రేణులుగా ఏర్పడి పెద్దల ముందు నిలిచినారు. దుర్యోధనుడు మేరునగధీరునిగా, యుధిష్ఠిరుడు ప్రశ్రయమూర్తిగా కన్పట్టినారు. కృష్ణుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు. "ప్రియ దుర్యోధనా! ప్రియ యుధిష్ఠిరా! మీకో పరీక్ష పెడుతున్నాను. రేపు ఉదయం హస్తినాపురం యావత్తు గాలించి, ఉత్తమోత్తముడనదగిన వ్యక్తిని తెచ్చి, మా ముందు నిలుపవలె!"

దుర్యోధనుడు : "ఇది మాకు అసాధ్యం కాదు".

యుధిష్ఠిరుడు : "మీ ఆజ్ఞ శిరోధార్యం. అలాగే చేస్తాము." :

మరునాటి ప్రభాతవేళ కౌరవ పాండవులు ఉత్తమవ్యక్తిని గవేషించే నిమిత్తం బయలుదేరారు. సాయంకాలం కావస్తుంది. ఏ ఒకరి జాడలేదు. బలరాముడు ఆందోళన పడసాగాడు. 'ఒక మంచి వ్యక్తిని వెదకి తీసుకరావడానికి ఇంత సమయం పడుతుందా' అని లోలోన వాపోతున్నాడు. ఉండబట్టలేక కృష్ణుణ్ని అడిగాడు "సోదరా! మంచి వ్యక్తిని గవేషించడం ఇంత కష్టసాధ్యమా? దీనికి యుగాలు పడుతుందా?"

ఎప్పటిలా చిరునవ్వును చిందిస్తూ కృష్ణుడు అన్నాడు "అన్నగారూ! ఉత్తముడైన వ్యక్తిని ఉత్తముడు కాని వ్యక్తి నుండి విడదీసి చూడటం అవలీలగా అయ్యేపని కాదు. ఏమాత్రం జాగుసేయక, మనముందున్న వారిలో ఉత్తముడెవడో సూచించండి."

బలరాముడు ఖంగుతిన్నాడు. అయినా అంతర్ముఖుడై ఆలోచించసాగాడు. బీష్మద్రోణకృపాచార్యుల వైపు అనుజన్ముడైన కృష్ణుని వైపు సాశయంగా చూశాడు. కృష్ణుడే సర్వోత్తమునిగా బలరామునకు భాసించాడు. లోలోపల ఇలా తర్కించుకొన్నాడు 'కృష్ణుడు నిస్సందేహంగా ఉత్తముడే. నిత్యసంతోషి. పెదాల మీద స్మేరంతో జనాలను ఆకట్టుకుంటాడు అయితే ఇదంతా నటన కావచ్చు! కృష్ణుడు కొంటెవాడు కాదా? ఆయన

బాల్యేతిహాసం ఏమి చెప్పుతుంది? క్షీరదదినవనీతచోరుడుగా తల్లికి తలవంపులు తేలేదా?' బలరామునికి కృష్ణునిలో దోషాలే అగుపడసాగాయి. భీష్మద్రోణ కృపాచార్యుల ఇలా ఆలోచిస్తున్న వైపు దృష్టి మరలించాడు. 'వీళ్ళంతా ఉత్తములే. అయితే పదహారు వన్నెల పసిడి వంటి వాళ్ళు మాత్రం కాదు.

"ద్రోణుడు అర్జునపక్షపాతి. సమదృష్టి లేనివాడు. ఉత్తమవ్యక్తిగాను పరిగణనలోకి ఎలా వస్తాడు? కృపాచార్యులు వ్యక్తిత్వంలో ఒకటో రెండో నలుసులు లేనివాడుకాదు. మరి భీష్మపితామహుడు..! త్యాగనిరతిలో ఎవరూ అతనికి సరిరారు. అయినా అప్పుడప్పుడు అర్ధరహితమైన అభినివేశం అయనను తప్పుదారి పట్టిస్తుంది.'

ఆలోచనలు దుర్యోధనుని వేపు మళ్ళాయి. దుర్యోధనుడే ఉత్తమవ్యక్తి అనే నిర్ణయానికి వచ్చాడు. అదే క్షణం సాత్యకి చెప్పన మాటలు గుర్తుకు వచ్చినవి. 'వీని అహంకారానికి సీమలు లేవు. నీ ముందు వినయాన్ని కనబరిచినంత మాత్రాన తప్పుడు అంచనా వేయకు. 'అవివేకివని' 'గొల్లవాడవని' నీ చాటున ఎన్నోమార్లు అన్నాడు. సాత్యకి వచనాలను నమ్మకూడదు. మదిరాపానవ్యసని. వాడి మాటలు నమ్మకూడదు. దుర్యోధనుడు ఉత్తమగుణోపేతుడు.' బలరాముని ఆలోచనాపరంపర అవ్యాహతంగా సాగిపోతున్నది. కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ ఆచార్యులతో ఏదో మాటాడుతున్నాడు.

సూర్యుడస్త్రాద్రిని చేరబోయే సమయం సమీపించింది. దుర్యోధనుడు యుధిష్ఠిరుడు వెళ్ళినపని కాకుండానే తిరిగివచ్చారు. భీష్ముడు పరమాసక్తితో అడిగాడు "ఏమైంది? ఉత్తమవ్యక్తిని తోడుకొని వచ్చారా?"

మొదట దుర్యోధనుడు బదులు చెప్పాడు.

"పితామహా! కాలికి బలపం కట్టుకొని హస్తినాపురమంతా తిరిగాము. మంచివాడనే వ్యక్తి కనబడితే ఒట్టు! నాకన్న మిన్నయని ఎవడూ అనిపించలేదు. అలాంటప్పుడు కొని వచ్చే ప్రశ్న ఎలా ఉద్భవిస్తుంది?

సదాచారసంపన్నుడూ, వినయశీలీ అయిన అయిన యుధిష్ఠిరుడు అవనత శిరస్కుడై ఇలా అన్నాడు.

"తాతగారు! మంచితనం లేని వ్యక్తి హస్తినాపురిలో మచ్చుకైనా లేడు. కొద్దో గొప్పో మంచితనం ప్రతి పౌరునిలో కనిపించింది. సద్గుణాలలో నన్ను మించినవారేనని అనిపించారు. సమస్తపౌరజనాన్ని వెంటబెట్టుకొని రావడం ఎలా సాధ్యం? చర్మచక్షువులతో చూస్తే ఓటమిని చవిచూచినవానిగానే మీకు అగుపడుతాను. మనోనేత్రంతో పరికిస్తే వేలమందిని వెంటగొని వచ్చానన్న యథార్థం అవగతమౌతుంది."

కృష్ణుడన్నాడు: "తోడుకొని రాలేని కారణాన్ని స్పష్టపరిచావు. సరే! నీ దృష్టిలో ఉత్తముడెవరో చెప్పు!"

యుధిష్ఠిరుడు ఏమాత్రం తడుముకోకుండా జవాబు చెప్పాడు.

"మంచితనానికి సజీవదృష్టాంతం ఒకటేమిటి పదింటిని ఈయగలను. ఇదుగో భీష్మపితామహులు. ఇంతటి త్యాగి ముల్లోకాలలో కానరాడు. ఇదిగో ద్రోణాచార్యులు. ధనుర్విద్యలో వీరికెవరు సాటి? కృపాచార్యులు పేరుకు దగినట్లు కారుణ్యమూర్తి. బలరాములవారు వరదాయకులు. గదాయుద్ధంలో అతనిని మించిన వారున్నారా? ఇక మీరు : దైవాంశ సంభూతులు. మంచి వ్యక్తుల్ని ఇక్కడనే చూపగలిగేవాడిని. మీరు హస్తినాపురం మాటెత్తారు. మీ ఆజ్ఞమేరకు మంచి వ్యక్తికోసం ఆ నగరాన్ని గాలించాను."

యుధిష్ఠిరుని వాక్కులు దుర్యోధనునికి రుచించలేదు. ద్రోణుణ్ణి, కృపాచార్యులను, కృష్ణుణ్ణి ఉత్తమవ్యక్తిత్వానికి దృష్టాంతాలుగా చూపడం ఏమాత్రం నచ్చలేదు. మాటలలోనే కాక ముఖకవళికల ద్వారా తన అసమ్మతిని తెలియపరిచాడు.

"పితామహా! నేను సైతం స్తుతిసుమాలను వర్షించి మీ అందరి మెప్పు వడయగలను" అంటూ తన నిరసనను తెలియజేస్తూ సమావేశస్థలి నుంచి నిష్క్రమించాడు.

యుధిష్ఠిరుడు స్థవిరులకు నమస్కరించి వారి నుండి సెలవు తీసికొన్నాడు.

బలరాముడు అన్నాడు : "ఇదేమిటి కృష్ణా! దుర్యోధనుడు ఎవరిని ఉత్తమ వ్యక్తిగా చూడలేదు. కనిపించిన ప్రతి వ్యక్తి యుధిష్ఠిరునకు ఉత్తమునిగా ప్రతిభాసించాడు". కృష్ణుడేమీ అనక భీష్ముని గ్రంథిని ఛేదించవలసినదిగా అభ్యర్థించాడు.

భీష్ముడు అన్నాడు : "కృష్ణా! నీకు సర్వం విదితమే. నా అభిప్రాయం ఎందుకని కోరుతున్నావు. అయినా అడిగావు కనుక చెప్పుతున్నాను.'

భీష్ముడు బలరాముని వేపు దృష్టి నిలుపుతూ అన్నాడు. "మహామనా! 'మంచి' 'చెడు' అనేవి చూపరి మానసికతను బట్టి, వైఖరిని బట్టి ఉంటుంది. ఈ ప్రపంచం వెలుగు నీడల రంగవల్లి లాంటిది. సకారాత్మక దృష్టి కలవాడికి ఈ జగత్తు మాధుర్యోపేతంగా జభాసిస్తుంది. అట్టి వ్యక్తి మంచిని తనకు అనుకూలంగా మలచుకొని చెడును ఉపేక్షిస్తాడు"

"నకారాత్మక దృష్టిగల వ్యక్తికి ఈ సమస్త జగత్తు విషాక్తమైనదిగా తోచుతుంది. మంచి అనేది కనిపించదు. అట్టి వ్యక్తి చెడు వైపు ఇట్టే ఆకర్షింపబడుతాడు. చెడు వ్యక్తులతో చెలిమి చేస్తాడు.

సకారాత్మకవ్యక్తి మంచిని సొంతం చేసుకొంటాడు. అతని జీవిత మనేది మాధుర్యోపేత ప్రవాహసదృశం. నకారాత్మక వ్యక్తికి జీవతం విరతి లేని సంఘర్షణ. మంచిని చూడలేని, గౌరవించలేని హృదయ దౌర్బల్యం అతనిది. ఎన్ని మంచి అవకాశాలు అందివచ్చినా జీవితాన్ని 'స్పర్థ' గానే భావించే మాసికత అతనిది. సకారాత్మక ప్రవృత్తి కలవాడైన యుధిష్ఠిరుడు 'మంచి'నే చూశాడు. ఇందుకు విపరీతంగా, నకారాత్మక ప్రవృత్తిగల దుర్యోధనుడు 'చెడు'ను చూశాడు.

కృష్ణ, ద్రోణ, కృపాచార్యులు భీష్ముని విజ్ఞతకు అక్షరనీరాజనాలు అర్పించారు. బలరాముడు దీర్ఘాలోచనలో పడిపోయాడు.

ఒకరి నుండి మరొకరు సెలవు తీసికొన్నారు. బలరామకృష్ణులు అతిథి గృహంలోని తమతమ శయనకక్ష్యలకు చేరుకున్నారు. తల్పం మీద మేను వాల్చిన బలరామునికి ఎంత ప్రయత్నించినా నిదుర రాలేదు. 'యుధిష్ఠిరుని వైఖరి దుర్యోధనుని వైఖరి గురించి పెద్దలు సెలవిచ్చినదే చివరకు సరియైనదిగా నిరూపితమైనది. తాను వెలిబుచ్చిన అభిప్రాయానికి సమర్థన ఎవరి నుండీ లబించలేదు. ఇలా ఆలోచిస్తూ నిదురకు వెలియైన బలరాముడు ఎవరితోనైనా మాటాడితే బాగుండునని తలంచి సోదరుడైన కృష్ణుడు శయనిస్తున్న కక్ష్యవైపు అడుగులు వేశాడు. తట్టిన వెంటనే తలుపులు తెరుచుకొన్నాయి. కృష్ణుడు అన్నగారికి అభివాదం చేస్తూ ఇలా అన్నాడు. "అన్నా! ఈ నడిరేయి ఎక్కడికి వెళ్ళాలని అనుకొంటున్నారు."

ఈ మాటలు బలరాముని అయోమయంలో పడవేశాయి. తన్ను తాను తమాయించుకొని ఇలా అన్నాడు. రాలేదు.

"ద్వారక అభివృద్ధికి ఏ కార్యక్రమాలు చేపట్టాలో ఆలోచిస్తుంటే నిదుర అలా ఓ సారి భవనం చుట్టూ పచార్లు చేసివస్తాను. నీవు బాగా నిదురపోతున్నావు. భాగ్యవంతులనే నిద్రాదేవి వరిస్తుంది.

ఇలా అని విశ్రాంతిగృహాంగణాన్ని దాటి ముఖ్యమార్గం వైపు నడక సాగించాడు. వెనుదిరిగి చూశాడు. కృష్ణుని శయనకక్ష్యలో దివ్వెలు ఆర్పివేయబడటాన్ని గమనించాడు. బలరాముడు దీర్ఘాలోచన చేస్తూ విదురగేహాన్ని చేరుకొన్నాడు. విదురుడు ధర్మవిదుడు. పేరొందిన న్యాయవేత్త. ఆయన ముఖ్య ద్వారం తెరచి ఉండడం బలరామునికి విస్మయాన్ని కలిగించింది. భవనంలోని దివ్వెలు వెలుగులను చిమ్ముతున్నవి. విదురుడు బలరాముని ముఖ్యద్వారం ముందు నిలబడి ఉండటాన్ని గమనించాడు. ఏమాత్రం జాప్యం చేయకుండా

**మధు వాతా ఋతాయతే మధుక్షరిని సింధవః।*
*మాధ్వీర్నః సన్త్వోషధీః*
*మధునక్తముతోషసో మధుమత్పార్థివం రజః* ఋగ్వేదం 1-14-91

బలరాముని లోనికి ఆహ్వానించాడు. "ఊరక రారు మహానుభావులు! తమరి రాకతో నా గేహం పావనమైంది. అనపేక్షితమేళనాలే ఆనందప్రదాలు" అన్నాడు విదురుడు.

విదురుడు బలరాముని లోనికి కొనిపోయాడు. సుఖాసీనుణ్ణి చేసి, తక్రపూరిత పాత్రను విదురుడు బలరాముని చేతికి అందించాడు. మజ్జిగ అంటే బలరామునికి పరమప్రీతి. బలరాముడు పానం చేస్తున్నంతసేపు విదురుడు మౌనంగా ఉన్నాడు. తక్రపానం ముగియగానే బలరాముడు ఇలా అన్నాడు. "శ్రీమాన్! కొన్ని విషయాలు నన్ను అయోమయంలో పడేసినవి. మీతో చర్చించిన పక్షంలో నా ఆలోచనలకు స్పష్టత ఏర్పడుతుంది." సాయంత్రం వరకు సాగిన సమావేశాన్ని గురించి, యుధిష్ఠిరుని వైఖరిని గురించి, పెద్దలు సెలవిచ్చినదాన్ని పూసగుచ్చినట్లు వివరించాడు. ప్రతిస్పర్థులైన యుధిష్ఠిర దుర్యోధనుల వ్యక్తిత్వాన్ని మూల్యాంకనం చేయడంలో తాను విఫలుడైన విషయాన్ని తెలుపుకొన్నాడు.

విదురుడన్నాడు "భవత్పాదస్పర్శతో నా గేహాన్ని పావనం చేసినందుకు ఈవేళ ఆనందంగా వుంది. నా యెడ గల అభిమానంతో, నా అభిప్రాయాన్ని కోరారు. ధిషణావైభవోపేతులైన స్థవిరులు వెలిబుచ్చిన అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేసే అర్హత నాకున్నదనుకోను. ఆచార్యద్వయమెక్కడ? నేనెక్కడ? భీష్మపితామహుడు మేరునగప్రఖ్యుడు. అట్టివాని ముందు నేను అణుమాత్రుణ్ణి. లోకవంద్యుడైన కృష్ణుని అభిప్రాయాన్ని కాదనడం అవివేకమే అవుతుంది. ఆయనను అనుజునిగా పొందిన మీ భాగ్యాన్ని ఏమని వర్ణించాలి?"

"భీష్మపితాహముడు యుధిష్ఠిరుని వైఖరిని గురించి చెప్పినది ఏకోణం నుంచి పరిశీలించినా యుక్తిసంగతమే."

"ఇక్కడ ఇంకో విషయం వివరించాల్సిన అవసరం ఉంది. అసలు వాస్తవికత అనేది ఏమిటి? దానికి సత్యంతో గల సంబంధ మేమిటి? వాస్తవికత ఇంద్రియ మనోబుద్ధి గ్రాహ్యం. దేనిని వీక్షిస్తామో దానిని భౌతికస్తరంలో 'ప్రతిభాసం'గా, దేనికి హార్దికంగా స్పందిస్తామో, దానిని భావనికస్తరంలో అనుభూతిగా, దేనిని ఆలోచనకు కేంద్రంగా చేసికొంటామో దానిని బౌద్ధికస్తరంలో 'సంకల్పనగా చెప్పుకోవాలి. ఈ మూడు స్తరాలు కాక మరొక సరం ఉంది. అది సత్యస్తరం. సమ్యగ్ వాస్తవికతా దర్శనం సత్యస్తరంలో అవలోకించినప్పుడే సాధ్యమౌతుంది."

"నీ అవలోకనం శుద్ధమైనదిగా ఉండాలి. భావనిక వైచారికస్తరంలోనే కాక చైతన్య, ఆధ్యాత్మికస్తరంలో కూడా."

"ఉత్తరదాయిత్వ భావన వ్యక్తికి చైతన్యం చేకూర్చుతుంది. వైచారికస్తరంలో సమదృష్టి, మానసికస్తరంలో సైమిత్యం, బౌద్ధికస్తరంలో సంయమనం వల్లనే 'అవలోకనం' నిర్మల మవుతుంది. కృష్ణుడూ, భీష్మపితామహులు శుద్ధావలోకన సామర్థ్యం కలిగినవారు."

"మహానుభావా! ఉత్తరదాయిత్వభావనతో వ్యవహరించు. సకారాత్మక దృష్టి కల వాడివి కావలె. సమన్వయవాదివి కావలె. అంత నీ మనోనుకూలంగా జరుగుతుంది." అన్నాడు విదురుడు.

బలరాము డన్నాడు. "ప్రాజ్ఞలోకశిరోమణి! కృష్ణుడు అడిగిన మీద ఉత్తముడనదగిన ఒక వ్యక్తినైనా పేర్కొనలేకపోయాను."

విదురుడు పరమ స్నేహంచితుడై స్మేరదీప్తవదనంతో బలరామునికి సాంత్వన కలిగేవిధంగా ఇలా అన్నాడు.

"ఉత్తమ వ్యక్తిని కనుగొనుటలో నీవు విఫలుడవు కాలేదు. నాకోసం మా ఇంటికి రావటం దేన్ని సూచిస్తుంది?"

"ఎంత అవివేకిని మహాత్మా! అర్ధపేటి కట్టెదుట ఉన్నా, గేహం నలుమూలలు వెదుకుతున్నాను. మీ వంటి ఉత్తముడు ముల్లోకాలు గాలించినా దొరుకడు." విదురునకు నమస్కరించి, సెలవీయ వేడుకొన్నాడు. విదురుడు బలరాముని సాగనంపే నిమిత్తం ముఖ్యద్వారం వైపు తోడుకొని వెడుతున్నవేళ, బలరాముడు ఇలా అన్నాడు.

"శ్రీమాన్! మీ వద్దకు నా రాకను గురించి నేను పూర్వ సూచన చేయలేదు. మీ ఇంటిలో దీపాలు వెలుగుతునే ఉన్నవి మీరు నా కోసం ఎదిరిచూస్తున్నారు. ఇది ఎలా సంభవం!?"

విదురుడు నవ్వుతూ ఇలా అన్నాడు.

"భగవంతునికి సైతం 'సమయసారిణి పట్టిక' ఉంది సుమా!"

ద్వారాలు తెరుచుకొన్నవి. ముఖ్యద్వారం ఎదుట రథం నిలిచి వుంది. సారథిగా వచ్చిన కృష్ణుడు బలరామ విదురులకు నమస్కరించాడు. బలరాముడు మరోసారి అయోమయంలో పడ్డాడు. కృష్ణుని వైపు దీనంగా చూశాడు.

"అన్నగారు! మీకోసమే రథాన్ని తెచ్చాను. విదురుని సంప్రదించాలని రాత్రే మీరు నిర్ణయించుకొన్న సంగతి నాకు తెలుసు. విదురుని గృహం గురుగ్రామానికి సమీపంలో

[1] Appearance [2] Experience [3] Concept

లేదు. మన పిన్ననాట నేను రథం తోలేవాణ్ణి. అలాంటి అవకాశం మళ్ళీ కలిగినందుకు అనందంగా ఉంది."

బలరాముని ఆనందానికి పట్టపగ్గాలు లేవు. కృష్ణుని దృష్టి నిర్మలమైంది. విదురుని వేపు చూస్తూ ఇలా అన్నాడు.

"విదురా! నా రాకను కృష్ణుడు అస్త్రాత్పూర్వమే తెలిపినాడు కదూ!" "అవును" అన్నాడు బలరాముడు.

బలరాముడు తమ్ముని కౌగిలించుకొన్నాడు. ఇరువురు కలిగిన దివ్యానుభూతిలో ద్వైతాన్ని అధిగమించారు.

"ఉత్తరదాయిత్వ భావన పూర్ణాలోకనాన్ని కలిగిస్తుంది."

# 14. లబ్ధి
## (ముప్పురు నేతలు వారి ఆచార్యులు)

శ్రీ వేదవ్యాస ప్రణీతమహాభారతతేతిహాసాంతర్గతభగవద్గీత ఒక అనర్ఘ రత్నం. ఆధ్యాత్మికంగా, బౌద్ధికంగా, నైతికంగా ఎదిగిన ఒక జాతి మానవాళి కందించిన ఉదాత్తదర్శనం.

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో ధార్తరాష్ట్ర పాండవేయులు తమ తమ సైన్యాలతో పోరుసలిపేందుకు సమవస్థితులై ఉన్నారు. కౌరవసతానికి అగ్రజన్ముడైన దుర్యోధనుడు పితృవ్యసంతానమైన పాండు కుమారులకు సామ్రాజ్యంలో అర్థభాగ మీయుటకు ససేమిరా అన్నాడు. ఈ అన్యాయనిర్ణయమే జనక్షయానికి సంపద్విధ్వంసానికి దారితీసే మహాసంగ్రామహేతు వైనది. పాండురాజు తన ఏలుబడిలో రాజ్యాన్ని విస్తరింపజేసి సామ్రాజ్యంగా రూపొందించిన విషయాన్ని దుర్యోధనుడు పూర్తిగా విస్మరించినాడు.

జగద్విఖ్యాతమైన పాండవుల రణపాండితి దుర్యోధనుని ఈర్ష్యాళువును కావించినది. అభద్రతాభావాన్ని కలిగించింది. విశేషంగా భీమార్జునుల ప్రతిఫలనాలు పేయజలంలో సైతం దుర్యోధనుడు చూడసాగాడు. సంశయమేఘాలు అతని మనోగగనాన్ని సంరుద్ధం చేసినవి.

సంఘర్షణ అనివార్యమై ఉభయుల సైన్యాలు రణాంగణానికి చేరుకొన్న వేళ, ధృతరాష్ట్ర మహారాజు క్షణం క్షణం అచట చోటుచేసుకొంటున్న పరిణామాల్ని తత్కాలమే తెలిసికొనదలచినవాడై, 'దివ్యదృష్టి'ని ప్రసాదించవలసినదిగా అపార కరుణాంతరంగుడైన వేదవ్యాసమహర్షిని అభ్యర్థించినాడు. ఆయన మహారాజునకు సమీపవర్తియైన సంజయునకు అట్టి అలౌకదృష్టిని ప్రసాదించినాడు.

మహారాజునకు సారధిగా వ్యవహరించే సంజయుడు బహుసూక్ష్మగ్రాహి. స్వామి యెడ అనూన భక్తి ప్రపత్తులు కలవాడు. విశ్వసనీయుడైన హితవరి. త్రిసంధ్యలు యజమాని సన్నిధిలో ఉంటూ ఆయన కష్టసుఖాలలో పాలుపంచుకొన్నవాడు. వ్యాసమహర్షి అంతటివాడు ఒసంగిన వరం వితథమౌతుందా? ఎక్కడో సంభవిస్తున్న ఘటనను కట్టెదుట సంభవిస్తున్న ఘటనగా పరికింపగల అలౌకిక శక్తిని సంజయుడు పొందినాడు.

ఏకాదశ అక్షౌహిణులు కలది దుర్యోధనుని సైన్యం. భీష్మపితామహునిచే అభిరక్షితమైనది కనుక 'అపర్యాప్తం' అంటే అజేయమైనదని దుర్యోధనుని ప్రగాఢ విశ్వాసం.

అతని దృష్టిలో ఏడు అక్షౌహిణులు మాత్రమే కల పాండవ సైన్యం పర్యాప్తమైనది అంటే జయించటానికి సలువైనది. ఇది అతనిని వీడని భ్రాంతి.

వాస్తవానికి కౌరవ సైన్యంతో పోల్చినప్పుడు పరిణామంలో చిన్నదైనా పోరాట పటిమగల సైనికులూ, సైనికాధికారులూ కలది పాండవసైన్యం.

ఇతిహాసాన్ని సృష్టించగల మహాసంగ్రామానికి ఉద్యుక్తమైన ఈ రెండు సేనలు ఒకదానికొకటి అభిముఖంగా ఉన్నవి. కౌరవసైన్యం సేనాధ్యక్షుడైన భీష్మపితామహుని నుండి సంకేతానికై ప్రతీక్షిస్తున్నది. పాండవసేన పంచపాండవులకు బావమరిదీ, దళవాయీ అయిన ధృష్టద్యుమ్నుని నుండి నభంగమశంఖధ్వనులతో కాహళీ పటాహ కఠోరరావములతో రణాంగణం దద్దరిల్లిపోయింది. ఇరు సైన్యాల కోలాహలం చక్రవాతసంక్షుభితసాగరఘోషను తలపింపజేస్తున్నది.

సంజయుని నుండి రణభూమి సమాచారాన్ని తెలుసుకొంటున్న ధృతరాష్ట్రుడు భయకంపితుడైనాడు. 'కన్న కొడుకులను విజయశ్రీ వరిస్తుందో, లేదో? జయాపజయాల మాట అలా వుంచి, ప్రాణాలతోనైనా బయటపడతారో లేదో?' కన్నులున్న వారికంటే కన్నులు లేని వారి ఆందోళన అధికం కదా!

ఏ క్షేత్రంలోనైనా నాయకుడనబడేవాడు త్రిగుణాలలో ఒకదానిని ప్రస్ఫుటంగా కలిగియుంటాడు. ధృతరాష్ట్రుడూ, దుర్యోధనుడూ, అర్జునుడూ, క్రమశః ఏతద్గుణాలకు సజీవదృష్టాంతాలు.

ధృతరాష్ట్రుడు ప్రజాపరిపాలనా దక్షతకల అధినేతయే. అయితే ఆయన తమోగుణదూషితుడు. తమస్సనగా అజ్ఞానం. కర్తవ్యాకర్తవ్యాలను వింగడించలేని నైతిక అంధత్వం. తర్క విసంగతమైన అభినివేశం స్వభావగతమైనందున, తనుకూ స్వకీయులకూ విపత్తును ఏరికోరి తెచ్చుకొనే ప్రవృత్తి. తమోగుణాఢ్యుడైనందువల్లనే ధృతరాష్ట్ర మహారాజు ఉద్వేజితాంతరంగుడై "ఏమాయెను సంజయా!" అని మాటి మాటికి ప్రశ్నలతో సంజయుణ్ణి వేధిస్తున్నాడు.

కృష్ణద్వైపాయన వ్యాసమహర్షి నుండి అలౌకికదృష్టిని వరంగా పొందిన సంజయుడు యుద్ధక్షేత్రంలోని ఘటనలను మహారాజునకు సవిస్తరంగా నివేదిస్తున్నాడు. మొదట అర్జునకు కలిగిన విషాదాన్ని, విషాదం వల్ల యుద్ధం యెడల విముఖతని గూర్చి చెప్పాడు. ఆ తరువాత కృష్ణార్జునుల మధ్య సాగిన సంవాదాన్ని పూసగుచ్చిన రీతి మహారాజుకు వివరించాడు.

కృష్ణుడు అర్జునకొనరించిన ఉపదేశాన్ని ఆద్యంత్యం తాను విని, ఏలికకు యథాతథంగా వినిపించాడు. సంజయుడు చెప్పినదాన్ని మహారాజు శ్రద్ధగా విన్నాడు.

ధృతరాష్ట్రుని శిష్యునిగా, సంజయుని ఆచార్యునిగా చూచినప్పుడు స్పష్టమయ్యేది: ధృతరాష్ట్రుని వంటి జనుషాంధునికి, తమోగుణాన్వితునికి, అజ్ఞానికి క్రాంతదర్శియైన సంజయుని వంటి గురువు లభించాడు. అంఘ్రిపానుడూ, బాలిశుడూ అయిన శిష్యుడు సైతం ఉత్తమ గురువును ఆశ్రయించి అజ్ఞాన నివృత్తుడవడమే కాకుండా విపశ్చితుడౌతాడు. కృష్ణుడు అర్జునకు కావించిన మహోపదేశాన్ని ముజ్జగాలకు వంద్యుడైన సంజయుని ముఖతః విని తమోవలయాన్ని కొంతవరకు ఛేదించి వెలుపలికి రాగలిగాడు.

ధృతరాష్ట్రునకు కలిగిన హాని ఏమి? ఈ షణ్మాత్రమైనా కలుగలేదనే చెప్పుకొనాలి. దుర్మార్గులైన నూర్గుకొడుకులను కోలుపోయి ఆరని కడుపుమంటను పొందిన మాట నిజమే! అయినా భ్రాంతి నుండి, మౌఢ్యం నుండి, క్షుద్రమైన వ్యామోహం నుండి తన్నుతాను విముక్తుడ్ని కావించుకొన్నాడు. భ్రాతృవ్యులైన పాండవుల మన్నను తిరిగి పొందినాడు. యుధిష్ఠిరునిచే అభ్యర్థితుడై యుద్ధానంతరం పదునైదేండ్లు చక్రవర్తిగా కొనసాగాడు.

ఆచార్యుని కృపాకటాక్షం వల్ల అజ్ఞాని యైన శిష్యుడు సైతం తమస్సు నుండి మహస్సు వైపు ప్రస్థానిస్తాడు.

తమోగుణాఢ్యుడైన ధృతరాష్ట్రుని గురించి ముచ్చటించుకొన్నాక, అతని జ్యేష్ఠ కుమారరత్నమైన దుర్యోధనుని వైపు దృష్టి సారిద్దాం.

కౌరవసామ్రాజ్యానికి యౌవరాజ్యపట్టాభిషిక్తుడైన దుర్యోధనుడు రజోగుణాన్వితుడు... దురహంకారం గల నేత. ఈ కోవకు చెందిన మనుష్యుడు స్వార్థం తప్ప పరమార్థం కోస మేనాడూ పాటుపడడు. అతని ఇష్టానిష్టాలు రెండూ తీవ్రస్థాయికి చెందినవే. లక్ష్యసాధనలో మనుష్యుల్ని ఒప్పించి తన వేపుకు తిప్పుకొనే బదులు పురస్కారదండనలను సాధనాలుగా చేసుకొంటాడు.

యుద్ధారంభసూచనగా శంఖారావం కాగానే, దుర్యోధనుడు రాజసుడై నందువల్ల తీవ్రమైన భయాందోళనలకు గురియైనాడు. తనకూ, తన సోదరులకూ, తన బాంధవులకూ, తన రాజ్యానికి ఏమి వాటిల్లనుందో అన్న ఆందోళన వల్ల మనఃస్థైర్యాన్ని కోలుపోయాడు. పాండవసైన్యాన్ని, సేనాధిపతులను చూడగానే భయగ్రస్తుడై గురువైన ద్రోణాచార్యుల వద్దకు పరుగెత్తుకొని పోయాడు. తనకు కలిగిన భయసందేహాల్ని బయటపెట్టకుండా, తన సైన్యం 'అపర్యాప్త' మని పాండవులది 'పర్యాప్త'మని బీరాలు పలికాడు.

రాజసులు తరుచుగా పాలుపడేది ధర్మవిరుద్ధమూ అయోగ్యమూ అయిన కర్మాచరణకే. పరిస్థితికి అధీనులై, సద్యః ఫలితాన్ని పొందగోరి తమ విధానాన్ని ఏర్పరుచుకొంటారు. వారి ఉపగమనానికి (Approach) సైద్ధాంతిక నిబద్ధత అనేది ఉండదు. మూల్యాలనేవి (Values) వారి పరిగణనలోకి పెద్దగా రావు. దుర్యోధనుడు సేనాధ్యక్షుడైన భీష్మ పితామహుని వద్దకు, మంత్రణార్థం వెళ్ళకుండా ఉపసేనాధ్యక్షుడైన ద్రోణాచార్యుని వద్దకు ఎందుకు వెళ్ళాడు? ఇది ఏమాత్రం విప్పలేని చిక్కుముడి కాదు.

పాండవ సైన్యంలోని యోధానుయోద్ధలు ద్రోణాచార్యులు శిష్యకోటికి చెందినవారే. ఏ సేనానిలో ఏ బలహీనత ఉందో ఆచార్యులకు అవగతం కాని విషయం కాదు. అవేమిటో ఆయన నుండి తెలిసికొని వ్యూహానికి రూపకల్పన చేయాలన్న ఆలోచన దుర్యోధన యువరాజుది.

రణభూమిలో ఆచార్యుల ముందోల నిలుచున్నవేళ దుర్యోధనుడు అభివాదం చేయడంవంటి ఆద్యకర్తవ్యమైన మర్యాదను పాటించలేదు. రజోవృత్తి కలవాడైనందున కన్ను మిన్ను కానని వాడై సాటివారిని పలుకరించే సౌలభ్యంతో వందనీయుడైన ఆచార్యుని పలుకరించాడు.

స్వీయసైన్యాన్ని గురించి పరిపంథి సైన్యాన్ని గురించి సుదీర్ఘ వివరణ ఇచ్చాడు. అంతటితో ఆగాడా? గురువుల యెడ అవిధేయతలో పరాకాష్ఠ నందిన దుర్యోధనుడు 'మీరు మా స్థానాలలో ఉండి, సైన్యాధ్యక్షునికి రక్షణ కల్పించండి' అని సలహా ఇచ్చే ఉద్ధతిని ప్రదర్శించాడు. దీనిని మించిన దౌశ్చర్యం ఏముంటుంది? శిష్యుడైనవాడు గురువుకే పాఠాలు చెప్పడమా? ఆచార్యుల అభిప్రాయమేమిటో తెలిసికోవాలన్న అవసరాన్ని దుర్యోధనుడు పక్కకు పెట్టాడు. పైగా 'శత్రుసైన్యంలోని వీరాధివీరులు మీ ప్రియశిష్యులే' అని ఎత్తిపొడిచాడు. తన వర్తమానవిపత్తుకు ఆచార్యుడే కారణమన్న భావనను ఈ వాక్యంలో వ్యంజింపజేశాడు. గర్వాంధుడైన శిష్యుని అకాండతాండవానికి మేరునగధీరుడైన ద్రోణాచార్యులు ఏమాత్రం చలించకుండా మౌనం వహించారు. ఏ ఆచార్యుడైనా చేసేది అదే! దుర్యోధనునిలో ప్రకోపించిన వ్యాధికి భేషజం మౌనమే. రాజసుడైన దుర్యోధనుడు ఆచార్యుల కృపాపాత్రుడవడంలో విఫలమైనాడు. అకించనుడైనాడు.

ఇక అర్జుని గురించి మాటాడుకొందాము. పాండవమధ్యముడు పరమసాత్త్వికుడు. సర్వభూతహితరతుడు. గురువు యెడ అపారమైన భక్తి ప్రపత్తులు కలవాడు. సాత్త్వికనేతకు ఉండాల్సిన సకలసుగుణాలు ఆయనలో ఉన్నాయి. యుద్ధారంభసూచనగా శంఖారావం కాగానే సమరోత్సాహాన్ని ఏమాత్రం ప్రదర్శించలేదు. అంతర్ముఖుడైనాడు. ఇరుపక్షాల

సైన్యాలకు కలుగనున్న క్షతిని తలచుకొంటూ నిలువునా నీరయి పోయినాడు. పల్లీ పత్తనఘోషారామాలు లోనుగానున్న విధ్వంసాన్ని ఊహించుకుంటూ బహువ్యథితుడైనాడు. సమస్త జీవలోక కళ్యాణం యెడ ప్రతి వ్యక్తికి ఉత్తరదాయిత్వం ఉంది. దానికి విఘాతం కలిగించే ఏ కృతియైనా గర్హణీయమే. సైనికునిగా తానాచరించవలసిన కర్తవ్యం విషయంలో సందేహగ్రస్తుడై 'మార్గనిర్దేశం చేయండి' అంటూ ఆచార్యుని ముందు మోకరిల్లాడు. యుద్ధం అనేది అపారజనక్షయానికి, సంపద్విధ్వంసానికి దారితీసేదైనప్పుడు, తాను అట్టి క్రూరకర్మలో భాగస్వామిని కాజాలనని తేల్చి చెప్పాడు.

రక్తలాంఛితమైన రాజ్యాన్ని పొందేకన్న భిక్షుకవృత్తిని ఉపజీవికగా చేసుకొనడం మేలని ఆచార్యుడైన కృష్ణునకు విన్నవించుకొంటూనే తన వల్ల ఆచరింపబడవలసిన కర్తవ్యమేమిటో ఉపదేశించ పరిపరి వేడుకున్నాడు. 'నీ శిష్యుణ్ణి.... నీ శాసనానికి అధీనుణ్ని' అంటూ ముకుళితహస్తుడై ఆచార్యుని మ్రోల నిలుచున్నాడు. పరమసాత్వికుడూ, స్వార్థరహితుడూ వినయసంపన్నుడూ అయిన అంతేవాసి అర్జునుడు. అట్టివాని అభ్యర్థనను ఆకర్ణించని ఆచార్యుడు ఆచార్యశబ్దవాచ్యుడు కానేరడు. శిష్యుడు కర్తవ్యాచరణ విషయంలో దిక్కుతోచనివేళ కృష్ణుడెలా ప్రవర్తించాడో, ఆదర్శప్రాయులైన ఆచార్యులు అలాగే ప్రవర్తిస్తారు.

మొట్టమొదట కృష్ణుడు అర్జునుని విషాదవిముక్తుణ్ని చేశాడు. ఆత్మస్వరూప మేమిటో, అనాత్మ స్వరూప మేమిటో, ఏది నశ్వరమో ఏది అనంతమో స్పష్టపరిచాడు. దేహాత్మవాదాన్ని మృషావాదంగా నిరూపించాడు. బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించాడు. జీవితంలో సాధించాల్సిన గమ్యాలను సూచించాడు. 'ధనంజయుడవు కమ్మ'ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు.

త్రిగుణాలకు దృష్టాంతాలనదగిన ముప్వురు నేతలు ఎలా వ్యవహరించారో తమతమ ఆచార్యుల నుండి ఏమి పొందారో తెలుసుకొన్నాము.

ఏతద్విషయాన్ని సూత్రబద్ధం చేసిన పక్షంలో:

1. తామసుడైన నేత ఆచార్యుణ్ణి అభ్యర్థిస్తాడు.
2. రాజసుడైన నేత ఆచార్యుణ్ణి ధిక్కరిస్తాడు.
3. సాత్త్వికుడైన నేత ఆచార్యుణ్ణి శరణువేడుతాడు.

వీరితో ఆచార్యులైనవారు వ్యవహరించే తీరు ఎలాటిదో తెలుసుకొందాము.

1. తమోగుణాన్వితుడైన శిష్యునకు ఆచార్యుడు సమాచారాన్ని మాత్రమే అందజేస్తాడు.
2. రజోగుణాఢ్యుడైన శిష్యుని యెడ ఆచార్యుడు మౌనం వహిస్తాడు.
3. సాత్వికుడైన ఛాత్రునకే సమ్యగ్ జ్ఞానాన్ని ఆచార్యుడు ప్రసాదిస్తాడు.

గుణత్రితయానికి సజీవదృష్టాంతాలనదగిన నేతల వ్యవహారశైలికి, ఆచార్యులను గ్రహించిన రీతికి నిలువెత్తు దర్పణం శ్రీమద్భగవద్గీత.

ఈ ముప్వురు నేతల్ని వారి ఆచార్యుల్ని మించిన ఆచార్య శిష్యద్వయముంది. ఈ ద్వయంలో కృష్ణుని మించిన ఆచార్యుడు, అర్జునుని మించిన శిష్యుడున్నాడు. శిష్యుడు త్రిగుణాతీతుడు. గురువు పరబ్రహ్మస్వరూపుడెవరో వచోవైభవంతో నిరూపించి, సాక్షాత్కార సౌభాగ్యాన్ని శిష్యునకు కల్గించాడు. ఈ అలౌకిక ద్వయంలో యుధిష్ఠిరుడు ఛాత్రుడు. అతడు సాక్షాత్ మూర్తీభవించిన ధర్మమే. అతనిని మించిన దార్శనికుడు లేడు. మరి ఆచార్యుడో? భీష్మపితామహుడేనని నిస్సందేహంగా చెప్పవచ్చును. అంకితభావానికి, త్యాగానికి ఆయనే సజీవదృష్టాంతం.

కురుక్షేత్రయుద్ధానంతరం అంపశయ్య మీద శయనించి యున్న భీష్మపితామహుణ్ణి పాండవులు శ్రీ కృష్ణుని కూడినవారై సందర్శించుకొన్నారు. కృష్ణుని సూచన మేరకు పితామహుడు పాండవులకు వివిధ ధర్మాల గురించి బోధ చేశాడు. రాజధర్మాన్ని గూర్చి, వ్యక్తికి ఉండవలసిన శీలాన్ని గురించి, నేత కుండాల్సిన లక్షణాల గురించి ఉపన్యసించాడు. ఏకాగ్రచిత్తుడై ఇది విన్నాక యుధిష్ఠిరుడు కృష్ణుని ఇలా అడిగాడు. "మహానుభావా? ఈ చరాచరసృష్టికి మూలకారణంబైన పరమేష్ఠి ఎవరు? సర్వోత్తమధర్మ మేది? సర్వోత్కృష్టమైన పథమెయ్యది?

అందుకు కృష్ణుడు ఇలా అన్నాడు. "నీ ప్రశ్నలకు సమాధానం భీష్మ పితామహుడే ఈయ సమర్థుడు. ఈయనను మించిన ధర్మవేత్త లేడు. దార్శనికుడు లేడు."

శ్రీ కృష్ణ భగవానుని వచనములను విన్నాక, భీష్మాచార్యునకు 'ధన్యోస్మి' అనే భావన కలిగింది. గూఢాతిగూఢమైన ఈ ప్రశ్నలకు భీష్ముడు ఇలా సమాధానమిచ్చాడు. "విష్ణువే సర్వ సృష్టికి మూలం. చతుర్దశ భువనాలు ఆయనలోనే ప్రతిష్ఠితమై ఉన్నాయి. సకల జీవులకు ఆయనయే గమ్యము. ఆయనే మూర్తీభవించిన పరమధర్మం. ఈ దేవకీనందనుడైన కృష్ణుడే పరమేష్ఠి అయిన శ్రీ మహావిష్ణువు."

సాక్షాద్భగవద్దర్శనానుభూతి కలిగించే, ఆయన విభూతులను సర్వంకశంగా తెలిపే విష్ణుసహస్రనామాలను పాండవులకు వినిపించాడు.

క్రాంతదర్శియైన శిష్యుడు గురువు కృపాకటాక్షం వల్ల అంతిమసత్యాన్ని దర్శించగలుగుతాడు.

శిష్యునకు ఈశ్వరసందర్శనభాగ్యాన్ని కలిగించిన భీష్ముని మించిన ఆచార్యుడెవ్వడు? భీష్మపితామహుని ఆచార్యునిగా పొందిన యుధిష్ఠిరుని మించిన ఛాత్రుడెవ్వడు?

వినయాన్వితుడవై ఆచార్యుని ఆశ్రయించు. అతని ఆజ్ఞను మీరకు.
అతడే సమాచారానికి జ్ఞానానికి అంతిమ స్రోతస్సు.
ఈశ్వరదర్శనానుభూతి ఆచార్యుని వల్లనే సాధ్యం.

# 15. పథనిర్మాత : పథగామి

పథనిర్మాత యైన ఒకడు, పథగామి యైన ఇంకొకడు చేయిచేయీ కలిపితే ఏర్పడే సంయోగం అమేయఫలప్రదమై ఓజస్వంతమై ఓ గొప్ప సంచలన మవుతుంది. ఉపర్యయుక్తద్వయంలో ఒకడు మార్గదర్శి అయితే ఇంకొకడు నేత. ఒకడు దృష్టి, ఇంకొకడు లక్ష్యం. ఒకడు దిశ్మ ఇంకొకడు గతిశీలత. ఒకడు కాంతి్మ ఇంకొకడు

పరస్పరావగాహనతో, విశ్వాసంతో ప్రేమానుబంధంతో 'సమానాకూతి'తో కృష్ణప్రఖ్యుడైన పథనిర్మాత, అర్జునసముడైన పథగామి ఎచట ఉద్యమిస్తారో అచట మూడుపూలు ఆరుకాయలుగా సిరిసంపదలు వృద్ధి పొందుతాయి. యశస్సు దిగంతాలకు ప్రసరిస్తుంది. అవలంబితఋజు విధానాలు అనుకరణీయా లవుతవి.

పథనిర్మాత కృష్ణుని వంటివాడు పథగామి అర్జుని వంటి వాడు ఎందుకు కావాలో ఊహకందని విషయమేమీ కాదు. దళస్ఫూర్తితో కృష్ణార్జునులు అసామాన్య యోద్ధలైన భీష్మద్రోణులను ఎదుర్కొన్నారు. శల్యుడ్ని జయద్రథుడ్ని పోరులో మట్టికరిపించారు.

అర్జునాభిరక్షితుడైన కృష్ణునికి ఎవరు ఎలాటి హాని కలిగించలేదు. కృష్ణుని అండదండలున్న అర్జునిని ధాటికి ద్విషత్తువులు నిష్ప్రతిభులైనారు. కృష్ణుని వ్యూహాత్మక నివిష్టం (Strategic input) అర్జునకు రక్షణ కల్పించడమే కాకుండా అతనిని పరిపంథులకు అజేయునిగా నిలిపినది. కృష్ణుని అర్జునిని యెడగల స్నేహభావం ఇంతకే పరిమితంగాలేదు.

శోకసంవిగ్నమానసుడై వింటిని పారవైచి చతికిలబడ్డ పాండవ మధ్యముడైన అర్జునునకు కలిగిన సమస్తసందేహాలను తొలగించి కర్తవ్యాభిముఖుడయ్యే విధంగా సకలోపనిషత్సారమైన గీతను కృష్ణుడు ఉపదేశించాడు.

ఆత్మతత్త్వావబోధం కలిగించి, దేహమే ఆత్మయనే భ్రాంతి నుండి అవిద్య నుండి, విముక్తుణ్ణి చేశాడు. అర్జునుని వంటి యోగ్యుడైన అంతేవాసి ప్రాప్తించిన కారణంగానే కృష్ణుడు శుద్ధబుద్ధచైతన్యానుభూతిని పొంది జగద్గురువు స్థాయికి ఎదిగినాడు.

కృష్ణార్జునుల యశోగాథ అనిదంపూర్వం. వారి వియోగం విషాదాంతంగా ఎలా పరిణమించిందో చూద్దాము.

కురుక్షేత్ర సంగ్రామం ముగిసి, ముప్పది ఐదు ఏండ్లు గడచినవి. ద్వారకలో ఉన్న కృష్ణుడు తాను ఇహలోకయాత్ర చాలించే సమయం సమీపించిన విషయాన్ని దివ్యదృష్టితో

గ్రహించాడు. సమస్తయాదవక్షయాన్ని ముందుగానే ఊహించి, విచలితుడైనాడు. ఏకాంతవాసాసక్తుడై నదీతీరాలలో, ఉపవనాలలో, విపినాలలో జనావాసాలకు దూరంగా పొద్దుపుచ్చుతున్నాడు.

ఒకనాడు సాయంవేళ, శాఖోపశాఖలుగా విస్తరించిన న్యగ్రోధ వృక్షచ్ఛాయలో కృష్ణుడు శయనించి ఉన్నాడు. ఏతద్వనప్రాంతవాసుడైన ఒక నిషాదుడు మృగయార్థం అడవిని గాలిస్తున్నాడు.

కృష్ణుడు తన దక్షిణపాదాన్ని, ఉత్తితవామజానుఫలకంపై నిల్పి, ఖేలన స్ఫూర్తితో ఇటూ అటూ కదుపుతున్నాడు.

అతసీపల్లవకోమలాపఘనుడైన యదువంశమణి క్రీడావశతః కదుపుతున్న పాదాన్ని మృగశీర్షంగా కిరాతుడు భ్రాంతిపడినాడు. వెంటనే స్వీయతూణీరం నుండి విషాక్తనారాచాన్ని వెలికితీసి, వింటికి సంధించి విడిచినాడు. అది ఆయన బొటన వ్రేలికి తగిలింది. క్షణార్థంలో విగత ప్రాణుడైనాడు పార్థివాభిరక్షితుడై యున్నంతకాలం ఏ శస్త్రాస్త్రాలు ఆయనపై ప్రభావం చూపలేదు. ఏ యోద్ధ లీలామానుషవిగ్రహుడైన అతని గాత్రానికి ఈషణ్మాత్రక్షతిని కలిగించలేదు. అంతటి మహనీయుని అవతారసమాప్తికి సామాన్యుడైన బోయ కారణభూతుడైనాడు.

శ్రీకృష్ణుడు నిజపదానికి ప్రస్థానమైనాడు. మైరేయపానమత్తులై యాదవులు విధ్వంసకాండను సృష్టించినారు. ఒకరినొకరు తెగటార్చినారు. సకల యాదవ క్షయం తనకనుల ముందే సంభవించుట చూసి, బలరాముడు శరీరాన్ని త్యజించి అనంతునిలో లీనమయ్యాడు. సాత్యకి, కృతవర్మ, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, సాంబుడు, గదుడు, స్వసృష్టసంక్షోభంలో మడసినారు. దుర్భేద్యమైన ద్వారక శాత్రవ స్వైరవిహారవాటిక యైనది. శ్రీకృష్ణప్రేషితదారకుని నుండి ద్వారకలో ఏర్పడిన స్థితిని యుధిష్ఠిరుడు తెలుసుకొన్నాడు.

తత్క్షణమే పాండవవీరాగ్రణియైన అర్జునుని తనకడకు రావించుకొని, ద్వారకకు వెళ్ళి, వీలైనంత మంది అంతఃపురస్త్రీలకు రక్షణ కల్పించి వారి విలువైన వస్తువులతో సహా తోడెమ్మని ఆజ్ఞాపించినాడు.

యుధిష్ఠిరుని పనుపున అర్జునుడు గాండీవధారియై, రథాన్ని అధిరోహించాడు. చతురంగబలాలు తోడురాగా, వాయుమనోజవంతో ద్వారక చేరుకున్నాడు. నగరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకొని అంతఃపుర స్త్రీలను ఓదార్చాడు. వారి ఆభరణాల్ని ద్రవ్యాన్ని

పేటకలో నిక్షిప్తం చేయించి శకటాలకు ఎత్తింపజేసినాడు. ఉత్తమాశ్వములను పూన్చిన రథాలలో వారల ఆసీనలకావించినాడు.

సార్థవాహాన్ని తలపిస్తూ, నిర్వాసితరాజాంతపురస్త్రీజనుల రథాలు హస్తినాపురి వేపు రాజమార్గం గుండా కదులుతున్నవి. మార్గానికి ఇరుప్రక్కల దట్టమైన పొదలున్నవి.

ప్రయాణమైన రెండవ రోజు, పాటచ్చరసమూహం రాజమార్గగతరథాలను ముట్టడి చేసినవి. వారికి సర్దారైన వాడు గండ్రగొడ్డలిని చేబూని గాలిలో ఉపుతూ తన అనుచరులు కావిస్తున్న దోపిడిని నివారించే ప్రయత్నం చేయవలదని అర్జునుని తీవ్రంగా హెచ్చరించాడు.

దొంగలముఠా నాయకుని బెదిరింపులకు, హెచ్చరికలకు అర్జును క్రోధావిష్ణుడైనాడు. తానెవరో తెలిపిన మరుక్షణం, దిక్కుగానని వారై ముష్కరులు పిక్కబలం చూపుతారని ఆశించాడు. 'తొలగిపోకుంటే తలలు ఏరి భూమికి బలియిస్తానని' బెదిరించాడు. ఫలితం లేకపోయింది. పైగా సర్దారుడు అర్జునిని 'నీవెంత' అంటూ మీసం మెలివేస్తూ హేళన చేశాడు.

అర్జునుడు పెట్రేగిన ఆతతాయిలపై నిప్పులు చెరుగుతూ ఇలా అన్నాడు.

"అర్జునుడనైన నన్ను ఎరుగరుట్రా? ఎందరినో మట్టికరిపించాను. మీరేపాటి వారురా"?

గాండీవాన్ని ఎత్తి, ఆగ్నేయాస్త్రాన్ని సంధానించి వీరగర్జన చేశాడు. "మూర్ఖులారా! ఇది గాండీవం. ఇది ఆగ్నేయాస్త్రం... మీ మీద వదలిన మరుక్షణం బూడిద కుప్పలుగా మారిపోతారు."

సర్దారుడు అర్జునుడన్న మాటకు ఏమాత్రం విచలితుడు కాలేదు. పరశువుతో కుడిభుజంపై గట్టిగా కొట్టాడు. అర్జునుడు అట్టి ప్రహారాన్ని జన్మలో చవిచూడలేదు. గాండీవాన్ని ఎక్కుపెట్టాడే కాని బాణవిమోచననానికి పూర్వం ఉచ్చరించవలసిన మంత్రాన్ని మరచాడు.

పాటచ్చరులు కాలవిపర్యయమున నిర్భయులై అర్జునుని గట్టిగా పట్టుకొన్నారు. సర్దారుడు అర్జునుని పొట్టను పిడికిలితో బలంగా మోదాడు. అంతటితో ఊరుకొనక ఎగతాళికి దిగాడు. "నువ్వు అర్జునుడవు. నీ విల్లు గాండీవం." ఇలా అంటూ త్రాళ్ళతో బంధించవలసినదిగా అనుచరులను ఆజ్ఞాపించినాడు.

తాళ్ళతో కట్టబడి అర్జునుడు కదలలేని మెదలలేని స్థితిలో ఉన్నాడు. అతడు చూస్తుండగానే దస్యులు ఆభరణపేటికలతో పాటు ఒంటి మీది నగలను స్వాధీనం చేసుకొన్నారు. ఆడవారు 'హే కృష్ణా! కృష్ణా!' అంటూ పరివేదన కావించారు. ఇది విన్న ఆ దొంగలు సొమ్మును దోచుకొన్నారే కాని వారికెలాంటి హానిని కల్గించలేదు. గతంలో గ్రామీణులకు కృష్ణుడు అందించిన సహాయం గుర్తుకు రావటమే అందుకు కారణం.

వీరాధివీరునిగా కాక, సర్వస్వాన్ని కోలుపోయినవానివలె శోకవిహ్వలుడై హస్తినాపురికి అర్జునుడు తిరిగివచ్చాడు. కృష్ణుడు లేని అర్జునుడు ఛాయామాత్రుడైనాడు.

కృష్ణుడు వినా అర్జునుడు అర్జునుడు వినా కృష్ణుడు నిశీకులే! కలిసి యున్నంతకాలం విజయశ్రీ వారిని వరించింది.

యుధిష్ఠిరుడు మారిన పరిస్థితితో అర్జునునిలో కలిగిన మార్పును గమనించాడు. ప్రధానామాత్యుడైన యుయుత్సువుని తన సమక్షానికి పిలిపించుకొన్నాడు.

యుయుత్సువు ధృతరాష్ట్రుని నూటొక్కటవ సంతానం. అతడు భారతయుద్ధంలో పాండవుల పక్షమే వహించాడు. హితవరిగా విదురుని స్థానంలో నియుక్తుడయ్యాడు.

యుధిష్ఠిరుడు వచించినది ఆద్యంతం విని యుయుత్సువు ఇలా అన్నాడు.

"ఒక యుగం ముగిసింది. యుగంతో పాటు యుగధర్మమూ ముగిసింది. నవ్యయుగోదయం కానున్నది. అందుకు అవసరమైన మార్పును పాలనాశైలిలో, జీవనవిధానంలో చేయవలసి యున్నది. మనం యుగప్రవర్తకులం కావలసిన తరుణ మాసన్నమైనది. మార్పునకు లోబడిన వారిగా కాక, మార్పును తెచ్చినవారిగా చరిత్రకెక్కాలి.

యుధిష్ఠిరుడు పరీక్షితుని పట్టాభిషిక్తుని కావించి, భార్యాసోదరులతో సహా హిమాలయ ప్రాంతంలో ఆవాసమేర్పర్చుకొన్నాడు. రాజ్యాన్నీ, రాజునూ సంరక్షించే భారం యుయుత్సువుని మీద నిలిపి జీవనశేషచరణాన్ని అనిర్వేదంలో గడిపారు.

పథగామి లేని కథనిర్మాత అస్తిత్వం ప్రయోజనరహితం.
అలాగే పథనిర్మాత లేని పథగామి గమనం దిశాహీనం. అర్థరహితం.
నవ్యయుగోదయాన్ని స్వాగతించాలి.
యుగప్రవర్తకులం కావాల్సి యుగపరివర్తితులం కారాదు.

# 16. ప్రేమ ఒక మహస్సు

***(రూపకం)**

'ప్రేమ గల తావు ఆనందసీమ యగును'.. – ఉత్పల

తెలుగునాట నేడు 'మంథని'గా పిలువబడుతున్న మహాగ్రామం ఒకనాడు చతుర్వేదాలకు సకల శాస్త్రాలకు కాణాచి. లెక్కకు మించిన ఇచట పండిత వంశములు ఏతద్రామయశశ్చంద్రికలను ఆసేతుహిమాలయం ప్రసరింపజేసినవి. అట్టి పండితవంశాలలో తమ్మనభట్టు వంశ మొకటి. ఈ వంశంలోని వారు గ్రామానికి ధర్మాధికారులుగా వ్యవహరించారు. అమేయవైదుష్యంతో పేశ్వాల మెప్పువడసినారు. వారు నిర్మించిన తటాకం 'తమ్మిచెరువు'గా నేడు పిలువబడుచున్నది.

అట్టి అసమానమహోన్నత వంశచరిత్ర కలవాడు నేటి గణేశశర్మ. బహుభాషా కోవిదుడు. వేదాలను, కావ్యాలను క్షుణ్ణంగా చదివినవాడు.

'విద్యయొసగను వినయంబు' అన్నాడు కదా భర్తృహరి. అందుకు సజీవ దృష్టాంతం గణేశశర్మ. ఇటీవలె ప్రధానాచార్యునిగా సేవానివృత్తుడైనాడు. స్వధర్మాభిమాని. పరధర్మ సహిష్ణువు. శ్రీమద్ భగవద్గీతను పఠించిన ఆసక్తితోనే ఖురాను బైబిల్ను పఠించి సర్వమతావలంబులకు ఆత్మీయుడైనాడు.

గణేశశర్మ అనుంగు పత్ని సిద్ధేశ్వరీదేవి. పెద్దన చెప్పినట్లు ఆవిడ అన్నపూర్ణకు నుద్ది. ఈ దంపతుల సుపుత్రుడు జయదేవ్. రేల్వేలో అభియంతగా చంద్రపూర్లో పనిచేస్తున్నాడు. దీపావళీ పండుగ నిమిత్తం సతీమణి కుముదినీ సమేతుడై స్వగ్రామానికి వచ్చాడు. నందనవనచైత్రరథవిలసనాన్ని పరిహసించే హ్లాదకర వాతావరణం శర్మ ఇంట్లో నెలకొని వుంది.

గణేశశర్మ హితైషి నారాయణ కౌండిన్య గారు ఆంగ్లంలో రచించిన కథల్ని తెనిగించటంలో నిమగ్నుడై యున్నాడు.

కౌండిన్య గారు అసాధారణ ప్రతిభావ్యుత్పత్తులు గల వ్యక్తిగా పేరొందినారు. 'నేతృత్వం' 'ఆధ్యాత్మికత'పై అనేక గ్రంథాలు వ్రాసి దేశవిదేశాలలో వాసి గాంచినాడు. శ్రోతలను ఇట్టే ఆకట్టుకొని ఉర్రూతలూగించగలిగిన వక్తృత్వం ఆయనకు వాగ్దేవి ప్రసాదించిన వరం. 'యం కామయే తం ఉగ్రం కృణోమి' అన్నది కదా ఋగ్వేదంలోని ఆంభృణి. ఆమె అనుకంపవల్ల నారాయణ కౌండిన్య 'గురూజీ' అని పిలిపించుకొనేంత స్థాయికి

---

**Allegory*

ఎదిగాడు. ఆయనంటే గణేశశర్మకు వల్లమాలిన అభిమానం. ఎప్పుడు కలిసికొన్నా ఏదో గంటల తరబడి చర్చించుకొనేవారు.

ఒకనాటి ప్రత్యూషవేళ, గణేశశర్మ ఇంటి ముఖ్యద్వారం వద్ద నిలిచి ఎవరో ఏదో మాటాడుకుంటున్నారు. అవి కొమ్మలలో గాలుల రుసరుసలాగా మంద్రస్థాయిలోనివి కావు. గణేశశర్మ ఏకాగ్రతకు భంగం కల్గించేంత కోలాహల తీవ్రత కలవి. నారాయణ గారు ఆంగ్లంలో రచించిన ముప్పది ఒకటవ కథను ఆంధ్రీకరిస్తున్న శర్మ ఏమాత్రం విచలితుడు కాక 'ఎవరై వుంటారని' చూపులతో ఇల్లాలిని ప్రశ్నించాడు. భర్త కనుసన్నలలో నిరంతరం మెలిగే సాధ్వి శ్రీమతి సిద్ధేశ్వరీదేవి వ్యక్తులున్న చోటికి హుటాహుటిన వెళ్ళి వివరాలు అడిగి తెలిసికొని ప్రశ్రయం వ్యంజితమయ్యే స్వరంతో భర్తను పిలుచుకొంది. శర్మగారు ప్రాంగణంలోకి వెళ్ళిచూస్తే ఏముంది? అపరిచితులైన నలుగురు వ్యక్తులు అక్కడ నిలబడి ఉన్నారు.

బ్రహ్మవర్చస్సు ఉట్టిపడే ముఖాలు గల ఆ నలుగురిలో ఇద్దరు మహిళలు. మిగతా ఇద్దరు పురుషులు.

బార్హస్పతులైన వారిని సాక్షాత్తు దైవతాలుగా ఎంచే గణేశశర్మ ముకుళితహస్తుడై అతిథుల వేపు చూస్తూ ఇలా అన్నాడు. "నాచే ఆచరణీయమైన కర్తవ్య మేమిటో సెలవియ్యండి." ఆ నల్గురిలో వయోవృద్ధుడైన వ్యక్తి ఇలా స్పందించాడు. "నేడు మీ గృహాన్ని ఎన్నుకొన్నాము. మాలోని ఒకడు లేక ఒకరి మీ ఇంట అడుగుపెట్టే విషయమై చర్చించుకొంటున్నాము."

సిద్ధేశ్వరీదేవికి ఇది అయోమయంగా ఉంది. వచ్చిన నల్గురికి ఆతిథ్యం ఇద్దామనుకొన్న ఆమెను వీరి వ్యవహారం సంభ్రమంలో ముంచివేసింది. కొంత సైమిత్యాన్ని పొంది ఇలా అంది. "మా గేహాన్ని పావనం చేయనెంచి దయచేసిన మహనీయులెవరో తెలుసుకొన వచ్చునా?"

'త్రిదశులకు గురువేమో' అని ఎవరైనా భ్రమించే తేజః సంపన్నుడైన ఆ స్థవిరుడు పురాణమిథునంవోలె భాసిల్లే ఆ దంపతులకు స్వేతరత్రయాన్ని ఇలా పరిచయం చేసి చివరకు తన్నుతాను పరిచయం కావించుకొనినాడు. "స్మితపూర్వ భాషియైన ఈయన విజ్ఞానఖని. ఈయమ సకలసంపత్తులను సమకూర్చే ఆంభృణీ సమాన. మరో ఈయమ సర్వభూతహితరతయైన ప్రేమమయి. ఉత్తరదాయిత్వానికి ప్రతీకగా లోకం నన్ను చూస్తుంది. మా నల్గురిలో ఒకరిని మాత్రమే అతిథిగా గృహాభ్యంతరం లోనికి కొనిపోవచ్చు. ఉదయాత్పూర్వమే మరోమారు గేహాలను మేము సందర్శించవలసి ఉంది."

వ్యవహారకుశల యైన అర్ధాంగి వైపు గణేశశర్మ చూశాడు. ఆమె వారి నుండి కించిద్ వ్యవధిని పొందుటలో సఫలీకృతయై భర్యను విచారవినిమయ నిమిత్తం ఇంటిలోనికి తీసికొని వెళ్ళింది.

గణేశశర్మ పరివారసమావేశకక్ష్యలోనికి అందరిని రావించి విచారవినిమయ ప్రక్రియకు నాంది పలికినాడు. సిద్ధేశ్వరిదేవి స్వీయమనీషను ఇలా వెల్లడించింది. "అష్టైశ్వర్యకారయిత్రిని ఆహ్వానించడం మన కుటుంబానికి శ్రేయస్కరం. సర్వజ్ఞులైన మీకు విడమరచి చెప్పాలా? మీకు వచ్చే నివృత్తి వేతనం అతస్వల్పం. పరివార పరిస్థితిని పరికిస్తే పరమదయనీయంగా ఉంది. ఇక్ష్వాకులనాటి మన గేహం అవతారం చాలించే స్థితికి చేరుకుంది.

"మనను ఉద్ధరించేవి కావు. కొనవద్దని పలుమార్లు ప్రాధేయపడి వినిపించుకోరు. కంటబడ్డ పుస్తకాన్ని కొనేవరకు మీకు నిదురపట్టదు. కూతుళ్ళకు కోడలికి సొమ్ములు చేయించాల్సి ఉందని చేసిన విన్నపాలు బధిరశంఖారావాలే అయినవి."

గణేశశర్మ గారు గేహిని సుదీర్ఘ ప్రవచనానికి రవ్వంత యేని చలించనివాడై, ఆమెను అనునయించడం సద్యఃకర్తవ్యంగా గుర్తించి ఇలా అన్నాడు. "గాజుల గలగల వినపడని ఇల్లు ఇల్లు కాదన్న నీ వాదనతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తాను. 'గాజులు' అనే తెల్గు పదానికి సమానార్థకమైన 'సప్తకీ' అనే పదం సంస్కృతంలో ఉంది. సప్తభిః స్వరైః ఇవ కాయతి శబ్దాయతే. అయినా ఐశ్వర్యం క్షణభంగురం. జ్ఞానాన్ని మించినదేముంది?"

'నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే.' గీతాచార్యుని వచనాన్ని సంస్మరించుకుని జ్ఞానదేవతను ఏకకంఠంతో లోనికి ఆహ్వానిద్దాం."

మాతాపితల మధ్య ఇంతవరకు జరిగిన సంవాదం ఆసక్తితో వింటున్న జయదేవ్ స్వీయాభిప్రాయాన్ని వెల్లడించటానికి వివశుడై ఇలా అన్నాడు.

"అమ్మా! నాన్నగారు! నేను చెప్పేది వినండి. పవిత్రకర్మాచరణకు ప్రేరణ ఇచ్చేది ఏది? దేశాభ్యున్నతి ఎలా సాధ్యం? నా దృష్టిలో ఉత్తరదాయిత్వ భావనయే. దీనికి పుంభావస్వరూపుడైన స్థవిరుణ్ని లోనికి సాదరంగా ఆహ్వానిద్దాం...."

పితాపుత్రుల అభిప్రాయం అంతగా రుచించని సిద్ధేశ్వరిదేవి కోడలికేసి గంపెడాశతో చూసింది.

శ్రీవారికి ఎల్లవేళలు చేదోడువాదోడుగా ఉంటూ, అత్తమామలను ప్రత్యక్షదైవతాలుగా భావించే పుత్రవధువు కుముదిని పలుకు పలుకులో మధువు లొలికిస్తూ ఇలా అన్నది.

"అత్తయ్య గారూ! మామయ్య గారు! అయినా అభిప్రాయాన్ని వెల్లడించడానికి మీరు నాకవకాశమిచ్చారు. కృతజ్ఞురాల్ని. పిట్ట కొంచెమ్మ కూత ఘనం అని పిన్నల అభిప్రాయాన్ని నిరాదరించే ఇల్లు మనది కాదు. పైగా విలువ ఇచ్చే సంత్సంప్రదాయానికి కట్టుబడి ఉన్న కుటుంబం మనది. నేను చెప్పేది దయతో ఆలకించండి." జ్ఞానాన్ని, ధనాన్ని మీ అబ్బాయి చెప్పిన ఉత్తరదాయిత్వాన్ని మించింది ప్రేమ. ప్రేమే దైవమని పెద్దలు సెలవిచ్చారు."

"యావత్పరివారాన్ని, సమాజాన్ని చివరకు ప్రపంచాన్ని ఏకసూత్రాన బంధించేది ప్రేమ. 'మన ఇల్లే పూలవనం. మన సర్వం ప్రేమధనం' ఎంత గొప్పగా చెప్పారు మహాకవి కృష్ణశాస్త్రి! సామరస్యపూరిత సహజీవనానికి ప్రేమను మించిన ఉత్ప్రేరకం లేదు."

తుషార శీతలమైన స్నుషావాక్యాలకు జలదరించిన వారై, కుటుంబ సభ్యులు అనుమోదసూచకంగా శిరఃకంపనం కావించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా గేహాభ్యంతరాన్ని నిర్గమించి ముఖ్యద్వారం ముందు నిలుచున్న అతిథి దేవులను చేరుకొన్నారు.

"మిత్రులారా! ఇక ఈ చిత్రోడ జాతి కలంకార మైన సురేశ్వని గూర్చి మాటాడ నెంతును. ఇతడు అహర్నిశ లొనరించిన సేవను మీరు గమనించియే యున్నారు. శరీరభారాన్ని మించిన వాలుకాభారాన్ని సేతువుకు ప్రతిసారి చేరవేసాడు. శక్తికి మించిన పనిని చేసాడు. శిలాఖండాల్ని మీరు నలున కందించారు. కాదనను. ఇలా చేయడంలో మీరు మీ ప్రాకృతిక మర్యాదల్ని అతిక్రమించలేదు. విరామాల మధ్య మీరు పనిచేస్తే, ఈ జీవి నిర్విరామంగా పరిశ్రమించింది. మీలా వంతులవారి గా కాక రాత్రింబవళ్ళు ఉద్యమించింది. మీరు నిదురోతున్న వేళ ఈ చిరుప్రాణి మేల్కొనియే ఉంది. మీరు పని ఆరంభించిన నాటికి ఇతని పత్ని అంతర్వత్ని. మీరు పని ముగించిన నాటికి ఇరువురు పాపలకు తల్లి అయ్యింది. సేతునిర్మాణం పూర్తి అయ్యేవరకు సురేశ్ పరివారాన్ని విస్మరించాడు. కర్మ ముఖ్యమే. కర్మాచరణలో ప్రదర్శితమైన అంకితభావం అంతకన్నా ముఖ్యమైంది. ప్రాణి చిన్నదైనా మన్ననకు పాత్రమే. మనం అణువులో బ్రహ్మాండాన్ని దర్శించగలగాలి. ఆచరించే కర్మ, అల్పమైనా, అనల్పమైనా సమిష్టికి ఎనలేని సమర్పణయే."

"తెలతెలవారు వేల, అనుదినం నలుడు అందరికన్న ముందుగా రంగప్రవేశం చేసేవాడు. వెంటనే పని నారంభించేవాడు. దైవసమానునిగా ఎంచి

సురేశ్ నలునికి నిత్యం ప్రణమిల్లేవాడు. అతని దృష్టిలో నలుడు నిర్మిస్తున్న వారధి కేవలం సాగరతరణనిమిత్తం కాదు. అనృతం నుండి ఋతానికి, మృత్యువు నుండి అమరత్వానికి చీకటి నుండి వెలుగునకు చేర్చే సంధాయిక. హనుమానాంగద నలులతో పాటు సురేశ్ రామనామోచ్చరణ చేసేవాడు."

ఇది విన్న సురేశ్ నయనాలు అశ్రుపూరితము లైనవి. నాయకులు పులకితగాత్రులైనారు. సురేశ్ కభిముఖంగా నిలిచి జయజయ ధ్వానాలు కావించారు. అంగదుడు చిక్రీడ దంపతులకు ఆవాసమైన గుల్మము వద్దకు పరుగెత్తుకొని వెళ్ళి, తల్లినీ, పాపల్నీ తెచ్చి రాముని అరచేతిలో ఉంచాడు.

"భగవన్! ఈ చిన్నారులకు మీరే పేర్లు పెట్టాలి" అంది సుజాత.

"అలాగే! నా తమ్ముల పేర్లు పెడతాను. వీడు భరతుడు. మరి వీడు శత్రుఘ్నుడు. సరేనా!" సుజాత సంతోషంతో తల ఊపింది. వానరులు మరోమారు జయ జయ కారాలు చేసారు.

శతయోజనవ్యాప్తసాగరపుటవలి ఒడ్డున ఉన్న రావణపాలితలంకలో, ఎక్కడో ఓ మూల నున్న అశోకవనికలో రామవిరహంలో క్షణం యుగంగా జీవిస్తున్న వైదేహి అంతరంగం లిప్తపాటు ప్రకంపనాపన్నమైంది. శుభోదర్కమునకు సూచనగా ఆమె వామనేత్రమూ. భుజమూ స్ఫురించినవి.

అగస్త్య మహర్షి అనుకోకుండా ప్రత్యక్షమై ఇలా అన్నాడు. "ఆర్తత్రాణపరాయణా! రఘుకులనీలమణీ! నీవు లబ్ధమనోరథుడవైనావు. అచిరకాలంలో జయశ్రీ నిన్ను వరించనున్నది. నీకో రహస్యం ఎరంగించ గోరెదను. విను. ఈ నలుడు ఎవరో కాదు. సాక్షాద్ విశ్వకర్మయే. చిక్రోడాన్వయ భూషణుడైన సురేశుడు నలుని అనుజన్ముడైన దేవకర్మ. అన్నకు సహాయునిగా నిలిచే నిమిత్తం బ్రహ్మను యాచించి అతని వరప్రభావమున ఈ అవతార మెత్తినాడు.

అమరావతిలో దేవదుందుభులు మ్రోగినవి. త్రిదశులు పుష్ప వృష్టి కావించినారు.

కృతి కన్న మిన్న యైనది అంకిత భావం.
మన్ననకు పెద్దలతో పాటు పిన్నలు
నోచుకొనిన నాడు జాతి పురోగమనం.

# 17. సముద్రం

***(రెండు చేపల కథ)**

ఓ కన్నె చేప తల్లి చేపను ఇలా అడిగింది. "అవ్వా! సముద్రమనే దానిని గురించి ఎందరో ఏదో అనడం విన్నాను. ఇంతకూ ఈ సముద్రమనేది ఏమిటో, ఎక్కడ ఉందో ఎప్పటి నుంచి వుందో ఎలా ఉంటుందో చెప్పాలి. దాన్ని మనం ఎలా చూడగలుగుతాం?"

తల్లి చేప ఇలా బదులు చెప్పిది: "నీవూ నేనూ దేంట్లో ఉన్నామో, దానినే సముద్రమంటారు. నీవు పుట్టింది దీనిలోనే. దాని వలననే పెరిగి ఇంతదానివై బతుకుతున్నావు. దేహం చాలించాక కలిసిపోయేది దీని లోనే. మనకు ఏకైక జీవనాధారమే సముద్రం. నీ చుట్టు ఉన్నది సముద్రమే. నీ లోపల, నీకు వెలుపల ఉన్నది సముద్రమే. సముద్రాన్ని మించింది ఏదీ లేదు ఇది ఎప్పుడూ ఉంది. నీవు నేను పుట్టక పూర్వం ఉంది. చేపలొస్తాయి. వెళ్ళిపోతాయి. సముద్రం ఎక్కడికీ పోదు. ఇలానే ఉంటుంది. నిన్ను నన్ను బ్రతికించటం కోసమే ఇది వుంది."

క్షణం సేపు ఆగి మళ్ళీ అంది. "అమ్మడూ! కేవలం చర్మచక్షువులతో దీనిని చూడలేం. దీన్ని చూడటానికి అంతర్దృష్టి ఎంతైనా అవసరం".

తల్లి నోటి నుండి దొరలిన బరువైన పదాలు అర్థం కాకున్నా, పిల్ల దాని ఒళ్ళు ఒక్కసారి గగుర్పొడిచింది. జిజ్ఞాసువృత్తి గల పిల్ల కనుక అంతటితో తృప్తి పడక, తల్లిని మళ్ళీ అడిగింది: "కళ్ళతో ఎవరైనా దీన్ని చూశారా? చెప్పవే!"

"చూశారే పోరీ! నచికేత అనే మన జాతి అబ్బాయి కొన్నాళ్ళు మాతో పాటు వున్నాడు. ఒకనాడు లేచింది మొదలు పగలల్లా ఈది అంచును చేరుకున్నాడు. మనల్ని పట్టేవాళ్ళ వలలో పాపం చిక్కుకున్నాడు. మృత్యువులా కన్పట్టే ఓ ముసలాయన వాణ్ణి వల నుంచి తీసి ఒడ్డు మీద పడేశాడు. నీళ్ళలోంచి విడదీయ బడిన తరువాత ఒంటి మిలమిలతో విల విల కొట్టుకుంటుంటే చావు అంటే ఏమిటో కుర్రాడికి అర్థమైంది."

"అలా ఆ కుర్రాడు సముద్రం వైపు చూపును మరలించాడు. పెద్దగా, మేరలు లేనిదిగా, ఎటుపడితే అటు పరచుకొని ఉన్న దానిగా సముద్రం అగుపడింది. ఊదారంగులో అందంగా ఉంది. నీరూ నింగీ కలిసే చోట గొప్ప వెలుగును వాడు చూశాడు. దానిపై చూపు లినిపాడు. ఊపిరాడక నోరు తెరచి కళ్ళు తేలేశాడు. మొదట పట్టేసిన చేయే నచికేతను మళ్ళీ పట్టుకొంది. 'పనికి రాని వొర్రి పీనిగ' అని ఎవరో

గొణుగుతుంటే విన్నాడు. గొణుగుతున్న వాడు దాన్ని తిరిగి సముద్రంలోకి విసిరేవాడు. వెధవాయికి నీళ్ళు అందాయి. పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి!”

“ఆ తరువాత నేస్తాలతో ఈదుతూ సముద్రం గురించే చెప్పేవాడు. ‘సముద్ర మంటే మాటలా! అంత గొప్పది ఇంకోటి లేదు!!”

“అమ్మీ! పిల్లాడు తెలివి కలాడు. నాతో ఓసారి ఇలా అన్నాడు. పిన్నీ! సముద్రం లేకుండా చేప ఉండలేదు.’ వాడన్నది నిజం. చేపా సముద్రం రెండూ ఒకటే. నీలోకి నీవు తొంగి చూడు అది కనబడుతుంది. నీవే సముద్రానివ్మి సముద్రమన్నా నీవే. ఇప్పుడర్థమైందా పిచ్చి తల్లీ!”

“అప్పటి నుండి చేపలమైన మేము సముద్రంలో మమ్మల్ని, మాలో సముద్రాన్ని చూచుకొంటూ హాయిగా జీవిస్తున్నాం.”

నీళ్ళు మింగుతూ, వదులుతూ, తెగ మురిసిపోతూ చేప పడుచు సముద్రంతో అంది: “నీలో నన్ను చూశా నాలో నిన్ను చూశా!”

పిల్లదాని చూపు తల్లికి అర్థమైంది.

**నీలో ఉన్న సముద్రాన్ని చూడు. నీవే సముద్రానివి.**

# 18. ఆచార్యులు : అంతేవాసి చతుష్టయం

శంకరులు ప్రశ్నించారు: " 'ఇది' అనబడున దేమిటి? 'అది' అనబడున దేమిటి?"

ప్రాచ్యుడైన పద్మపాదుడు ఆచార్యుడు అడిగిన ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పాడు. "ఇది అనబడునది చైతన్యం. అది అనబడునది పరం. ఈ చైతన్యమే ఆ పరం. చైతన్యమే పరం."

శంకరులు ప్రశ్నించారు " 'ఇది' అనబడున దేమిటి? 'అది' అనబడున దేమిటి?"

ఉదీచ్యుడైన తోటకుడు తన అభిమతాన్ని ఇలా వెలువరించాడు. "ఇది అనబడేది జీవాత్మ అది అనబడేది పరమాత్మ. ఈ జీవాత్మయే ఆ పరమాత్మ."

శంకరులు ప్రశ్నించారు: "ఇది' అనబడున దేమిటి? అది అనబడున దేమిటి?"

దాక్షిణాత్యుడైన సురేశ్వరాచార్యుడు తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశాడు. " 'ఇది' అనబడేది 'అహం' అది అనబడేది 'బ్రహ్మము'. ఈ అహమే ఆ బ్రహ్మము. అహం బ్రహ్మాస్మి. నేనే బ్రహ్మను."

శంకరులు ప్రశ్నించారు: " 'ఇది' అనబడునది ఏమిటి? 'అది' అనబడునది ఏమిటి?"

పాశ్చాత్యుడైన హస్తామలకాచార్యులు ఇలా ప్రత్యుత్తర మిచ్చాడు.

"ఇది అనబడేది 'నీవు'. అది అనబడేది 'పరం'. తత్త్వమసి. అది నీవే అవుదువు."

అంతేవాసి చతుష్టయం ఆచార్యుని వేపు చూపు నిలిపింది. వారి జిజ్ఞాస దీప్తాననాలు ప్రశ్నచిహ్నాల వలె భాసిల్లినవి.

ఆచార్యులు నలుగురు శిష్యుల్ని మెచ్చుకుంటూ ఇలా ప్రవచనాన్ని ముగించారు.

"ఏది బ్రహ్మపదవాచ్యమో అది శుద్ధబుద్ధముక్త చైతన్యము. ఆ శుద్ధ బుద్ధ చైతన్యమే ఆత్మ. ఆ ఆత్మయే నేను. ఈ నే నే ఆ ఆత్మ.

'సర్వం ఖల్విదం బ్రహ్మ'
భిన్నత్వం ప్రతిభాసం, ఏకత్వం సత్యం.
వ్యష్టిలోనే సమిష్టి సమిష్టిలోనే వ్యష్టి
ఒక దానిలో మరో దానిని లయం చేస్తే శ్లేషించేది ఒకటే : అదే బ్రహ్మము.

# 19. లో వెలుగు

శ్రీ ఆదిశంకరులు అద్వితీయద్రష్టగా చరిత్ర కెక్కారు. సమస్తమానవాళి చే జగద్గురువు గా సంభావింపబడినారు. ఆచార్యునిగా అతనికి సాటిరాగల వారు అంగ గణనీయులే.

బౌద్ధం వివిధయానాలుగా చీలి, ఈశ్వరతత్త్వాన్ని నిరాకరించడంతో పాటు నైతిక మూల్యాలకు తిలోదకా లిచ్చి భారతీయ సమాజాన్ని అధఃపతితం చేసింది. వైదికమతం బౌద్ధాన్నే అనుకరించింది. సౌర, గాణాపత్య, శైవ, వైష్ణవ, శాక్త సంజ్ఞితములైన షణ్మతాలు, సాంఖ్యాది షడ్దర్శనాలు, బౌద్ధ జైన చార్వాకములుగా బహుళ ప్రాచుర్యాన్ని పొందిన నాస్తిక మతాలు యుగపత్ ఉద్భవించి సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక క్షేత్రాలలో విభిన్న స్వరాలను వినిపిస్తూ అల్లకల్లోలాన్ని అనిశ్చితిని, అయోమయాన్ని సృష్టించాయి.

అలాంటి దయనీయనేపథ్యంలో తన ధిషణాప్రాగల్భ్యంతో వేదాంతంలోని వివిధ ప్రతిపాదితాల్ని సమన్వయపరుస్తూ ప్రస్థానత్రయం మీద విస్తృత భాష్యాలు వెలువరించి మృతప్రాయమైన జాతి పునరుజ్జీవనానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించారు శంకర భగవత్పాదులు.

అద్వైతదర్శనాన్ని మానవాళికి అమూల్యమైన ఉపాయనంగా అవబోధం కావడానికి వలసిన దృష్టిని అనుగ్రహించారు.

ఆదిశంకరుల వారికి శిష్యులు నల్గురు. ప్రథమగణనీయుడు 'బ్రహ్మసిద్ధి' రచయిత సురేశ్వరాచార్యులు. పూర్వాశ్రమంలో ఈయన మండన మిశ్రునిగా సువిఖ్యాతుడు.

ఇక రెండవవాడు: శంకరుల 'శారీరక భాష్యం మీద పంచపాదికావృత్తిని వ్రాసిన పద్మపాదుడు. సమస్త వేదాంత సారాన్ని అరచేతిలోని ఉసిరికాయ వలె సులభ సాధ్యం కావించిన హస్తామలకుడు తృతీయుడు. తనకు దైవసమానుడైన ఆచార్యుణ్ణి ఘనంగా స్తుతిస్తూ 'తోటకాష్టకం ఆశువుగా చెప్పిన తోటకాచార్యులు నాల్గవ వాడు.

తోటకుడు అతి సామాన్యుడని చెప్పడానికి వలనుపడదు. గురువు యెడ అనూనభక్తిప్రతిపత్తులు కలిగిన శిష్యుడై నందున విశిష్టుడనే చెప్పుకోనాలి. ఆచార్యులకు అన్నపానీయాలు సరియైన సమయంలో అందేలా చూసేవాడు. ఆయనకు చెందిన సామగ్రిని అవసరమైన చోటికి చేరవేసేవాడు. ఆయన ధరించే కావి రంగు వస్త్రాల్ని శుభ్రంగా ఉదికి, ఆరవేసి ఆయనకు అందించే వాడు. అహర్నిశలు గురువు సాన్నిధ్యంలో ఉంటూ, ఆయన వరివస్యలో నిమగ్నుడై ఉండేవాడు.

---

[1] *ద్రష్టవ్యం : శంకరబోధామృతలహరి – గట్టు నారాయణ*

ఒకనాడు 'బృహదారణ్యకోపనిషత్తు'పై భగవత్పాదుల ప్రవచనాన్ని వినే నిమిత్తం మఠప్రాంగణంలో అధ్యేతలు సమావేశమైనారు.

శంకరులు వితర్దిపై ఆసీనులైనారు. ప్రవచనాన్ని వెంటనే ఆరంభించలేదు. కొన్ని క్షణాలు గడచినవి. అధ్యేతలలో జ్యేష్ఠులైన ఓ స్వాముల వారు సవినయంగా నివేదించు కొన్నారు. "భగవన్! మేము ప్రతీక్షిస్తున్నాము." అందుకు శంకరులు ఇలా అన్నారు. "తోటకాచార్యులు ఇంత వరకు రాలేదు. ఆయన వచ్చు వరకు వేచి యుందము."

ఆ సమయాన అక్కడ తోటకులు లేని కారణం అనూహ్యం కాదు. ఒజ్జ ఉడుపుల్ని ఉదికి ఆరవేసే నిమిత్తం నదికి వెళ్ళాడు.

ప్రవచనానికి అవుతున్న జాప్యానికి వెనుక వరుసలో కూర్చున్న ఒక అధ్యాత విసుగు చెందాడు. ఓ నవ్వు నవ్వి తనలో తాను గొణుగుకున్నాడు. 'గురువుల గంభీరప్రవచనం తోటకుని అవబోధపరిధి లోనిది కాదు. ఈ ప్రతీక్ష నిర్హేతుకం.'

పరమసూక్ష్మగ్రాహియైన శంకరులకు ఇది దృష్టికి రాకుండా పోలేదు. ఆయన కారుణ్యమూర్తులవడంతో పాటు అనుశాసనప్రియులు కూడా. శిష్యుని సౌమ్యనిరసనకు దీటైన స్పందనగా ఆయన గాఢమౌనం వహించి నిమీలిత నేత్రులైనారు. శిష్యునకైన అవమానాన్ని తనకైన అవమానంగా భావించారు. 'ఆనందస్వామి తోటకుని గురించి వచించినది సత్యదూరం కాదు. ఉపనిషత్సారాన్ని అవబోధం చేసుకోగల క్షమత ఆయనకు లేదు. అయితే ఛాత్రుని అపూర్ణతయే ఆచార్యుని అపూర్ణత.' ఇలా లోలోన వాపోయారు.

ఇలా ఆలోచిస్తూ, ఉత్తరదాయిత్వభావనాప్రేరితదేశికులైన శంకరులు ధ్యాన నిమగ్నులైనారు. బృహదారణ్య కోపనిషత్తులోని యావదాధ్యాయాలు ఒకటి తరువాత ఒకటి మనః పటలంపై కదలినవి. జ్యోతిర్-బ్రాహ్మణానికి గల సారం అంతర్ముఖులైన శంకరులకు సద్యోం సుభూతమైనది. అంతర్బాహ్యాజ్యోతులలో ద్వైతం లేదని నొక్కి చెప్పుతున్నది ఏతద్ బ్రాహ్మణం. ఆచార్యులు తన చింతనను కనుబొమల మధ్య నిల్పుకొన్నారు.

తోటకుడు నదికి వెళ్ళిన పనిని పూర్తి చేసుకొని, దౌతవస్త్రాలు మూపున వైచుకొని మఠ ప్రాంగణంలో ప్రవేశించి వాటిని ఒకచోట భద్రపరచాక, ఆచార్యుని కభిముఖంగా నిలచి నమస్కరించాడు.

ధ్యానమగ్నులై యున్న ఆచార్యులు తోటకుని ఆగమనాన్ని గుర్తించి, కనులు తెరిచారు. ఆ నేత్రాలు తోటకుని కాంచగానే జ్యోతిష్మంత మైనవి. తోటకుని చూపు ఆచార్యుని చూపుతో మేళవించినది. తోటకుడు దివ్యానుభూతిని పొందినాడు.

శంకరులు: "నాయనా! ఏ వెల్గు వల్ల నీవు ఈ సమస్త వస్తుజాలాన్ని వీక్షింప గలుగుతున్నావు?"

తోటకుడు: "పగటి వేళ సూర్యుడు, రాత్రి వేళ చంద్రుడూ, నక్షత్రాలూ, దీపాలూ ఇచ్చే వెలుగు వల్ల."

శంకరులు: "ఏ వెలుగు ఆదిత్యాదులను చూచే సామర్థ్యాన్ని ప్రసాదిస్తున్నది."

తోటకుడు: "నా కన్నులే వెలుగులు. వీటి వల్ల బయటి వెలుగుల్ని చూడ గలుగుతున్నాను."

శంకరులు: "నీవు కనులు మూసికొని యున్న వేళ, ఏ వెలుగు ప్రాపుతో ఈ స్థావరజంగమజగత్తును దర్శించ గలుగుతున్నావు."

తోటకుడు: "నా బుద్ధి యొసంగే వెలుగు వల్ల."

శంకరులు: "నీ బుద్ధిని ప్రకాశమానం చేసే వెలుగు?"

తోటకుడు: "ఆత్మజ్యోతి. భగవన్ నాలో వెలుగే!"

శంకరులు: "అగుచో నీవు పరంజ్యోతివి. పరంజ్యోతియే కదా సమస్త జ్యోతులకు మూల శ్రోతస్సు."

తోటకుడు: "నేను పరంజ్యోతిని. మీ అనుగ్రహం వల్ల స్వస్వరూపాన్ని దర్శించగలిగాను."

తోటకుడు ఆచార్యుని వలె జ్యోతిష్మంతుడైనాడు.

అధ్వైతలు తోటకుని అభినందించారు.

ఆచార్యుని యెడ గల భక్తిభావం వారిని ఒకే తాట గట్టింది. లేచి నిలబడి కైమోడిచినారు. ముక్త కంఠాలతో గురుదేవునకు అక్షర నీరాజనం సమర్పించినారు.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః । గురు దేవో మహేశ్వరః ।
గురు సాక్షాత్ పరబ్రహ్మ । తస్మై శ్రీ గురవే నమః ॥

**అరుంధతీదర్శనన్యాయంగా చెప్పాలంటే గురువు స్థూలం నుండి సూక్ష్మానికి బాహ్యజగత్తు నుండి అంతర్జ్యోతి వైపు తీసికొని వెడతారు. ఈ ప్రస్థానంలో గల మజిలీలు**

**వస్తువులు ⟶ వెలుగులు ⟶ పంచేంద్రియములు ⟶ మనస్సు ⟶ బుద్ధి ⟶ ఆత్మజ్యోతి.**

# ౨౦. స్మేరం

బుద్ధభగవానుని అధరసీమ దరహాసచంద్రికలు వెల్లి విరిసినవి.

ఆపై [1]మహాకస్సపుడు

ఆపై కొండన్న

ఆపై భద్దియ

ఆపై మహానాముడు

ఆపై వప్ప

ఆపై అస్సజి.

ఒకరి తరువాత ఒకరు మందహాసం కావించారు. సమ్యక్సంబుద్ధుడైన గౌతముని [2]ప్రవచనాన్ని ఆకర్ణించి చరితార్థులుగా నెంచి సమావేశితమైన ఐదు వందల భిక్షువుల వంక ఆనందుడు క్షణార్థం దృష్టి సారించాడు.

ఏతత్సమావేశంలో బింబిసారుడాదిగా గల రాజమాన్యులూ, అతి సామాన్యులూ ఉన్నారు.

దేవదారుమయవితర్ది పై భగవానులు ఆసీనులై యున్నారు. ఆయన వదనం నిస్తులతేజోనైశ్చల్యాలకు ఆకరమై భిక్షుసంఘానికి దివ్యానుభూతిని కలిగిస్తున్నది. శాస్త్రనూ, శాస్తకభిముఖంగా నేలపై కూర్చున్న శ్రావకులనూ చూచేందుకు అనువైన చోట ఆనందుడు నిల్చొని యున్నాడు.

బోధివృక్షం క్రింద 'అభిసంబోధి'ని పొందాక, నిర్వాణప్రదధర్మచక్ర పరివర్తనార్థం గౌతముడు పల్లీపత్తనాలయిన జనావాసాలకు 'చారికలను ఆరంభించినాడు. కొండన్న ప్రభృతి ఐదుగురు మునులు గౌతమునితో పాటు 'కఠోరతపశ్చర్య కావించిన పూర్వసహచరులే.

శరీరాన్ని అనశనాది క్లేశాలకు గురి చేయడం వల్ల ఏ ప్రయోజనం చేకూరదని గుర్తించి, చేస్తున్న ఉగ్రతపాన్ని గౌతముడు పరిత్యజించాడు. మితాహారాన్ని అనుమతించే [1]మధ్యమపథానుసారి అయినాడు. హఠ యోగ మార్గ గాములైన ఈ ఐదుగురికి గౌతముడు చేసినది నచ్చలేదు.

---

[1]'మహాకశ్యపుడు, కౌండిన్యుడు, భద్రియుడు, మహానాముడు విప్రుడు, అశ్వజిత్తు,

[2]'పాలీలో 'ధమ్మదేసనం' సం॥ దేశనం.

[3]పాదయాత్ర [4]వాయు భక్షణ పర్ణభక్షణ చేస్తూ.... పంచాగ్ని మధ్యంలో.... ఇత్యాది.

గౌతముని భ్రష్టయోగిగా, ఐహికసుఖాల వైపు పునరాకృష్టుడైన మందమతిగా నిర్ధారించి, నేరంజరానదితీరాన 'ఇక నీ దారి నీద్మి మా దారి మాది' అని నిష్ఠురాలు పలికి, అతడ్ని వదలి ముందుకు సాగిపోయారు.

ఆ నదికి సమీపాన ఉన్న అశ్వత్థం క్రింద ధ్యాన సమాధి స్థితుడైన గౌతమునికి పూర్ణిమ నాడు జ్ఞానోదయమైంది. తీరప్రాంతంలో ఏడు వారాలు గడిపి అంచె లంచెలుగా చారికను చేసి వారాణాసికి సమీపంలో ఉన్న 'ఋషి పట్టణ మృగదాయానికి చేరుకున్నాడు సమ్యక్ సంబద్ధుడై ఆనాటి నుండి చారికలు చేస్తూ నలభై అయిదు ఏండ్ల పాటు అన్ని వర్గాలకు చెందిన స్త్రీ పురుషులకు ధమ్మబోధ చేశాడు.

[3]బుద్ధుడు అతిశయితనూ [4]న్యూనతను పరిహరించే మధ్యమపథాన్ని ఎనుకొన్నాడు. [5]చతురార్యసత్యాలూ, అష్టాంగిక మార్గమూ ఆయనకు ధ్యానగమ్య మైనవి. ఈ ఆర్యసత్యాలు బౌద్ధానికి జీవనాడులు.

నాలుగు ఆర్య సత్యాలేమిటి. 1. దుఃఖం, 2. దుఃఖ సముదయం, 3. దుఃఖ నిరోధం, 4. దుఃఖ నిరోధగామినీ ప్రతిపదం.

1. అప్రియమైన వాటితో సంయోగం, ప్రియమైన వాటితో వియోగం వల్ల కలిగే దుఃఖం ప్రథమార్యసత్యంగా ప్రోక్తమైనది.
2. కామతృష్ణ, భవతృష్ణ, విభవ తృష్ణలు దుఃఖహేతువులు. వీటిని గూర్చి చెప్పేదే ద్వితీయ ఆర్యసత్యమైన దుఃఖసముదయం.
3. తృష్ణాపరిత్యాగం వల్లనే దుఃఖనిరోధం. దీన్ని గూర్చి చెప్పేదే మూడవ ఆర్యసత్య మైన దుఃఖ నిరోధం.
4. దుఃఖనిరోధగామినీ ప్రతిపదం నాల్గవ ఆర్యసత్యం. ప్రతిపద మంటే మార్గం. ఈ మార్గానికి శీలానికి చెందిన మూడు అంగాలు, సమాధికి చెందిన మూడు అంగాలు, ప్రజ్ఞకు చెందిన రెండు అంగాలు ఉన్నవి. అవి యేవి?

1. సమ్యగ్ దృష్టి, 2. సమ్యక్ సంకల్పం, 3. సమ్యగ్ వాక్కు, 4. సమ్యక్ కర్మాంతం, 5. సమ్యగ్ ఆజీవిక, 6. సమ్యగ్ వ్యాయామం, 7. సమ్యక్ స్మృతి, 8. సమ్యక్ సమాధి.

1. చతురార్యసత్యాల జ్ఞానాన్ని కలిగి యుండటమే సమ్యగ్ దృష్టి.
2. నైష్కర్మ్య, అద్రోహ, అవిహింసాసంకల్పసముచ్చయమే సమ్యక్సంకల్పం.

[1]మజ్జిమా పటిపద – పాలీలో [2]ఇసిపత్తనం వసారనాథ్ [3]కామేసుసుఖఖాను యోగో
[4]అత్తకిలమథాను యోగో [5]చత్తారో అరియ సచ్చాని.

3. మిథ్యాభాషణ, వాక్పారుష్య, పిశునస్వభావరాహిత్యమే సమ్యగ్వచనం.

4. అస్తేయం, జితేంద్రియత్వం సమ్యక్ కర్మాంతం.

5. అర్థార్జనంలో ఆర్జవమే సమ్యగాజీవిక.

6. మనోవికారాలకు అతీతంగా ఉండటమే సమ్యగ్ వ్యాయామం.

7. లోభదౌర్మనస్యాలకు అతీతుడై, కాయానుపశ్యియై, వేదనానుపశ్యియై, చిత్తానుపశ్యియై, ధర్మానుపశ్యియై విహరించువాడే సమ్యక్స్మృతి కలవాడు.

సమ్యక్సమాధి నాల్గు విధాలైన 'ధ్యానాల వల్ల సాధ్యమౌతుంది:

1. ప్రథమ ధ్యానం: కామ విదూరత

2. ద్వితీయ ధ్యానం: అవిచార స్థితి ప్రాప్తి.

3. తృతీయ ధ్యానం: కాయిక, మానసిక, సుఖాల యెడ విముఖత.

4. చతుర్థ ధ్యానం: ఉపేక్షాజనిత స్మృతి పరిశుద్ధత.

చతురార్యసత్య, అష్టాంగికమార్గాలతో పాటు భగవానుడు "విపశ్యన' అనే ధ్యాన మార్గాన్ని మానవాళికి ప్రసాదించాడు. దీని వల్ల దైహికసంవేదనలకూ, బుద్ధికల్పితచింతనాపరంపరకు 'వ్యక్తి, తటస్థుడౌతాడు. అన్నింటి స్వభావం లోకి చొచ్చుకొని పోయి వాటిని యథాతథంగా గ్రహించడమే విపశ్యన.

దీని వల్ల మనస్సు విముక్తమై నిర్వాణం సాధ్యమౌతుంది. నిస్సందేహంగా బౌద్ధ 'ధ్యానం'. ఇది బౌద్ధం చెప్పే మనః సంస్కరణ విధి.

'అభిసంబోధి'ని పొందిన సిద్ధార్థ గౌతముడు అతీతంలో తనతో కఠోర తప మాచరించిన పంచవర్గీయభిక్షువుల్ని మృగదాయంలో కలిసికొని తన యెడ వారికి గల అపోహలను దూరం చేసి చతురార్యసత్యాలను గురించి ప్రథమోపదేశం చేశాడు. ధర్మచక్రపరివర్తనకు అక్కడి నుండి శుభారంభం కావించాడు. గౌతముని పరినిర్వాణానంతరం ఈ బిక్షువులు గొప్ప ధర్మాచార్యులై బౌద్ధమతవ్యాప్తిలో ముఖ్యపాత్ర వహించారు.

మహాకశ్యపుడు సిద్ధార్థస్థాపితసంఘప్రవేశం చేసి స్వీయధిషణా పాటవం వల్ల అపరబుద్ధునిగా సువిఖ్యాతుడైనాడు.

---

[1]ఝాన పాళీలో [2]విపస్సన పాలీలో

ఇక ఆనందుడు... మహాకశ్యపుని వంటి సూక్ష్మగ్రాహి కాదు. సిద్ధార్థ గౌతమునికి పితృభ్రాతృజుడు. గౌతముడు సమ్యక్ సంబుద్ధుడైన తరువాత కొన్నాళ్ళకు స్వగ్రామమైన కపిలవస్తువును దర్శించి ధమ్మదేసనం చేశాడు. కుటుంబ సభ్యులూ, వారితో పాటు సమీప బంధువైన ఆనందుడు సంఘప్రవేశం చేశాడు. అతని అనుయాయులలో ఒకడైనాడు. శాస్త్ర 'చీవరాల్ని, భిక్షాపాత్రను శుద్ధి చేయడమే కాకుండా వాటిని మోసే భారాన్ని తనపైన వేసుకొన్నాడు. ఆయన అన్నపానాల విషయంలో జాగ్రత వహించే వాడు. భగవానుని నీడలా వెన్నాడేవాడు. ఆయన ప్రవచనాల్ని శ్రద్ధగా ఆలకించి ధారణలో నిల్పుకొనే వాడు. శాస్త్ర శ్రావకులకూ, పరివ్రాజకులకూ సామాన్యులకూ చేసిన ఉపదేశాల్ని చెవి యొగ్గి వినేవాడు.

భగవానుని నోటి నుండి వెలువడిన ప్రతి శబ్దాన్ని, వాక్యాన్ని స్మృతి బద్ధం చేసికొన్నాడు. బుద్ధుని పరినిర్వాణానంతరం ఆయన ప్రధాన శిష్యులందరూ రాజ గృహం లోని సప్తపర్ణి గుహలో జమ గూడి 'ధమ్మ' 'వినయా'ల సంగాయనం చేశారు. భిక్షు సంఘానికి ప్రధానస్థవిరుడైన మహాకాశ్యపుడు ధమ్మానికి సంబంధించిన విషయాల్లో ఉపాలిని ప్రశ్నిచాడు. ప్రథమ సంగీతిలో పాల్గొన్న స్థవిరులు 'ధమ్మ' 'వినయా'లను ఆనందుని సహాయంతో ఉపాలి సహాయంతో సూత్రబద్ధం చేశాడు.

భగవానుడు జీవించి యున్న కాలం నిరంతరం గురుసేవామగ్నుడైన ఆనందుడు అర్హంతుడు కాలేకపోయాడు. బుద్ధుని పరినివృత్తి తరువాతనే ఆనందునకు అర్హంతు డయ్యే భాగ్య మబ్బినది.

గౌతమునికి అభిముఖంగా ఐదువందల మంది 'భికులు ప్రవచనాన్ని వినే నిమిత్తం నేల మీద కూర్చుని ఉన్నారని కథారంభంలో చెప్పుకొన్నాము. వారిలో ప్రముఖస్థవిరుడైన 'మొగల్లన్న నిల్చొని శాస్తకు అభివాదం కావించి ఇలా ప్రార్థించాడు.

"భంతే! ఇవాళ మీరు సంఘానికి ఏమి 'దేశనం చేయనున్నారు."

బుద్ధుడు మొగల్లన్నను అనుకంపతో క్షణం పాటు అవలోకించిన వాడై, శుభలక్షణలక్షితాలైన స్వీయదక్షిణకరాంగుళులతో ఓ సుందరపద్మాన్ని ఉద్గృహితం చేసి (సర్వులకు దృగ్గోచరమయ్యే విధంగా ) మౌన మూనినాడు.

భగవానుడు దివ్యస్మేరదీప్తాననుడైనాడు. మహాకశ్యపుడు, ఆ తరువాత పంచవర్గీయ

[1]వ్యక్తివపుద్గలుడు (సం) పుగ్గలుడు (పాలి)

| | | | |
|---|---|---|---|
| [2]చీవరాలు: | అంతరవాసకం | ఉత్తరాసంగంపంచె | సంఘాటి |
| | పంచె | ఉత్తరీయం | బొంత |

భిక్షువులు చిరునవ్వు సిరులను ఒకరి తరువాత ఒకరు వెలయించారు. ఇదంతా చూస్తూ అబ్బురపాటు నొందిన ఆనందుడు మహాకస్సపునికి అభిముఖుడై ఇలా అడిగాడు.

"భంతే! మీరు మందస్మితులైన హేతువును తెలుపుతారా? అలాగే భగవానుడు పద్మాన్ని ఉద్గ్రహితం చేయడాన్ని మీరెలా అన్వయించుకొన్నారు?

మహాకశ్యపుడు లేచి నిల్చొని, భగవానునకు ప్రణమిల్లి, పరిషత్తుకు అభివాదం చేసి ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు.

"*ఆవుసో! భగవానుని కమలోత్తోలనంలో సూక్ష్మస్థితి నుండి ఎదిగి దిగంతాలకు వ్యాపించిన మహచ్చైతన్యాన్ని దర్శించుకొన్నాను. ఈ పూర్ణోత్ఫుల్లిత పద్మం బీజోద్భవమే! ఏతద్బీజం అడుసు పొరల్లో పడి వుంది. ఓ బ్రాహ్మీ ముహూర్తాన అందులో నిద్రాణంగా ఉన్న జీవం వికాసేషణతో తుషావరణాన్ని ఛేదించుకొని అంకురంగా మార్పు నొంది కర్దమంలో వేళ్ళూని, కర్దమం నుంచే ఆహారాన్ని వేళ్ళ ద్వారా పీల్చుకొంటూ, నీటిని చీల్చుకొంటూ, ఎదిగి బహుళపత్రాయుతషండయై నీటి ఉపరితలాన విస్తరించి గాలిని పీల్చుకొనసాగింది. ఊర్ధ్వాభిముఖి యైంది. నిద్రాణంగా ఉన్న దీని సృజనాత్మకత పుష్పంగా విస్ఫోటనం చెందింది. ఈ పూవు నీలాల నింగికేగి చూసి, అబ్బురపడి తనలో తాను ఇలా అనుకొంది. 'ఎంత విశాలకాసారం! అందులో సహస్రదళసరోజం ఎంత వెలుగు విరజిమ్ముతున్నది!' కొలని తామర మొయిలు తామర అయ్యే ఆరాటంలో రేకులు విప్పుకొన్నది. దాన్ని అందుకునే ప్రయత్నంలో పై పైకి పోతున్నది."

మహాకశ్యపుడు అల్పవిరామం తీసుకొన్నాడు. భిక్షువులు సావధానులై వింటున్నారు. ఆనందుని ఉల్లాసానికి అవధులు లేవు.

మహాకశ్యపుడు చెప్పటానికి మళ్ళీ ఉపక్రమించాడు.

"గగనంలోని సూరీడు కాసారంలోని కమలాన్ని చూశాడు. అప్పుడప్పుడే విరబూస్తున్నది. చూసి మురిసిపడుతూ 'అచ్చం నా లాగే' అని లోలోన అనుకుంటున్నాడు."

"ప్రతి పూవు ముద్దులొలికే మువ్వెపుల బొమ్మ. పగటిదొర గారాబు పట్టి. అలాంటి వేళ పేర్మినీ వెలుగునీ ఈయకుండా ఎలా వుంటాడు? ఇవి అందుతున్న పూవు రోజురోజుకు ఎదుగ కుండా ఎలా వుంటుంది?"

"ఈ పగటి దొరను వెలిగించే దెవరు? తొలి వెలుగ నేది ఒకటి ఉండాలి! దాని నుండి పొందిన వెలుగునే సూరీడు పూవునకు అందిస్తున్నాడు. "

---

[1]భిక్షువులు [2]మౌద్గల్యయనుడు [3]ప్రవచనం

*పాలీలో తనతో సమానమైన వారిని ఇలా సంబోధిస్తారు.

"భణే! ఆనందా! సమ్యగ్సంబుద్ధుడైన శాద్ధోధని ఉద్గూర్ణం కావించిన ప్రసూనంలో ప్రాణాన్నే కాక ప్రకాశాన్ని, ప్రణయాన్ని, ప్రజ్ఞానాన్ని, దర్శించాను. సమావేశంలో ఉన్న వారి నేత్రాలు యుగపత్ కాంతివంత మైనవి.

"అంగమైన అంబుజంలో అంగియైన సృష్టిని.... ఇలా అణువులో బ్రహ్మాండాన్ని దర్శించాను. ప్రణయ, ప్రకాశ, ప్రయత్నాలు ఆదాన ప్రదానాల వివిధ రూపాలు. ఆదాన ప్రదానాలే ప్రపంచం. స్రష్టయే సృష్టి. సృష్టియే స్రష్ట. అరవిందంలో ఆదిత్యుడ్ని ఆదిత్యునిలోనే అరవిందం. ఇది అవబోధ మయ్యాక చిరునవ్వు నవ్వాను."

భగవానునికి సంఘానికి ప్రణమిల్లి సాధువాదాల మధ్య స్వస్థలంలో మహాకశ్యపుడు ఆసీనుడైనాడు.

సద్దుమణిగాక, ఆనందుడు కొండన్న వైపు చూస్తూ ఇలా అన్నాడు. "భంతే! మీరూ మందస్మితం చేశారు. మీకు కల్గిన అనుభూతి ఏమిటి?"

కొండన్న ఇలా స్పందించాడు.

"భగవానుడు ఎత్తి పట్టిన కమలాన్ని చూచినప్పుడు నాలో కదలిన ఆలోచనల్ని ఎలా వర్ణించేది ఆనందా! ముకుళిత మైన భగవానుని హస్తం దరవికసిత జలేజాన్ని తలపింప చేసింది. దివ్యప్రభావోపేతమైందీ, అభయప్రదమైందీ, ధర్మచక్ర పరివర్తనం కావించి జర్జరిత లోకాన్ని పునరుజ్జీవింప చేసిందీ ఆ హస్తం. భణే! ప్రసూనం కన్న పునీతమైంది యావత్ సృష్టిలో లేదు. అట్టి ప్రసూనమే భగవానుని హస్తం. అట్టి హస్తమే ఈ ప్రసూనం. కేలు కేలులో వుంది. పూవు పూవునే ఎత్తి పట్టింది. ఏకత్వదర్శనానుభూతి వల్లనే మందస్మితం చేశాను!"

కొండన్నను ప్రశ్నించిన విధంగానే ఆనందుడు భద్దియను ప్రశ్నించాడు. భద్దియ లేచి నిల్చొని శాస్త్రకూ సభకూ అభివాదం కావించి, కడు ఒద్దికతో ఇలా ప్రత్యుత్తర మొసగినాడు.

"తథాగతుడు పైకెత్తి పట్టిన మరుక్షణం ఈ కమలం అనిదంపూర్వ సౌందర్యసౌరభభరిత మైంది. భగవానుని శారీరికచైతన్యం ఆయన కరాంగుళుల ద్వారా ప్రవహించి, దీన్ని మహిమాన్వితం కావించింది. బుద్ధుని చైతన్యం ప్రసూన చైతన్యంగా పరివర్తన చెందడం చూసి నాలో నేను ధన్యత్వభావనలో నవ్వుకొన్నాను."

భద్దియ తథాగతునికి ప్రణమిల్లి, భిక్షువులకు నమస్కరించి సాధువాదాల మధ్య కూర్చున్నాడు.

అటు పిమ్మట ఆనందుడు వప్ప వైపు చూపు నిల్పుతూ ఇలా అన్నాడు. "భంతే! మరి మీరు?"

వప్ప లేచి నిల్చొని శాస్త్రకు, శ్రావకులకు వందన మాచరించి ఇలా ప్రత్యుత్తర మిచ్చాడు.

"ఆనందా! భగవానుడు పద్మాన్ని ఉద్గ్రహణం చేసిన వేళ నాలో కదలిన ఆలోచనలు ఇవి. ఎత్తిన కేలు నాకు కెందామరగా అగుపించడమే కాద్సుమ్మ ఆయన ఆననం సైతం నళినశోభల వెలయించింది. మహాకస్సపుని చూశాను. కొండన్న, భద్దియ, మహానామ అస్సజీలను చూశాను. అందరి ఆననాలు పద్మాలలాగే భాసిల్లినవి. నన్ను నేను పద్మంగానే చూసుకొన్నాను. వాస్తవానికి ఈ సంఘం ఒక సుమమాల. సుగతుడు నట్టనడిమి పూవు. ఈ మాలలో నేనూ ఒక పూవునే అన్న సత్యాన్ని గ్రహించి మందస్మితం చేశాను."

శాక్యమునికి, శ్రావకులకు ప్రణమిల్లి సాధువాదాల మధ్య వప్ప కూర్చున్నాడు. ఆనందుడు మహానాముని వైపు దృష్టి నిలిపి ఇలా అన్నాడు.

"ఇలాంటి అపూర్వ వేళ మీ మౌనం మాకు సమ్మతం కాదు. మీ అనుభూతి ఏమిటో, ఎందుకు ఆలస్యంగా మందస్మితం కావించారో తెలిపి మమ్మల్ని అనుగృహీతుల్ని చేయాలి."

మహానాముడు లేచి నిల్చొని, సభకు నమస్కరించి తన మనోభావాన్ని ఇలా వ్యక్తం చేశాడు.

"ఆనందా! పూవును ఎత్తి పట్టుకొన్న భగవానుడు మహచ్చైతన్య మన్న యాథాతథ్యం నాకు అవబోధ మైంది. సర్జితవిశ్వమే ఈ సరోజం. ఇది ఉద్గ్రహిత మైన తీరు స్రష్టకు సృష్టి యెడ గల అనుబంధాన్ని చెప్పక యే చెప్పుతున్నది. స్రష్టచైతన్యమే సృష్టిచైతన్యం. సుగతుని చైతన్యమే సుమం లోని చైతన్యం. భగవానునికి సరోరుహం యెడ గల వాత్సల్యం జమైత్రీభావం, ఆత్మీయత, కరుణ, సంరక్షణభావన చూసి మంత్ర ముగ్ధుడనై మందస్మితం కావించాను."

మహానాముడు ముక్తసంగుడైన శాక్యమునికి పరివ్రజితులకు ప్రణమిల్లి సాధువాదాల మధ్య స్వీయస్థలంలో ఆసీనుడైనాడు. అస్సజి వైపు చూస్తూ ఆనందుడిలా అన్నాడు.

"మీరేమి దర్శించారు అస్సజి? మీరు సద్యః స్మితం కావించక పోవడం మమ్మల్ని అబ్బుర పరిచింది."

అస్సజి లేచి నిల్చొని శాస్తకు శ్రావకులకు ప్రణమిల్లి ఇలా అన్నాడు. "పద్మోద్ధహణంలో

గర్భితమై యున్న అర్థాన్ని వెంటనే గ్రహించలేక పోయాను. ముకుళిత హస్తం నాకు ముచ్చట గొలిపింది."

"ఆ హస్తాని కున్న ఐదు వేళ్ళను చూస్తుంటే జన్మలో ఏనాడు కలుగని అనుభూతి నాకు కలిగి నన్ను చకితుణ్ని చేసింది. దాన్ని నిర్వచించుకొని, అవగాహనం చేసుకొనడానికి ఒకటి రెండు క్షణాలు పట్టినవి. అందుకే అలస్యంగా స్పందించాను."

"ఆనందా! మన చేతికి గల వేళ్ళు నిజానికి ఐదు కాదు. నాలుగే. ఒకటి అంగుష్ఠం. అన్ని సంస్కృతుల్లో బొటన వేలు నాలుగు వేళ్ళకు భిన్నంగా చూడబడుతుంది. ఇది నాలుగు వేళ్ళను జట్టుగా నిలిపే నేత. భిక్షుసంఘానికి భగవాను డెలాగో అలాగ. ఈ నాల్గు వేళ్ళు నిరంతర ధర్మాచరణకు కట్టుబడి వున్నాయి."

"భగవానుని ముకుళిత హస్తంలో 'త్రిరత్నాల్ని దర్శించుకొన్నాను. బొటన వేలిని గురించి నాలుగు వేళ్ళను గురించి నాలో కలిగిన ఆలోచనల్ని మీతో పంచుకొంటాను."

"నేతృత్వ మనేది శబ్దశః మీ చేతిలోనే ఉంది. ఆనందా! ఒకసారి అరచేయిపై నీ దృష్టి నిలుపు. నీవు చూస్తున్న దేమిటి? ఇంతకు ముందు చెప్పినట్లుగా నాల్గు వేళ్ళు. ఒక బొటన వేలు."

"బొటన వేలు వేలు కాదా? ఇలా ఎవరైనా ప్రశ్నించవచ్చు. నిక్కచ్చిగా 'అవును' అని కాని 'కాదు' అని కాని ప్రత్యుత్తర మీయలేము. "

"బొటన వేలు సైతం వేలే? - అయితే వేలును మించిన వేలుగా దాన్ని చూడాలి. నేత అనేవాడు దళ సభ్యుడే. అయితే అతణ్ని విశిష్టత గల సభ్యునిగా చూడాలి."

"నాలుగు వేళ్ళూ వెరసి బొటన వేలు ఒక దళం. నేతృత్వ స్వరూప లక్షణాల్ని ఈ దళం ఎలా విస్పష్టం చేస్తుందో, ఏ పాఠాలు చెబుతుందో చెప్పనా ఆనందా!?"

"అంగులీచతుష్టయం ఒకే దళానికి చెందినవైనా ఒకదాని దరికి మరొకటి సులువుగా చేరలేదు. పరస్పర సంపర్కం వాటి కెప్పుడు సమస్యాత్మకమే. అయితే బొటన వేలు నాలుగు వేళ్ళను అవలీలగా తాకుతుంది. బొటన వేలితో పాటు నాల్గు వేళ్ళు ఇట్టే జతపడుతాయి. అలాగే సమర్థుడైన నాయకుడు సభ్యులందరితో నితాంతసపర్కం కలిగి యుండి అవసరమైన వేళ ఒక చోటికి తెస్తాడు.

"బొటన వేలు మిగతా మూడు వేళ్ళకంటే (కనిష్ఠికను మినహాయించి) ఆ కృతిలో చిన్నదైనా కృతినిర్వహణలో గొప్పది. దార్ఢ్యత కలది. సమర్థుడైన నాయకుడు పరిమాణంలో

*పాలీలో 'మెత్త' *బుద్ధుడు, ధర్మం, సంఘం

చిన్నవాడైనా, ప్రతిభావ్యుత్పత్తులలో సభ్యులను మించిన వాడు. మనోబలం కలవాడు. నేతృత్వానికి వలసినది 'లావు' కాదు. లాఘవం. నాలుగు వేళ్ళలో ప్రతి వేలికి మూడు కణపులుంటాయి. బొటన వేలికి ఉన్న నమ్యత నాలుగిటికి లేదు... సమర్థుడైన నేత దళసభ్యుని నేర్పును కలిగినవాడు బుద్ధుడు, ధర్మం, సంఘం కాకపోవచ్చు. అయినా సభ్యుల నైపుణ్యాన్ని వినియోగించుకొనడంలో నమ్యత కలిగిన వాడయ్యే ఉంటాడు. నాలుగు వేళ్ళు జగత్తుకు ఎదురెదురుగా వుంటవి. వాటి మొగ్గ ఎప్పుడూ బయటి వైపే. బొటన వేలు మొగ్గ బయటి వైపు ఉంటుంది. లోపలి వైపూ ఉంటుంది. సమర్థుడైన నేతకు అంతర్ముఖత బహిర్ముఖత రెండూ ఉంటవి. అతని ధ్యాస పని వైపు ఉంటుంది. పనివారల పైపు ఉంటుంది. నేతకు పనివారల వైపు పట్టింపు ఉంటే, పనివారలకు పని వైపు పట్టింపు ఉంటుంది."

"బొటన వేలు వినా నాల్గు వేళ్ళు ఏ పని చేయజాలవు. అలాగే నాలుగు వేళ్ళు లేక బొటన వేలు ఏ పని చేయలేదు. అవి పరస్పర పూరకాలు. అలాగే నేత వినా దళ సభ్యులు లక్ష్యాన్ని సాధించలేరు. దళ సభ్యులు లేక నేత చేసేదేమీ ఉండదు."

"నాల్గు వేళ్ళకు బొటన వేలు పలు విధాల సహాయ పడుతుంది. గ్రహణ, కర్షణ, ఉత్తేలన, లేఖనాది కార్యాలలో అంగుళులకు బాసటగా నిలచేది అంగుష్ఠమే. అలాగే నేత శ్రామికులకు వస్తూత్పత్తి ప్రక్రియలో మార్గదర్శిగా, ఉత్ప్రేరకునిగా వ్యవహరిస్తాడు."

"ఈ నాలుగు వేళ్ళలో ఎప్పుడు ఏదో సమస్యను సృష్టించేది ఒకటి ఉంది. దీనిని 'తర్జని' అంటారు. స్వభావాన్ని బట్టి దీనికి ఈ పేరు వచ్చింది. ఇది తప్పులెన్నుతుంది. బెదరిస్తుంది. ప్రశ్నిస్తుంది. తర్జనభర్జన చేస్తూ ముప్పు తిప్పలు పెడుతుంది. ఈ జగడాలమారి బొటన వేలితో మేళవించిందా దీని నైజమే మారి పోతుంది. అభిశంసించే స్వభావాన్ని వీడి ప్రశంసించే స్వభావాన్ని అలవరుచుకొంటుంది. అలాగే ఓ దళంలో కొందరు ఇబ్బంది పెట్టే సభ్యులుంటారు. వీళ్ళు నిలదీస్తారు. అసమ్మతిని ప్రకటిస్తారు. తూలనాడుతారు. సమర్థుడైన నేత అలా మార్గచ్యుతులైన సభ్యుల్ని ఋజుమార్గగాముల్ని చేస్తాడు. కార్యనిరోధకులను కార్యసాధకుల కావిస్తాడు. నిందించే వారిని వందించే వారిగా చేస్తాడు. బొటన వేలూ నాల్గు వేళ్ళు నిటారుగా నిలిచి ఏ పని చేయలేవు. అవి 'నతి' నలవర్చుకుంటేనే ఉన్నతిని సాధిస్తాయి. నేతకైనా శ్రామికులకైనా నమ్రత అవసరం. సాధనం వల్లే పనులు సమకూరుతాయి. అహమ్మన్యతలు అనర్థ కారకాలు. పంతాలకు పోవటం వల్ల పనికి ముప్పు వాటిల్లుతుంది. నేతయైనా సభ్యులైనా వొంగడం అవసరం.

*యథా తానం వినా రాగో, యథామానం వినా నృపః*
*యథా దానం వినా హస్తీ తథా జ్ఞానం వినా యతిః - భామినీ విలాసం*

సకాలంలో వడి వంకలూ సరిదిద్దు కొనడమూ అవసరమే. నమ్యత వల్ల, నమ్రత వల్ల, ఒకరి నొకరు అర్థం చేసుకొనడానికి వీలవుతుంది. క్రింద నిలువ గలిగితేనే పై చూపు అలవడుతుంది. వంగితే ఆత్మ ఉప్పొంగుతుంది. స్వార్థాన్ని శాలీనం చేస్తే పరమార్థ మనే దానికి గల అర్థం అవబోధ మౌతుంది."

"బొటన వేలూ నాల్గు వేళ్ళూ ఒక్కటయితే పిడికిలి అవుతుంది. పిడికిలి దెబ్బకు ప్రిదల కుండా ఏదీ వుండదు. పిడికిలి వజ్ర సంకల్పానికి గుర్తు. వజ్ర సంకల్పానికి అసాధ్య మేమి ఉంటుంది? నాల్గు వేళ్ళు పొదిగొన్నాక నిటారుగా నిలిచే బొటన వేలు 'గెలుపు'కు చిన్నె యౌతుంది. సభ్యులు ఒక్కటై ఒళ్ళు వంటి పని చేస్తున్న వేళ, చిరునగవు చిందిస్తూ పురికొల్పే నేత విజయోదర్క ప్రతీక యౌతాడు."

"ఐదు వేళ్ళు (బొటన వేలితో సహా) ఒక్కటయ్యాక ఉత్తోలిత మైన హస్తం అభయ ముద్ర ఔతుంది. సభ్యులు (నేతతో సహా) యావత్తు సంఘటిత మయ్యాక, నిటారుగా నిలబడితే సమాజానికి సర్వతోభద్రమౌతుంది. బాధ్యాయుత నేతృత్వం, సక్షమ మైన దళం మీ చేతిలో ఉంది.

"ఆనందా! అరచేతి వేపు చూస్తూ నాలో నేను నవ్వుకొన్నాను. బుద్ధుడే బొటన వేలు. అర్హంతులు వేళ్ళు. అరచేయి భిక్షువుల సంఘం. మధ్యమా2 నామికా కనిష్ఠకలు ఏకమై సరళంగా నిలిచి సాక్షీభూతమవడం చూశాను. పుష్పోద్గ్రహణార్థం తర్జని అంగుష్ఠంతో మేళవించటం చూశాను. ఆ మేళనలో శాస్త్ర శ్రావకులు అద్వైత స్థితిని పొందటాన్ని చూశాను. ఆ అద్వైత స్థితియే నిర్వాణస్థితి. మేళననిర్వాణాలకు నేపథ్యం భగవానుని చేత గల పద్మమే!"

పూర్వ వక్తలలాగే, సాధువాదాల మధ్య 'ఆచార్యునికి, అధ్యేతలకు ప్రణమిల్లి అస్సజి స్వస్థలంలో ఆసీను డైనాడు.

సభాసదులు అవాక్కయినారు. ఆనందుడు 'శ్రీఘనుని వైపు చూశాడు. శ్రీఘనుడు ఆనందుని వైపు చూశాడు.

"ఆనందా! నా దృష్టిని కేవలం కమలం పైననే నిలుపలేదు. కమలానికి అతీతమైన పరిసరాల్ని అవలోకించాను. ఈ సదస్సులో కేవలం ఒక కమలమే కాదు, ఏకాధికార్ధ సహస్ర సరోరుహాలు నాకు అగుపడుతున్నవి. అలాగే అయిదు నూట ఇద్దరు బుద్ధులు దృగ్గోచర మవుతున్నారు."

శ్రీ భగవానులు మందహాసం చేశారు.

---

*ప్రదేశిని లేక చూపుడు వేలు

భగవానుని దివ్య వచనం శ్రమణులకు శ్రవణసుఖద మైంది. వారిలో ఆలోచనలు కదలినవి.

'భగవానులు నుడివిన ఐదు వందల రెండు పద్మాలు ఎవరు?" 'ఐదు వందల భికులు, ఆనందుడూనూ. పద్మం సగతి సరేసరి!' 'భగవానులు ఉదోషించిన ఐదునూట ఒక్కరైన బుద్ధు లెవరు?"

'ఐదు వందల భిక్షువులు. తథాగతుడు ఆనందుడు పరిగణ్యుడు కాలేదు. '

భిక్షువులు తమ జీవితాలు ధన్యమైనవన్న భావనలో క్షణం పాటు ఉన్మీలిత నేత్రు లైనారు.

భగవానులు ప్రవచనాన్ని కొనసాగించారు.

"మిమ్ములను పద్మాలుగా చూస్తూనే చేతిలో ఉన్నదాని బాహ్యాభంతరాలను తలాగ్రాలను పరిశీలించాను. దాని ప్రత్యంగం దృష్టికే కాదు అంతర్దృష్టికి సైతం గోచరమైంది. భికులారా! వినండి. బుద్ధుడే మృణాలం. భిక్షువులే దళాలు.

ధర్మమే బీజకోశం. కోశస్థ బీజాలే 'ధమ్మ' "వినయ' సుత్తాలు. పద్మమే 'త్రిరత్న సమాహారం. త్రిరత్న సమూహమే పద్మం. ఆనందా! ఇది చూచే చిరునవ్వు నవ్వాను."

అందరు లేచి నిల్చొని సాధువాదాలు కావించారు. హర్షాతిశయతలో పద్మం అసియాడింది. బుద్ధుడు శుభలక్షణలక్షితమైన స్వీయహస్తాన్ని పైకెత్తి ఆనందుని కేసి చూస్తూ ఇలా అన్నాడు.

"ఆనందా! నీ వేమి చూశావు?"

ఆనందుడు వినమితశిరస్కుడై ఇలా అన్నాడు. "ఆయస్మా! మీరు పద్మాన్ని పైకెత్తి పట్టుకొన్నప్పుడు మిమ్మల్ని, మీ చేయిని, ఈ పూవును, కొందరు భికులను మాత్రమే నేను చూసేను. మరేమీ నాకు అగుపడలేదు."

ఆనందుడు మరేమీ అనలేదు. బుద్ధుని కరుణ ఆనందుని వైపు జాలువారింది. భిక్షువులు కారుణ్యం, ప్రేమ, స్నేహం మిళితమైన దృష్టితో ఆనందుని చూశారు. వారు తమ స్పందనలను ఆనందునికి ప్రసరింప చేశారు.

ఆనందుడు తనకు కల్గిన అనుభూతితో మందస్మితం కావించాడు.

ఆనందుడు ఇలా అన్నాడు. "భంతే! ఈ సంఘాన్ని ఒక విరాట్పురుషునిగా చూస్తున్నాను.

---

[1]పాలీలో ఆచరియ [2]బుద్ధుడు

అతని సర్వంకషధిషణయే మీరు. అతని మానసం మహాకస్సపుడు అతని పంచేంద్రియాలు మీతో పూర్వం కఠోరతప మాచరించిన మునులు. ఈ శ్రావకులు అతని స్థూల, సూక్ష్మ, అవయవాలు. ధిషణ, మనస్సు అవయవాలు ఆచరించాల్సింది ధర్మం. ఈ మూడింటి కలయికయే సంఘం. ధర్మసేనాని యైన సారిపుత్రుడు మీ దక్షిణహస్తం. మొగల్లన్న అతని సహచరులు మీ కరాంగుళులు. ఈ పద్మం "మెత్త'. నిరంతరం మీకు సేవలందించే నేను కుడి చేయిని. భగవన్! అందుకే నవ్వాను."

చేతిలో నిడుకొన్న తామరతోనే భగవానుడు లేచి నిల్చొనినాడు. బింబసార ప్రభృతి శ్రావకు లందరూ లేచి నిలుచున్నారు.

పునః పునః భిక్షువులు సాధువాలు సలిపారు.

భగవానుడు అన్నాడు "ఆనందా! భణే! నీ జన్మ ధన్యమైనది. నీలో ఇన్నాళ్ళుగా నిద్రాణమై యున్న 'ప్రజ్ఞ వికాసం చెందింది. అచిరకాలంలో నీవు అరంతుడ వౌతావు. నీలోని బుద్ధుడు మేల్కొన్నాడు. నీవు ధమ్మపథగామి వైనావు. నా మహానిర్వాణం తరువాత నీవు సమ్యక్ సంబోధివై నా ధర్మబోధల్ని సూత్రబద్ధం చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తావు. మహాకస్సపుని అండదండలు నీకుంటాయి. ఆయన ఆశీస్సులు నీకుంటాయి."

బుద్ధుడు రెండు చేతుల్ని పైకెత్తడంతో సదస్సు సుసంపన్నమైంది.

బిర్ఖువులు ముక్తకంఠాలతో త్రిశరణోచ్చారణ చేశారు.

బుద్ధం శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

సంఘం శరణం గచ్ఛామి.

ప్రతి వ్యక్తి ఒక పద్మం - ప్రతి పద్మం ఒక విశ్వం

---

[1]వివేక జ్ఞానం

# 21. సంబోధి : బుద్ధ భగవానుడు

శ్రీ బుద్ధభగవానుని జీవనగాథ ఒక అద్వితీయప్రస్థానగాథ. జీవన సత్యాన్ని దర్శించుకొని, దానిని ప్రబోధించి 'సార్వజనీనదుఃఖానికి హేతువైన మిథ్యా మాన్యతల నుండి, ఆచరణ నుండి సమస్త మానవతను విముక్తం కావించి, చైతన్యవంతం చేయాలన్న మహదాశయంతో ఆయన సల్పిన ప్రస్థానగాధ. మానవ లోకాన్ని ప్రేమానురాగాలకూ, కరుణకూ ఆకరం కావించే నిమిత్తం పరివారాన్ని బంధు మిత్రుల్ని, చివరకు రాజ్యాన్ని వాటి వల్ల పొందే సుఖాల్ని కాదని పారివ్రాజక జీవితాన్ని స్వీకరించి అనేక చారికలు సలిపాడా మహనీయుడు. అనేక ఆచార్యులను కలిసికొన్నాడు. వారి వద్ద గల విద్యను నేర్చుకొన్నాడు. వారి మతాలనూ, సాధనా పద్ధతులనూ అనుసరిస్తూ గంగాపరివాహప్రాంతమంతా తిరిగాడు. వారి సాధనా పద్ధతులూ ఆయనను సంతృప్తి పరచలేక పోయినవి. అందుకే వాటిని వదలి ముందుకు పోయాడు. నేరంజరాతీరాన గల బోధివృక్షం క్రింద సంబోధిని పొంది లోక విఖ్యాతుడైనాడు.

**1. పాత్రధారులు:**

ఆయన జీవన గాథలో గల పాత్రల వైపు దృష్టిక్షేపం చేసిన పక్షంలో ఎవరు ఎంతగా ఆయనను ప్రభావితం చేశారో, ఆయనవల్ల ఎంతగా ప్రభావిత మయ్యారో సుస్పష్టమౌతుంది.

సిద్ధార్థుడు గౌతమ గోత్రీయుడు. ఆనాటి ఆచారం ప్రకారం వ్యక్తులను పేరుతో కాక గోత్ర నామంతో పిలిచేవారు. అందుకే గౌతముడు. గోత్రానికి మూలపురుషుడైన గౌతముడు ధర్మసూత్ర కర్త. ఇక శుద్ధోధనుడు గౌతముని పితృపాదుడు కపిలవస్తు రాజ్యానికి ఏలిక. ఈయన పేరులో పవిత్రత అనేది అభివ్యంజితమవుతున్నది.

మాయాదేవి గౌతముని మాతృదేవత. ఈయమ పేరులో ప్రకృతి అనేది అభివ్యంజితమవుతున్నది.

బుద్ధ భగవానుని మూలాలు ఇలా ధర్మంలో, పావిత్రతలో, దైవత్వంలో ఆధారస్థానాలు కలిగినవై యున్నవి.

ఊయెలలోని పసికందుగా ఉన్నప్పుడే తల్లిని కోల్పోయిన గౌతముని ప్రేమతో పెంచి పెద్ద చేసిన మహిళ మహాప్రజాపతి. ఆమె ఆయన విమాత. అయినా, తల్లిని మించిన తల్లి యైంది.

[1] *Universal Suffering*

గ్రీష్మతాపాన్ని, హేమంతశైత్యాన్ని, పారివ్రాజికజీవనకాఠిన్యాన్ని స్థిరసంకల్పుడై సైచి మానవజీవనానికి గల అర్థాన్ని అవబోధం చేసుకొన్న సిద్ధార్థుడు సార్థక నామధేయుడైనాడు.

శ్రద్ధాసౌందర్యాల రాశియైన యశోధర ఆయన అర్ధాంగిని. మానవ జాతి ఉజ్జ్వలభవితకు ప్రతీక యైన రాహులుడు గౌతమ యశోధరల ఏకైక పుత్రుడు.

చెన్నుడు సిద్ధార్థుని రథసారథి. సంగడీడు. జరారుజామృత్యువుల వాస్తవికతను దర్శింప చేసిన ఒజ్జ.

ఆలారకాలాముడు గౌతముణ్ని యోగ విద్యానిష్ణాతుణ్ని కావించిన గురువు. అలాగే మార్గదర్శి.

ఉద్రకరామపుత్రుడు గౌతమునికి ధ్యానసమాధుల్ని నేర్పాడు. ఆచార్యు దవడమే కాక తత్త్వబోధకుడు కూడా.

ఆయన వ్యక్తిత్వ వికాసానికి మిత్రునిగా చెన్నడు, మార్గదర్శిగా ఆలారకాలాముడు, తత్త్వబోధకునిగా ఉద్రకుడు దోహదకారకులయ్యారు. ఆయన ప్రస్థానం మొదట మిత్రుని వైపు, మిత్రుని నుండి మార్గదర్శి వైపు, మార్గదర్శి నుండి తత్త్వవేత్త వైపు మూడు అంచెలుగా సాగింది.

ఇక కొండన, మహానాముడు, వప్పు, భద్దియ మరియు అస్సజి గౌతముడు సంబోధిని పొందక పూర్వం అతనితో కఠోర తపమాచరించిన సహచరులు. బహుశ్లేషకారకమూ, ప్రయోజన రహితమూ అయిన తపోమార్గాన్ని వదిలి మధ్య పథాన్ని అనుసరించిన గౌతముణ్ని వారు ఉద్రక రామ పుత్రుని ఆశ్రమంలో వదలి మరింత కఠోరమైన తపాన్ని ఆచరించే నిమిత్తం ముందుకు సాగిపోయారు. వీరు పంచ జ్ఞానేంద్రియాలకు ప్రతీకలు.

ఇక దేవదత్తుడు గౌతముని పిన తండ్రి కుమారుడు. చిననాటి నుండి ప్రతిస్పర్థిగా వ్యవహరించినవాడు. అనుక్షణం మార్పునొందే అంటే ఇష్టానిష్టాలకూ, స్థిరతస్థిరతలకు లోనై, బుద్ధికి క్షతి కల్గించే మనస్సునకు దేవదత్తుని ప్రతీకగా చెప్పుకొనవచ్చు....

గౌతముడు వనంలో సంచరిస్తున్న వేళ ఆయనకు ఆహారాన్ని క్షీరాన్నంగా సమర్పించిన సుజాత సౌజన్యానికి ప్రతీక.

**అభిసంబోధి**

నేరంజరానదీతీరాన గలన బోధివృక్షం క్రింద అభిసంబోధిని పొంది సిద్ధార్థుడు సమ్యక్సంబుద్ధుడైనాడు.

*దార్శనిక మాన్యతలు కావు. దార్శనిక మాన్యతలుగా స్వీకరించిన పక్షంలో ఇతర దర్శనాల వలె నిష్ఫలమౌతవి. బుద్ధ చర్య: రాహుల్ సాంకృతాయన్.*

అతిశయితనూ అంటే ఉగ్రతపశ్చర్యను, అధఃపతనానికి కారణభూతమైన ఇంద్రియ జన్యసుఖాసక్తిని పరిహరించే మార్గమే బుద్ధుడు సూచించిన మధ్యమ మార్గం.

భగవానుడు ప్రతిపాదించిన చతురార్యసత్యాలు అభిసంబోధిలో అనుభూతమైన వాస్తవిక దర్శనాలు. ఇవి : 1. దుఃఖం, 2. దుఃఖ సముదయం, 3. దుఃఖ నిరోధం, 4. దుఃఖ వినాశమార్గం.

ప్రథమార్యసత్యంగా ప్రోక్తమైన దుఃఖం దైహికం కావచ్చు. మానసికం కావచ్చు. జరావ్యాధిమరణాలు దైహికదుఃఖాలు. అప్రియమైన దానితో సంయోగం, ప్రియమైన దానితో వియోగం మానసిక దుఃఖంగా చెప్పుకొనాలి.

రెండవ ఆర్యసత్యం దుఃఖసముదయం. ఇది దుఃఖమూలానికి సంబంధించినది. అది తృష్ణ. దాని వల్లనే ప్రాణులు భవచక్రంలో కొనసాగుతారు.

మొదటి ఆర్యసత్యం దుఃఖం అస్తిత్వాన్ని రెండవ ఆర్యసత్యం దుఃఖం హేతువును చెబుతుంది. దుఃఖం నుండి విమోచనం సాధ్యమనేదే మూడవదైన దుఃఖనిరోధ ఆర్యసత్యం. దుఃఖ నిరోధమే 'నిర్వాణం. ఇక నాల్గవ ఆర్యసత్యం దుఃఖ వినాశానికి తోడ్పడే మార్గానికి సంబంధించింది. దీనిని మధ్యమ మార్గం అంటారు. ఇది తృష్ణను ఉపశమింప జేసి, దృష్టిని అభిజ్ఞను కలిగించి సంబోధి ద్వారా 'నిబ్బాన' స్థితికి చేర్చుతుంది. దీనికి ఎనిమిది అంగాలు ఉన్న కారణంగా ఆర్యసాష్టాంగమార్గంగా ప్రోక్తమైనది.

మరో ముఖ్య విషయం ఇది 'అతు'లను నిరాకరిస్తుంది. ఈ అతుల వ్యర్థతను గ్రహించాకే భగవానుడు మధ్యమమార్గాన్ని ఎన్నుకొన్నాడు.

సాష్టాంగ మార్గానికి కల అంగాలు ఇవి :

1. సమ్యక్ దృష్టి : వాస్తవికతను దర్శించటం
2. సమ్యక్ సంకల్పం : ద్రోహచింతన లేని సంకల్పం
3. సమ్యక్ వాక్కు : పరుషం, మిథ్య, కాని వచనం
4. సమ్యక్ కర్మాంతం : శుద్ధాచరణ
5. సమ్యక్ ఆజీవిక : ధర్మానికి కట్టుబడిన జీవనోపాధి
6. సమ్యక్ వ్యాయామం : సరియైన కృషి
7. సమ్యక్ స్మృతి : జాగరూకత, సావధానత
8. సమ్యక్ సమాధి : ఏకాగ్రత

ఈ సాష్టాంగ మార్గంలో మొదటి రెండు ప్రజ్ఞకు సంబంధించినవి. తరువాతి మూడు శీలానికి సంబంధించినవి. చివరి మూడు సమాధికి సంబంధించినవి.

గవేషణమూలం ధర్మంలో ఉంది (గౌతముడు). ప్రాకృతిక ప్రేరణ నుంచి (మహామాయ) పావిత్రత నుంచి (శుద్ధోధనుడు) గవేషణ ప్రాదుర్భావం. గణేషణకు భద్రతాభావం (ప్రజాపతి) అవసరం. గవేషణ ఆరంభదశలో జీవనవాస్తవికతలు (చరమ సత్యాలు) అవబోధం కావు.

ప్రారంభదశలో గవేషణకు స్ఫూర్తి కీర్తకామన యే (యశోధర) గవేషణ యశస్సుల మేళవింపు వల్లే ఉజ్జ్వల భవిత (రాహులుడు).

గవేషణలో తోడు (చెన్నడు) అవసరం. గవేషణం అంటే సువిశాల భూభాగాన్ని గాలించాల్సి ఉంటుంది. కాలి నడకన అది సాధ్యం కాదు, యానం అవసరముంటుంది. దానిని సమకూర్చి నడిపే సంగడీడు చెన్నడు.

జీవనవాస్తవికత అవబోధ మయ్యేది ఆప్తవాక్యం నుండే. జరారుజా మరణాలు జీవనవాస్తవికతలు. చెన్నడు ఆప్తుడు.

జీవన వాస్తవికతను గ్రహించిన మరుక్షణం వ్యక్తి తటస్థుడౌతాడు. క్షణభంగుర మైన సుఖాలకు విముఖుడౌతాడు. దుఃఖనివృత్తిమార్గాన్ని వెదుకుకుంటాడు.

గవేషణ అంతిమలక్ష్యం నిర్వాణం. సత్యసందర్శన మైనప్పుడే అది సాధ్యం. కీర్తికామన, భౌతికసుఖాసక్తి, గవేషణకు అవరోధాలు.

గవేషణకు తోడ్పడేవారు ముగ్గురు.

1. మిత్రుడు (చెన్నడు)
2. మార్గదర్శి (ఆలారకాలాముడు)
3. తత్త్వబోధకుడు (ఉద్రక రామపుత్రుడు)

మధ్యమమార్గాన్ని దర్శించుకొనడమే అభిసంబోధి. చతురార్యసత్యాలు వ్యాప్తి నొంది అష్టాంగిక మార్గమేర్పడింది. అదే మధ్యమ మార్గం. అభిసంబోధియే సిద్దార్థ గీతముని సమ్యక్ సంబుద్ధుని కావించింది.

అభిసంబోధి ఒక్కటే లోకానికి కళ్యాణప్రదం కాజాలదు. అది కరుణతో మేళవించినప్పుడే సమాజంలోని ఉచ్చ మధ్యమ నిమ్న స్థరాలకు వ్యాపించి ప్రతిదాన్ని

---

[1]*పాలీలో నిబ్బానం. సం॥లో నిర్వాణం.*

[2]*గ్రామ్యసుఖలోలుపత. గ్రామ్యవృత్తి. ఇష్టానిష్టాలు మోహం ద్వేషం.* [3]*కఠోర తపశ్చర్య*

చైతన్యవంతం చేస్తుంది. దీనికి త్యాజ్యమైన దేదీ లేదు. దూరమేగిన వాటిని (పంచ వర్గీయ భిక్షువులు) పంచేంద్రియాలు దరిజేర్చుకుంటుంది. వాటిని కఠిన మార్గాన్నుండి తప్పించి సులువైన త్రోవను చూపుతుంది. ధర్మచక్రపరివర్తనకు పూనుకొంటుంది.

గవేషణకు (సిద్ధార్థుడు) ప్రతిబంధకమైన మానసం (దేవదత్తుడు) అభిసంబోధి విరజిమ్మే వెలుగులపై మనసుపడి దానిని చేరబోతుంది. దాని వెలుగులో వెలుగుతూ తనను మిన్నగా ఎంచుకొంటుంది. తీవ్రమైన తృష్ణచే కీర్తికాముకతచే మానసం అభిసంబోధిని ధ్వంసం కావించాలని చూస్తుంది.

ఆనందంతో (ఆనందుడు) గల అనుబంధం వల్ల అనుక్షణం ఏదో ఒక వికారానికి లోనయ్యే మానసం (దేవత్తుడు) పన్నే కుట్రకు అభిసంబోధి (గౌతముడు) బలి కాదు. ఆనందం (ఆనందుడు) గవేషణను (సిద్ధార్థుడు) అంటిపెట్టుకొని ఉన్నట్లు గానే సంబోధిని (సమ్యక్ సంబుద్ధుడు) అంటిపెట్టుకొని యుంటుంది. ఇవి విడదీయరాని యుగళమౌతవి. మనస్సు నుండి సంబోధిని రక్షిస్తాయి. సంబోధిని ఆనందాన్ని వీడి తానే నిజమైన వెలుగు అన్నట్లుగా మానసం ఎన్ని హొయలు వోయినా చివరకు విషాదానికే గురియౌతుంది.

సంబోధి ఆనందాల్ని తిరిగి చేరుకొని మానసం సైమిత్యాన్ని పొందుతుంది. సంబోధి ఆనందంతో విడదీయరానిదై మేలుకొన్న జ్ఞానేంద్రియాలతో మేళవించి జగత్తుకు 'ధమ్మపథాన్ని' చూపుతుంది.

త్రిరత్నాల శరణు జొచ్చిన వాడు నిర్వాణానుభూతిని పొందుతాడు. త్రిరత్నాలు సంబోధిని పొందేందుకు ఉపకరణాలవుతవి. సంబోధి విపశ్యనకు ద్వారాలు తెరుస్తుంది. మానవతను సత్పథగామిని చేస్తుంది.

అష్టాంగమార్గం, కారుణ్యభావన మానవాళిని వైశ్విక ఏకత్వం వైపు నడిపిస్తాయి. సంబోధి ద్వేషాన్ని (అంగులిమాలుడు) కారుణ్యంతో జయిస్తుంది. ద్వేషాన్ని అనురాగంగా మారుస్తుంది. ఇది ప్రస్థానగాథ. విశ్వానికి నిర్వాణ పథాన్ని చూపించిన మహనీయుని గాథ. రెండు వేల ఐదు వందల ఏళ్ళు గడచినా, నవ్యతను పదిలంగా నిలుపుకొన్న భవ్యగాథ.

*జీవన్ముక్తుడవై-ఇతరులకు జీవన్ముక్తులయ్యే మార్గాన్ని చూపించు*
*బుద్ధుడివీ బోధిసత్వుడివీ నీవు కావాలి.*

# హారతిళ్ళు

## శ్రీ గట్టు నారాయణ గారికి



ఎంత ఎత్తుకు ఎదిగినా
ఎత్తు లేవీ లేని వాడవు.
ఎత్తి మనుజుని ప్రేమతో,
హత్తుకొనుటే నీకు తెలియును.

నీవు నిల్పిన గుళ్ళలో
నెరపుదురు నిత్యార్చనల్.
నీవు తెరచిన బళ్ళలో
పఠన పాఠన యజ్ఞముల్.

బ్రతుకు నందలి మిట్టపల్లము
లెన్నియో నీవరసి యున్నా,
పెదవి పై గల హాసరేఖను
చెదరనీయవు సుంతయైనా.

నీవు నాటిన తరువు లెదిగి
కురియు నోయీ పూలజల్లులు
నీవు నడిచే బాట లన్నిట
వేతు రోయీ రంగ వల్లులు.

ఇరులు కమ్మిన వేళలో
ఏ దిక్కు నరయని మలుపులో
'నారాయణా' అను పిలుపె చాలును
వచ్చి నిలుతువు ముంగిటన్.

జనుల దీవెన లందు కోవలె !
శతవసంతము లీవు మనవలె !
నీవు పుట్టిన రోజు పండుగ
గోకులాష్టమి మాకు కావలె !

పవలు రేలు శ్రమించినా
అలుపు సొలుపులు నిన్ను అంటవు.
ఏమి కోరవు; ఏమి వేడవు
నీవు మా పుణ్యాల పంటవు.

గజానన్ తామన్